# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 18 సెప్టెంబర్ 2025 | సంపుటి: 9 | సంచిక: 260 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


### డ్రైవర్‘లెస్’ డెలివరీ వెహికిల్స్




2

### ఈసారి దసరా స్పెషల్ సిందూర్ బొమ్మల కొలువు



2

# రజాకార్ల అరాచకాలను భరించిన నేల ఇది

## భారత్‌ను దక్షిణాదితో ఏకం చేసే నగరం హైదరాబాద్

- మోడీ నేతృత్వంలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది
- ఆపరేషన్ సిందూర్‌లో ‘ప్రస్తుతం’ చిన్న పాజ్ మాత్రమే
- విమోచన దినోత్సవంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- అందరికీ నమస్కారం అంటూ తెలుగులో ప్రసంగం ప్రారంభం



హైదరాబాద్, సెప్టెంబర్ 17, (మనం బ్యూరో): ఆపరేషన్ సిందూర్ చిన్న పాజ్ మాత్రమే. ఇంకా ముగియలేదు. రానున్న రోజుల్లోనూ కొనసాగుతుందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సరిహద్దుల్లో పాక్ కాల్పుల విరమణ ఉల్లంఘిస్తున్న ప్రతీ సారి భారత్ సమర్థంగా తిప్పికొడుతుందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బుధవారం రాష్ట్ర బీజేపీ శాఖ ఆధ్వర్యంలో

...మిగతా 2లో

### నిజాం పాలనలో ఎన్నో దారుణాలు

9

### రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్త

తన జన్మదినం సందర్భంగా ప్రధాని మోడీ

2

### సాయుధ పోరాటం స్ఫూర్తితో

# పదేండ్ల నిరంకుశ పాలనను అంతం చేసినం

## నిజాం నియంత పాలనపై సామాన్యుని విజయమే నేటి స్వేచ్ఛా జీవనం

### సామాజిక న్యాయంలో ప్రజాపాలన దేశానికే రోల్‌మోడల్

- అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడేందుకు ప్రయత్నిస్తున్నం
- ప్రజాపాలన దినోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- గాంధీభవన్‌లో ఘనంగా విలీన దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, సెప్టెంబర్ 17, (మనం బ్యూరో): సెప్టెంబర్ 17, 1948 తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయి అనీ, అదే విధంగా డిసెంబర్ 7, 2023 స్వరాష్ట్ర ప్రజాస్వామ్య ప్రస్థానంలో మరో మైలురాయి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నో ఆశలు ఆకాంక్షలతో మొదలైన స్వరాష్ట్ర ప్రస్థానం మళ్లీ నియంతృత్వ నిర్బంధంలోకి జారి పోయిన తీరు గడచిన పదేళ్లలో చూశామనీ, నాటి సాయుధ పోరాట స్ఫూర్తితో ఆ పాలనను అంతమొందించామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా బుధవారం పబ్లిక్ గార్డెన్స్‌లో ప్రజా పాలన

...మిగతా 2లో



### రాష్ట్ర విద్యా విధానం దేశానికి దిక్సూచిగా ఉండాలె

- విద్యారంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలె
- భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడలు మేళవింపుతో ఉండాలి
- సిలబస్, వనరుల సమీకరణ, విధానం అమలుపై స్పష్టత అవసరం
- విజన్ డాక్యుమెంట్ 2047లో ఎడ్యుకేషన్‌కు స్పెషల్ చాప్టర్
- విద్యా విధానంపై సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

2



### ప్రతిభావంతులను కించపరచడం సరికాదు

గ్రూప్-1 సాధకులపై రాజకీయ పార్టీల వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్‌బాబు ఖండన

సూర్యాపేట, సెప్టెంబర్ 17: గ్రూప్-1 పరీక్షల అంశంపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చిత్తశుద్ధితో ముందుకు పోతోందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. గ్రూప్-1 పరీక్షల విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగుల విషయంలో రాజీపడే ప్రసక్తి ఉండదన్నారు. కష్టపడి ఉద్యోగం సాధించి ముందుకు వెళ్తున్న ప్రతిభావంతులను కించపరుస్తూ మాట్లాడటం ఖండనీయమన్నారు. రాజకీయ పార్టీల వైఖరి సరికాదని హితవు పలికారు.

# వైద్య సేవలు ఆగవు

### ఆరోగ్య శ్రీపై మంత్రి దామోదర రాజనర్సింహ

### చికిత్సలు నిరాకరించొద్దంటూ ‘నెట్ వర్క్’ హాస్పిటళ్లకు సూచన



హైదరాబాద్, సెప్టెంబర్ 17: రాష్ట్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను యథాతథంగా కొనసాగించాలని ఆరోగ్యశ్రీ నెట్వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ను తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోరారు. గత తొమ్మిదిన్నరేళ్లలో చేయని సమ్మె ఇప్పుడు ఎందుకు చేయాల్సి వస్తోందని ఆయన వారిని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకానికి కనీసం రూ. 50 కోట్లు కూడా ఇచ్చే పరిస్థితి లేదని, కానీ తాము నెలకు రూ. 100 కోట్లు చెల్లించేందుకు అంగీకారం తెలిపినా సమ్మె చేయడమేంటని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మండిపడ్డారు. బుధవారం అమీర్ పేట సీహెచ్సీలో జరిగిన ఓ కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత తొమ్మిదన్నరేండ్లలో చేయని సమ్మె ఇప్పుడు చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు తాము ఎంతో కమిట్మెంట్ తో కృషి చేస్తున్నామని తెలిపారు. తాము ఆరోగ్యశ్రీలో కొత్తగా 163 ప్రొసీజర్స్ తీసుకురావడంతో పాటు ధరలను రివైజ్ చేయడంతో సుమారు రూ. 487 కోట్ల భారం ప్రభుత్వంపై పడిందన్నారు. ప్రస్తుతం 1385 ప్రొసీజర్స్ ద్వారా

...మిగతా 2లో

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ

## తన పార్టీ పేరు ప్రకటించిన తీన్మార్ మల్లన్న




- పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ చింతపండు నవీన్
- బీసీల ఆత్మగౌరవ జెండా రేపటి నుంచి రెపరెపలాడబోతోందని వ్యాఖ్య
- అధ్యక్షుడిగా మల్లన్న ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం
- ప్రధాన కార్యదర్శులుగా నలుగురికి అవకాశం

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ రాజకీయ యవనికపై మరో కొత్త పార్టీ ఆవిర్భవించింది. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ సొంతంగా రాజకీయ పార్టీని స్థాపించారు. ‘తెలంగాణ రాజ్యాధికార పార్టీ’

...మిగతా 2లో

### పార్టీని స్వాగతిస్తున్నాం: మహేశ్ గౌడ్

2

### ఆర్‌టీసీలో డ్రైవర్లు, శ్రామిక్ ఉద్యోగాలు

1,743 పోస్టుల భర్తీకి విడుదలైన నోటిఫికేషన్

హైదరాబాద్, మనం ప్రతినిధి: టీజీఎస్ ఆర్‌టీసీలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఆర్‌టీసీలో

...మిగతా 2లో

### సాయుధ రైతాంగ పోరాట యోధుడు మొయినుద్దీన్‌ను సత్కరించిన కవిత

- జాగృతి కార్యాలయంలో జెండా అవిష్కరణ కార్యక్రమం

హైదరాబాద్,మనం ప్రత్యేక ప్రతినిధి: తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా బుధవారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో కల్వకుంట్ల కవిత జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణలో సాయుధ రైతాంగ పోరాట యోధుడు జనగాం ప్రాంతానికి చెందిన ఎం.కె మొయినొద్దీన్‌ను కవిత సత్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సాయుధ రైతాంగ పోరాటంలో ఉద్యమకారులు తన ఆస్తిని కూడా వదులుకొని దొరలు,

...మిగతా 2లో




### అమెరికా నేతలు అవినీతి పరులు

పాక్ మంత్రి షాకింగ్ కామెంట్లు

ఇస్లామాబాద్, సెప్టెంబర్ 17: ఓ పక్క పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అమెరికా పర్యటనకు రంగం సిద్ధం చేసుకుంటుంటే.. మరో వైపు ఆయన మంత్రి వర్గ సభ్యులు మాత్రం అగ్రరాజ్యాన్ని ఇరుకున పడేస్తున్నారు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమెరికా నేతలు అవినీతిపరులని.. వారు ఇజ్రాయెల్ నుంచి లంచాలు స్వీకరిస్తున్నారని ఆరోపించారు.

పాకిస్థాన్‌నకు చెందిన జియో టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసిఫ్ మాట్లాడుతూ ‘‘మేము లంచాలు స్వీకరించామని తీవ్ర అపవాదులు ఎదుర్కొన్నాం. కానీ, అమెరికా రాజకీయ నాయకులు ఇజ్రాయెల్ నుంచి బహిరంగంగానే లంచాలు తీసుకున్నారు. అదే నేను లంచం స్వీకరించాల్సి వస్తే.. ఎక్కడో చాటుగా తీసుకుంటాను. మేము నిందలు

...మిగతా 2లో

# మమ్మల్ని జంతువుల్లా ట్రీట్ చేసిండ్రు



## జార్జియాలో భారతీయులపై అమానవీయ ప్రవర్తన

### ఇన్‌స్టా గ్రామ్‌లో పోస్టు పెట్టిన మహిళ

హైదరాబాద్, సెప్టెంబర్ 17: ఈ-వీసాలు, సరైన పత్రాలతో జార్జియాకు వెళ్లిన తమ పట్ల అక్కడి అధికారులు అమానవీయంగా ప్రవర్తించారని ఓ భారతీయ మహిళ ఆరోపించారు. జంతువుల్లా వీధుల్లో కూర్చోబెట్టారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఇన్‌స్టా గ్రామ్‌లో పెట్టిన పోస్టు వైరల్ అవుతోంది. ధ్రువీ పటేల్ అనే మహిళ ఈ పోస్టు పెట్టారు. అర్మేనియాలోని సడఖ్లో సరిహద్దు నుంచి జార్జియాలోకి వెళ్తున్న 56 మంది భారతీయులను అక్కడి అధికారులు ఇబ్బందులకు గురిచేశారని ఆమె ఆరోపించారు. తమ వద్ద అన్ని పత్రాలు ఉన్నప్పటికీ.. 5 గంటలకు పైగా గడ్డ కట్టే చలిలో ఉంచారన్నారు. ఆ సమయంలో ఆహారం ఇవ్వకపోగా.. కనీసం టాయిలెట్ కు వెళ్లేందుకు కూడా అనుమతించలేదని పేర్కొన్నారు. 2 గంటలపాటు తమ పాస్ పోర్టులను తీసుకుని జంతువుల్లా ఫుట్ పాత్‌లపై కూచోబెట్టారని అందులో రాశారు. నేరస్థుల్లా తమను వీడియోలు కూడా తీసినట్లు తెలిపారు. మా వద్ద ఉన్న డాక్యుమెంట్స్ ను పూర్తిగా పరిశీలించకుండానే.. వీసాలు తప్పుగా

...మిగతా 2లో

### లండన్‌లో ట్రంప్.. జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫొటో ప్రదర్శన

లండన్, సెప్టెంబర్ 17: అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ యూకే పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలో ట్రంప్‌నకు అక్కడ చేదు అనుభవం ఎదురైంది. అధ్యక్షుడి రాకకు నిరసనగా.. లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్ కలిసి ఉన్న ఫొటోలను కొందరు వ్యక్తులు ప్రదర్శించారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

ట్రంప్, ఆయన సతీమణి మెలానియా లండన్‌కు చేరుకున్నారు. వీరికి బ్రిటన్ రాజు చార్లెస్ ఆతిథ్యం ఇవ్వనున్నారు. రాయల్ విండ్‌సర్ కోటలో వీరు బస చేయనున్నారు. ఈ భవనంపైనే ట్రంప్, ఎప్‌స్టీన్ కలిసి ఉన్న ఫొటోలతో పాటు.. ఎప్‌స్టీన్ కేసుకు



సంబంధించిన వీడియోలను కొందరు ప్రదర్శించారు. అధ్యక్షుడి రాకకు నిరసనగానే ఇలా చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో వెంటనే స్పందించిన అధికారులు ఆ ప్రదర్శనను నిలిపివేశారు. దీనికి సంబంధించి

...మిగతా 2లో

# లండన్‌లో ట్రంప్.. జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫొటో ప్రదర్శన

(మొదటి పేజీ తరువాయి)

నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు. రాజకీయ నాయకులకు వ్యతిరేకంగా వైరల్ స్టంట్లకు పేరొందిన 'లెడ్ బై డాంకీస్' అనే గ్రూప్ ఇలా చేసినట్లు తెలుస్తోంది. లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌నకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయంటూ ఇటీవల పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. 1990-2000 మధ్య ఫ్లోరిడాలో వీరిద్దరూ పక్క పక్క నివాసాల్లో ఉండేవారు. దీనిపై గతంలో ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ''నాకు 15 ఏళ్ల నుంచి ఎప్‌స్టీన్ తెలుసు. అద్భుతమైన వ్యక్తి. అతడు కూడా నాలానే అందమైన యువతులు, బాలికలను ఇష్టపడతాడు'' అంటూ వ్యాఖ్యానించారు. కొంతకాలం తర్వాత ఎప్‌స్టీన్, ట్రంప్‌ల మధ్య ఆర్థిక విషయాల్లో విభేదాలు తలెత్తాయి. 2006 నుంచి తనతో సంబంధాలు తెంచుకున్నానని ట్రంప్ ఇటీవల వెల్లడించారు. అమెరికాను కుదిపేసిన సెక్స్ కుంభకోణంలో నిందితుడైన ఎప్‌స్టీన్‌ను 2019లో అరెస్టు చేశారు. అదే ఏడాది ఆగస్టులో అతడు జైల్లో అనుమానాస్పద స్థితిలో మరణించాడు.

# ఈసారి దసరా స్పెషల్ సిందూర్ బొమ్మల కొలువు

**కోయంబత్తూర్, సెప్టెంబర్ 17:** దేవీ నవరాత్రుల సందర్భంగా బొమ్మ కొలువులు పెట్టడం, వాటి కోసం ఇంట్లో జరిగే ఆనందాల హడావుడి మనందరికీ అనుభవేకవేద్యమే. ఈ రోజుల్లో అమ్మవారిని పూజించడంతోబాటు దైవానికి ప్రతీకలుగా భావించే బొమ్మల్ని అందంగా అమరుస్తారు. ఈ నేపథ్యంలో తమిళనాడులో కోయంబత్తూర్‌లో ప్రత్యేకంగా తయారయ్యే గోలు బొమ్మల అమ్మకాలు పెరిగాయి. అయితే ఈసారి తయారీదారులు ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని.. త్రివిధ దళాల కమాండర్లు, సైనికుల ఆకృతిలో బొమ్మలను తీర్చిదిద్దారు. ఈ ప్రత్యేకత బాగా ప్రజలను ఆకట్టుకుంటోంది. దాంతో ఈసారి బొమ్మల కొలువు కోసం వాటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రతిఏటా గోలు పూజ (బొమ్మల కొలువు) కోసం ఏటా కొత్తరకం ఆకృతుల్లో బొమ్మలు సిద్ధమవుతుంటాయి. శరవణకుమార్ అనే తయారీదారుడు మాట్లాడుతూ..'' ప్రతి ఏటా నవరాత్రి సమయంలో గోలు బొమ్మల అమ్మకాలు పెరుగుతాయి. 20 ఏళ్ల నుంచి నేను ఈ వ్యాపారంలో ఉన్నాను. ఈసారి ప్రహ్లాదుడి కథను గుర్తుచేసుకునేలా అలాగే ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా భారత సైన్యానికి చెందిన త్రివిధ దళాల కమాండర్ల బొమ్మలను రూపొందించారు'' అని వెల్లడించారు.

# అమెరికా నేతలు అవినీతిపరులు

(మొదటి పేజీ తరువాయి)

మోశాం కానీ.. వారు బహిరంగంగానే చేస్తున్నారు'' అని అన్నారు. అమెరికా మిలిటరీ అధికారులు, ప్రతినిధులసభ సభ్యులు, ఉన్నత స్థాయి పాలకులు తాము ఇజ్రాయెల్ నుంచి నిధులు అందుకున్నట్లు అంగీకరించారన్నారు. మరో వైపు పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఏకంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకే షాక్ ఇచ్చారు. భారత్ ఎప్పుడూ మూడో దేశం మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదన్నారు. ఆయన అల్-జజీరాతో మాట్లాడుతూ ''మూడో పక్షం పాత్ర ఉన్నా మేము ఏమీ అనుకోం. ఇది ద్వైపాక్షిక అంశమే అని భారత్ పేర్కొంది. సరే ఏ చర్చలు జరిగినా.. ఉగ్రవాదం, వాణిజ్యం, జమ్ముకశ్మీర్‌పై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉంది'' అని పేర్కొన్నారు. ''మే 10వ తేదీన సీజ్ ఫైర్ ఆఫర్ వచ్చిన వేళ.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత్-పాక్ చర్చలు తటస్థ వేదికగా జరుగుతాయని చెప్పారు. కానీ, జులై 25వ తేదీన దీనిపై నేను మళ్లీ ఆయన్ను ప్రశ్నించాను. దీనికి రూబియో స్పందిస్తూ.. భారత్ ద్వైపాక్షిక అంశంగానే దీనిని చూస్తోందని తేల్చిచెప్పింది'' అని పేర్కొన్నారు.పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిం మునీర్ త్వరలోనే అమెరికాలో పర్యటించనున్నారు.

# పదేండ్ల నిరంకుశ పాలనను అంతం చేసినం

(మొదటి పేజీ తరువాయి)

దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనదనీ, నిజాం నియంతృత్వంపై సామాన్యుడు సాయుధ పోరాటంతో సాధించుకున్న విజయమే ఈ రోజు మనం అనుభవిస్తున్న ప్రజాస్వామ్యమని పేర్కొన్నారు. స్వేచ్ఛా మన జీవన విధానమనీ, ఆ స్వేచ్ఛా సాధనకు ప్రాణ త్యాగాలకు సైతం వెనుకాడని జాతి మనదని గుర్తు చేశారు. అహంకారపు ఆలోచనలు, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి మా పాలనతో తావు లేదు. కష్టమైనా, నష్టమైనా ప్రజలతో పంచుకుంటున్నాం. ప్రజల ఆకాంక్షలు, వారి ఆలోచనలే ప్రామాణికంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. తీసుకున్న నిర్ణయాలలో మంచి చెడులను విశ్లేషించే అవకాశం ఇస్తున్నామనీ, తప్పులుంటే దిద్దుకుంటున్నాం మంచి చేయడమే బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడాలన్న తపనతో పని చేస్తున్నామనీ, ప్రతీ పేదవాడి ముఖంలో ఆనందమే లక్ష్యంగా సంక్షేమ చరిత్రను తిరగరాస్తున్నామని చెప్పారు. అభివృద్ధిలోనే కాదు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం విషయంలో కూడా తెలంగాణ దేశానికి రోల్ మోడల్‌గా ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందిన వారిలో ఇప్పటి వరకు 10 మంది అఖిల భారత సర్వీసులకు ఎంపిక కావడం రాష్ట్రానికి గర్వకారణమనీ, భూ పోరాటాల చరిత్రనే తెలంగాణ చరిత్ర, గత ప్రభుత్వం తెచ్చిన ధరణి కారణంగా రెవెన్యూ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్థమైందని విమర్శించారు. కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంలో బెండలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో పాల్గొన్నప్పుడు ఆ పేదల కళ్లల్లో చూసిన ఆనందం ఎనలేని సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. సన్న బియ్యం పథకానికి ఈ రోజు తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందనీ, దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఇలాంటి పథకం లేదన్నారు. గత పాలకుల తప్పులను సరిదిద్ది ప్రతి చుక్క నీటిపై పక్కా హక్కులు సాధించే దిశగా కృష్ణా జలాల నీటి వాటా విషయంలో న్యాయ పోరాటానికి సిద్ధమయ్యామని వెల్లడించారు.

**గాంధీభవన్‌లో విలీన దినోత్సవ వేడుకలు**

కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ కార్యాలయం గాంధీభవన్‌లో తెలంగాణ విలీన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం మాట్లాడుతూ నెహ్రూ ఆదేశాలతో పటేల్ ఆపరేషన్ పోలో పేరుతో హైదరాబాద్ సంస్థానాన్ని దేశంలో విలీనం చేశారని చెప్పారు. బీజేపీకి చరిత్ర తెలియదు, దాన్ని తిరగరాసుడే తెలుసు, వీళ్లకి గాంధీ అంటే పడదు ఆయనను హత్య చేసిన గాడ్సే దేవుడని పేర్కొన్నారు. ఇది పాత బీజేపీ కాదు 2014లో పుట్టిన మోడీ-షా బీజేపీ, చరిత్రను వక్రీకరించడమే వీరికి తెలుసు. గాంధీని గౌరవించని, గాడ్సేను దేవుడిగా చూసే వారి నుంచి దేశభక్తిని ఆశించడం వృధా అని ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# డ్రైవర్ 'లెస్' డెలివరీ వెహికిల్స్

**హైదరాబాద్, సెప్టెంబర్ 17:** అబుదాబిలోని మస్దార్ నగరంలో డ్రైవర్ రహిత వాహనాలు నడిపేందుకు అవకాశం కల్పించారు. దీనిని పబ్లిక్-ప్రైవేట్ రంగాలు కలిసి తొలుత ఏర్పాటు చేశాయి. దీనిలో స్థానిక టెక్నాలజీ, లాజిస్టిక్స్ సంస్థలు భాగస్వాములయ్యాయి. ఎమిరేట్స్‌లో కత్రిమ మేధతో పనిచేసే లాజిస్టిక్స్ రంగం అభివద్ధి వైపు వేసిన తొలి అడుగుగా దీనిని భావించవచ్చు. అబుదాబి మొబిలిటీగా పేరున్న ది ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ సెంటర్ (ఐటీసీ) దీనిని తొలిసారి పైలట్ ప్రోగ్రామ్‌గా మొదలుపెట్టింది. స్థిరమైన పట్టణాభివద్ధి సాధిస్తున్న నగరంగా మస్దార్ సిటీకి పేరుంది. ఇక కే2 సంస్థకు అనుబంధంగా ఉన్న ఆటోగో అనే కంపెనీ ఈ వాహనాన్ని అభివద్ధి చేసింది. వీటిల్లో డ్రైవర్లు ఉండరు. కేవలం అత్యాధునిక స్మార్ట్ మొబిలిటీ వ్యవస్థ ఆధారంగా ఇది పనిచేస్తుంది. ఈ క్రమంలో సెల్ఫ్‌డ్రైవింగ్ వాహనాలకు తొలి లైసెన్స్ ప్లేట్‌ను కూడా జారీ చేశారు. కేవలం నగర పరిస్థితుల్లో మాత్రమే ప్రయాణించేలా వీటిని రూపొందించారు. ఇవి ట్రాఫిక్ చట్టాలు, నిబంధనలు ఫాలో అవుతాయి.

# మమ్మల్ని జంతువుల్లా ట్రీట్ చేసిండ్రు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని చెప్పారని వెల్లడించారు. భారతీయుల పట్ల జార్జియా అధికారుల తీరు సిగ్గుచేటంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పోస్టుకు ప్రధాని మోడీ, విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ లను ట్యాగ్ చేశారు. ఈ ఘటనపై మన ప్రభుత్వం స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే, వారు ఇంకా స్పందించలేదు.

# రాష్ట్ర విద్యా విధానం దేశానికి దిక్సూచిగా ఉండాలె

**హైదరాబాద్, సెప్టెంబర్ 17, (మనం బ్యూరో):** క్షేత్ర స్థాయి పరిస్థితులు, అధ్యయనం, భవిష్యత్ అవసరాలకు తగినట్లు రూపొందించే విద్యా విధానం దేశ విద్యా విధానానికి దిక్సూచిగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారి దగ్గర జ్ఞానం లేదనీ, జ్ఞానం ఉన్న చోట భాష లేదనీ, రెండు ఉన్న చోట నైపుణ్యాలు లేవనీ, కానీ ఈ మూడింటి కలబోతగా కొత్త విద్యా విధానం ఉండాలని పేర్కొన్నారు. తెలంగాణ విద్యా విధానం నివేదిక రూపకల్పనపై రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. విద్యారంగం ప్రాధాన్యతను గుర్తించిన దేశ తొలి ప్రధాని నెహ్రూ దేశంలో విశ్వ విద్యాలయాలు, ఐఐటీలు వంటి ఉన్నత విద్యా సంస్థలను స్థాపించారని తెలిపారు. కాలానుగుణంగా ఇంజినీరింగ్ కళాశాలలు వచ్చినందునే పెద్ద సంఖ్యలో సాఫ్ట్‌వేర్ రంగంలో మన యువత రాణిస్తున్నారనీ, అయినప్పటికీ ఏటా బయటకు వస్తున్న లక్షలాది మంది యువకులలో ఒక్క శాతం కూడా ఉద్యోగాలు దక్కడం లేదనీ తగినంత నైపుణ్యం లేకపోవడమే అందుకు కారణమన్నారు. ఆ రంగంలో నైపుణ్యం పెంచడంతో పాటు ఇంకా పలు రంగాల్లో అవకాశాలు విస్తృతమైనందున ఆ అవకాశాలు అందిపుచ్చుకునేలా విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా రంగానికి ప్రభుత్వం ప్రతీ ఏటా భారీగా నిధులు




కేటాయిస్తున్నప్పటికీ ఏటికేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోందనీ, నర్సరీకి ప్రైవేటు పాఠశాలలో చేరిన వారు తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు చూడటం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ఆ విధమైన ధీమా కల్పించగలిగితే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్చుతారనీ, ఆ దిశగా నూతన విద్యా విధానం ఉండాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉపాధ్యాయులు ఉండాలనే ఉద్దేశంతో తాము అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామనీ, వారు బోధనపై దృష్టి పెట్టేలా ప్రమోషన్లు కల్పించామన్నారు. విద్యా విధానంపై ఎంత వ్యయమైనా వెనుకాడమనీ, ప్రత్యేక విద్యా కార్పొరేషన్ ఏర్పాటు చేసి మౌలిక వసతులు, ప్రమాణాల మెరుగుకు ఖర్చు చేయాలని నిర్ణయించామన్నారు. విద్యాభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి తొలగించాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశామనీ, ఆశించిన స్థాయిలో విద్యా విధానం అమలుకు వివిధ ఫౌండేషన్లు, ఎన్జీవోల సహకారం తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# సాయుధ రైతాంగ పోరాట యోధుడు మొయినుద్దీన్‌ను సత్కరించిన కవిత

(మొదటి పేజీ తరువాయి)

భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తు చేశారు. పవిత్రమైన తెలంగాణ విలీన దినోత్సవాన్ని బీజేపీ విమోచన దినోత్సవమంటూ ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఒకవైపు తెలంగాణ చరిత్రను వక్రీకరిస్తూ మరోవైపు మత విద్వేషాలు రెచ్చగొడుతూ బీజేపీ రాజకీయంగా బలపడాలని చూస్తోందన్నారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో 1942 లో సాయుధ రైతాంగ పోరాటం మొదలైందని, ఆనాటి పోరాట స్ఫూర్తిని ఇప్పటికీ రష్యాన్ యూనివర్సిటీల్లో పాఠాలుగా చెబుతున్నారన్నారు. కాగా బీజేపీ నాయకులు ఇది ముస్లిం రాజులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమని చిత్రీకరిస్తుండటం విచారకరమన్నారు. అదేవిధంగా సెప్టెంబర్ 17 ను బీజేపీ నాయకత్వం తెలంగాణ విమోచన దినంగా రుద్దే ప్రయత్నం చేస్తోందని, 2023 ఎన్నికలకు ముందు తెలంగాణకు వచ్చి విమోచన దినోత్సవం అంటూ తప్పుడు ప్రచారం



మొదలుపెట్టారన్నారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక సీఎం లను ఆ కార్యక్రమానికి ఆహ్వానించారని, అయితే తెలంగాణ చరిత్రను వక్రీకరిస్తున్నారంటూ కేసీఆర్ ఆ కార్యక్రమానికి వెళ్లలేదని గుర్తు చేశారు.

# రజాకార్ల అరాచకాలను భరించిన నేల ఇది

(మొదటి పేజీ తరువాయి)

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, కిషన్ రెడ్డి, బండి సంజయ్ పాల్గొన్నారు. ముందుగా సైనిక వందనం స్వీకరించిన అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళులు అర్పించారు. తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి తెలంగాణకు ఎంతో ముఖ్యమైన విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. భారత్‌ను దక్షిణాదితో ఏకం చేసే నగరం హైదరాబాద్ అనీ, ఉక్కు మనిషి వల్లభాయ్ పటేల్ హైదరాబాద్‌కు విముక్తి కల్పించి భారత్‌తో ఏకం చేశారన్నారు. అఖండ భారత్ కోసం పటేల్ కృషి చేశారనీ, రాజకీయ పరిపక్వతతో ఆనాటి సంస్థానాలను విలీనం చేశారని గుర్తు చేశారు. రజాకార్ల అరాచకాలను భరించిన నేల ఇది. వల్లభాయ్ పటేల్ రజాకార్ల పీచమణిచి నిజాంను లొంగదీసుకున్నాడని పేర్కొన్నారు. హైదరాబాద్ విముక్తి కల్పించిన పటేల్‌ను యావత్ భారతావని స్మరించుకుంటుందనీ, ప్రధాని మోడీ నేతృత్వంలో భారత్ వికసిస్తుందని చెప్పారు. ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతోందనీ, పహెల్గాంలో ఉగ్రవాదులు దుశ్చర్యకు పాల్పడి అమాయకుల ప్రాణాలు బలిగొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్‌తో మన సైన్యం సత్తా ఏంటో ప్రపంచం చూసిందనీ, పాకిస్తాన్ ఉగ్ర మూకలను అంతమొందించామని పేర్కొన్నారు. భారత్-పాక్ మధ్య యుద్ధంపై మూడో వ్యక్తి జోక్యం అవసరం లేదని ప్రధాని మోడీ తేల్చి చెప్పారన్నారు. సరిహద్దుల్లో భారత సైన్యం అత్యంత అప్రమత్తంగా ఉందనీ, దేశ రక్షణకు ఎలాంటి ముప్పు వాటిల్లినా సమర్థంగా తిప్పికొడుతుందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ స్పష్టం చేశారు.

**ఒకే రోజు మూడు పండుగలు: బండి సంజయ్**

కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ఈరోజు విమోచన దినోత్సవం, విశ్వకర్మ జయంతి, ప్రధాని మోడీ జన్మదినోత్సవం వంటి మూడు ముఖ్యమైన పండుగలు జరుపుకుంటున్నామన్నారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఎంతో మంది పోరాడి ప్రాణాలు అర్పించారనీ, తెలంగాణలో ఎన్నో జలియన్ వాలాబాగ్‌లు జరిగాయన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఈ ప్రాంతానికి విముక్తి కల్పించడంతోనే మనం భారత్‌లో ఏకమయ్యామన్నారు. కేంద్ర ప్రభుత్వం విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నదనీ, తెలంగాణ వీరులను రాష్ట్ర ప్రభుత్వం అవమానిస్తున్నదని విమర్శించారు.

**చరిత్రను తొక్కిపెట్టాలని పాలకుల కుట్ర చేస్తున్నరు : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ చరిత్రను తొక్కి పెట్టాలని ఇక్కడి రాష్ట్ర పాలకులు కుట్ర చేస్తున్నరని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో అధికారికంగా ఉత్సవాలు నిర్వహిస్తుండగా, ఇక్కడి ప్రభుత్వానికి ఏం వచ్చిందని నిలదీశారు. హైదరాబాద్ లిబరేషన్ డే జరగకుండా ఉండటానికి ఎంఐఎం పార్టీ కారణమనీ, ఆ పార్టీకి భయపడి తెలంగాణ చరిత్రను కొందరు వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి వచ్చాక వాడవాడలా విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

**బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విమోచనం వేడుకలు**

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు జాతీయ జెండాను ఎగురవేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవ కారణంగానే తెలంగాణకు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించిందనీ, ఈ వేడుకలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించినందుకు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

(టీఆర్‌పీ) పేరుతో తమ పార్టీని ప్రజల ముందుకు తీసుకొచ్చినట్టు ఆయన అధికారికంగా ప్రకటించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ తాజ్ కృష్ణా హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను తీన్మార్ మల్లన్న ఆవిష్కరించారు. ఎరుపు, ఆకుపచ్చ రెండు రంగులతో రూపొందించారు. జెండా పైభాగంలో ఎరుపు రంగు, కింది భాగంలో ఆకుపచ్చ రంగు ఉన్నాయి. జెండా మధ్యలో కార్మిక చక్రాన్ని, దాని నుంచి పైకి లేస్తున్నట్లుగా పిడికిలి బిగించిన మానవుడి చేతిని చిహ్నంగా పొందుపరిచారు. ఈ చిహ్నానికి ఇరువైపులా రెండు ఆలీవ్ ఆకులను చేర్చారు. జెండాపై 'ఆత్మగౌరవం, అధికారం, వాటా' అనే నినాదాన్ని ముద్రించారు. పార్టీ స్థాపనతో పాటు, కీలకమైన రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా ఆయన ప్రకటించారు.

**ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్లు..**

'తెలంగాణ గడ్డ మీద బీసీలు తమకు తాముగా ఒక రాజకీయ పార్టీని తీసుకువచ్చారు. బీసీల ఆత్మగౌరవ జెండా రేపటి నుంచి రెపరెపలాడబోతోంది' అని వ్యాఖ్యానించారు. పార్టీ కార్యకలాపాలను ముందుకు నడిపించేందుకు వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ముదం రజినీ కుమార్ యాదవ్, సూదగాని హరిశంకర్ గౌడ్‌లను నియమించారు. అలాగే, పార్టీ ప్రధాన కార్యదర్శులుగా నలుగురికి అవకాశం కల్పించారు. వట్టే జానయ్య యాదవ్, సంగెం సూర్యారావు, పల్లెబోయిన అశోక్ యాదవ్, జ్యోతి పండల్లను ప్రధాన కార్యదర్శులుగా నియమిస్తున్నట్టు మల్లన్న వెల్లడించారు.

**పార్టీని స్వాగతిస్తున్నాం : మహేశ్ గౌడ్**

ఇదిలాఉంటే, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అంశంపై కూడా మహేశ్ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించినందువల్లే తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సి వచ్చిందని ఆయన వివరించారు. అయినప్పటికీ, బీసీల హక్కుల కోసం పోరాడే నాయకుడిగా మల్లన్నను తాను గౌరవిస్తానని అన్నారు. రాజకీయాల్లో ఎవరు పార్టీలు పెట్టినా స్వాగతిస్తామని, మల్లన్న కొత్త పార్టీ నిర్ణయాన్ని కూడా ఆహ్వానిస్తున్నామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్త

- అందరి అభిమానం నాకు మరింత ప్రేరణనిస్తోంది
- తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారి ప్రధాని మోడీ కృతజ్ఞతలు

**ఢిల్లీ, సెప్టెంబర్ 17:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా దేశవిదేశాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. 'జనశక్తికి కృతజ్ఞతలు' అంటూ వీరందరికీ ధన్యవాదాలు తెలుపుతూ ట్వీట్ చేశారు.'వికసిత్ భారత్' కలను సాకారం చేసే దిశగా మరింత ఉత్సాహం, అంకితభావంతో పనిచేయాలని సంకల్పించినట్లు తెలిపారు. తన పుట్టిన రోజు నేపథ్యంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో నిమగ్నమైనవారిని అభినందించారు. దేశవిదేశాల నుంచి అందిన శుభాకాంక్షలు, ఆశీర్వాదాలు, ఆప్యాయతతో కూడిన సందేశాలతో ఉప్పొంగిపోయాను. ఈ అనురాగం ఎంతో ప్రేరణగా నిలుస్తోంది. కేవలం నా ఒక్కడికే కాకుండా.. మెరుగైన భారత నిర్మాణం కోసం మనమంతా కలిసి చేస్తున్న పనులకు దీవెనగా భావిస్తున్నాను. మరోవైపు.. దేశవ్యాప్తంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేశవాసుల్లో అంతర్లీనంగా ఉన్న ఈ మంచితనమే సమాజాన్ని నిలబెడుతోంది. సానుకూల దృక్పథం, ఆశావాదంతో అన్ని సవాళ్లను అధిగమించేందుకు ధైర్యాన్ని అందిస్తోంది. 'వికసిత్ భారత్' కలను సాకారం చేసేందుకు మరింత శక్తి, అంకితభావంతో పనిచేయాలని నిశ్చయించుకున్నాను. అందరికి మంచి ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ప్రార్థిస్తున్నాను

జన్మదినం పురస్కరించుకుని ప్రధాని మోడీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ సహా వివిధ దేశాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు, సినీ నటులు, వివిధ రంగాల ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెట్టారు. ఆయా రాష్ట్రాల్లో పెద్దఎత్తున సేవా కార్యక్రమాల నిర్వహణతోపాటు వివిధ పథకాలకు శ్రీకారం చుట్టారు.

# ఆర్‌టీసీలో డ్రైవర్లు, శ్రామిక్ ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

డ్రైవర్లు, శ్రామిక్ పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్‌టీసీలో 1000 డ్రైవర్లు, 743 శ్రామిక్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల కోసం అక్టోబర్ 8 నుంచి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. డ్రైవర్ పోస్టులకు 22 నుంచి 35 ఏళ్ల వయసు వారు.. శ్రామిక్ పోస్టులకు 18 నుంచి 30 ఏళ్ల వయసులోపు వారు అర్హులని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ వారికి ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్ మెన్‌కు మూడేళ్ల వయోపరిమితి ఉంటోందని పేర్కొంది. స్కిల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా అర్హులను ఎంపిక చేయనున్నట్లు తెలిపింది. పూర్తి వివరాల కోసం ఆర్‌టీసీ అదికారిక వెబ్‌సైట్ చూడాలని పోలీసు నియమాక మండలి సూచించింది.




# వైద్య సేవలు ఆగవు



(మొదటి పేజీ తరువాయి)

తాము వైద్యం అందిస్తున్నామన్నారు. గతంలో ఇప్పటికీ ఆరోగ్యశ్రీ చెల్లింపుల అంశంలో తేడా గమనించాలని కోరారు. ఇప్పటికే ఈ నెలకు అవసరమైన రూ. 100 కోట్లను తాము విడుదల చేశామని... ఇప్పటికైనా సమ్మె విరమించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో తక్కువ ధరకే సేవలు అందించిన నెట్వర్క్ హాస్పిటల్స్... తాము ధరలు పెంచినందుకు స్ట్రైక్ చేస్తున్నారా అని నిలదీశారు. ఇప్పటికైనా పేదలకు వైద్య సేవలు అందించేందుకు నెట్వర్క్ హాస్పిటల్స్ ముందుకు రావాలని ఆయన కోరారు. వైద్య సేవలు ఆగే పరిస్థితి ఉండబోదని స్పష్టం చేశారు.

# అంబేద్కర్ విగ్రహ ధ్వంసకులపై కఠిన చర్యలు తీసుకోవాలి



**రంగారెడ్డి, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** ఎల్బీనగర్ నియోజకవర్గం లింగోజిగూడలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్(బాలన్న) డిమాండ్ చేశారు. బుధవారము ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య, సరూర్నగర్ ఇన్స్పెక్టర్ సైదిరెడ్డిలకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులను వెంటనే పట్టుకొని శిక్షించాలని కోరారు. ఎల్బీనగర్ నియోజకవర్గం మాల సంఘాల నాయకులు విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. హుటా హుటిన ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య సరూర్నగర్ సిఐ సైదిరెడ్డి తన బలగాలతో ఆందోళన చేస్తున్న అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చేసి ఆందోళన కారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు.. లింగోజిగూడ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన మా యొక్క సంఘం సభ్యులే వెతికి పట్టుకొని మీకు అప్పచెప్తారని మాల సంఘాల నాయకులు పోలీసులకు తెలిపారు. దుండగులను కచ్చితంగా శిక్షిస్తామని.. చట్ట ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటామని.. ధ్వంసమైన అంబేద్కర్ విగ్రహం స్థానంలో నూతన విగ్రహం ఏర్పాటు ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య మాల సంఘాల నాయకులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు వెంకటరమణ, కార్యదర్శి జగదీష్, నాగరాజు, లింగోజిగూడ అంబేద్కర్ యువజన సంఘం కామిల వెంకటరమణ, ఆర్ జగదీష్, నాగరాజ్, అశోక్, పెంటయ్య ,జవాది ,ఆనంద రాజ్, పార్షపు శ్రీధర్ లు పాల్గొన్నారు.



## డీజీపీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 17(మనం ప్రత్యేక ప్రతినిధి):** ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీపీ కె.రమేష్ నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేషన్ ఐజీపీ ఎం.శ్రీనివాసులు, లీగల్ ఎస్పీ సతీష్, శాంతిభద్రతల ఏఐజీ రమణ కుమార్, డీఎస్పీలు యోగేశ్వరరావు, వేణుగోపాల్, ఉదయ భాస్కర్ తదితర అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐటీ అధికారుల ఆకస్మిక దాడులు

- వాసవీ రియల్ ఎస్టేట్, క్యాప్స్ గోల్డ్ డైరెక్టర్ల ఇళ్లలో తనిఖీలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 17(మనం ప్రత్యేక ప్రతినిధి):** హైదరాబాద్, వరంగల్, విజయవాడలోని ఐటీ అధికారులు 15 ప్రాంతాలలో ఆకస్మిక తనికీలు చేపట్టారు. ముఖ్యంగా వాసవి రియల్ ఎస్టేట్ సంస్థ, బంజారా హిల్స్‌లోని క్యాప్స్‌గోల్డ్ పై బుధవారం ఐటి అధికారుల బృందాలు ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. ఈక్రమంలో క్యాప్స్‌గోల్డ్‌కు వాసవి సంస్థ అనుబంధంగా ఉన్నట్లు ఐటీ అధికారులు గుర్తించారు. అదేవిధంగా వాసవి సంస్థలో డైరెక్టర్‌గా కొనసాగుతున్న అభిషేక్, సౌమ్య కంపెనీలపైనా ఐటీ అధికారులు తనికీలు చేపట్టారు. క్యాప్స్‌గోల్డ్ లో సైతం అభిషేక్, సౌమ్య డైరెక్టర్ గా ఉన్నట్లు ఐటీ అధికారుల విచారణలో తేలింది. విచారణలో భాగంగా వాసవి రియల ఎస్టేట్ సంస్థకు సంబంధించిన 40 కంపెనీలకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. వాసవి రియల్ ఎస్టేట్ గ్రూప్స్‌తో పాటు క్యాప్స్ గోల్డ్ సంస్థ డైరెక్టర్ చందా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా ఉన్న పలు కంపెనీలపై సోదాలు చేపట్టారు. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లీ లగ్జరీ గ్రీన్ విల్లాలోని మూడు విల్లాలలో సోదాలు చేపట్టిన ఐటి అధికారులు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈక్రమంలో క్యాప్స్‌గోల్డ్‌లో అధినేతలు, డైరెక్టర్లు ట్యాక్స్ చెల్లింపుల్లో అవకతవకలు పాల్పడినట్లు విచారణలో తేలింది. అదేవిధంగా హైదరాబాద్ నగరంలోని పలు బంగారు దుకాణాల యజమానుల ఇళ్లల్లోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. సికింద్రాబాద్ లోని బంగారం వ్యాపారి జగదీష్ ఇంట్లో సోదాలు చేపట్టిన అధికారులు ట్యాక్స్ చెల్లింపుల్లో అవకతవకలు, లెక్కకు మించిన ఆస్తులు, నగలు ఉన్నట్లుగా గుర్తించారు. బంగారం హోల్‌సేల్ లావాదేవీలపై ఆరాతీయడంతో పాటు కొనుగోలు అమ్మకాలపై వివరాలు సేకరించారు. కాగా క్యాప్స్‌గోల్డ్ సంస్థలలో గతంలో నోట్ల మార్పిడి సందర్భంలోనూ ఐటీ శాఖ సోదాలు నిర్వహించిన విషయం విదితమే.తాజాగా మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి పెద్ద ఎత్తున గోల్డ్ కొనుగోలు చేసిన క్యాప్స్ గోల్డ్ కంపెనీ బంగారం కొనుగోలు చేసి రిటైల్ గోల్డ్ షాప్‌లకు విక్రయించడంలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఐటీ అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. బంజారా హిల్స్ లోని క్యాప్స్ గోల్డ్ ప్రధాన కార్యాలయంలో ఐటీ అధికారులు కీలక పత్రాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

## సమాజాభివృద్ధిలో ప్రతి పౌరుడి పాత్ర కీలకం



- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత
- కళాశాలలో ఘనంగా విమోచన దినోత్సవం

**చేవెళ్ల, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** సమాజాభివృద్ధిలో ప్రతీ పౌరుడి పాత్ర కీలకమని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంను చెవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత కళాశాల ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ గీతం ఆలపించారు. అనంతరం, ప్రిన్సిపాల్ కాంచనలత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.... ప్రజాస్వామ్యం అంటే ప్రజలతో, ప్రజల కోసం, ప్రజల చేత జరిగే పాలన అని, ప్రజా పాలన దినోత్సవం యొక్క ప్రాధాన్యాన్ని వివరించారు. సమాజ అభివృద్ధిలో ప్రతి పౌరుడి పాత్ర ఎంత ముఖ్యమో విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి పాటలు, ప్రసంగాలతో కార్యక్రమానికి విశేషంగా తోడ్పడ్డారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గోవు గరుక స్తంభం ప్రతిష్ఠలో ఉప్పల



**రంగారెడ్డి, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వనిత క్లబ్ ఆధ్వర్యంలో ప్రసన్న మహంకాళి అమ్మవారి దేవాలయం గో సేవలో భాగంగా గోవు గరుక స్తంభం ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గరపూ దయానంద్ తో కలిసి పాల్గొన్న టి పీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ గోవు గరిక స్తంభం నీ ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఆయన అన్నారు. గో మాత సేవలో అందరూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కొత్తపేట అధ్యక్షులు మాడూరి వాసు గుప్తా, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వనిత క్లబ్ ప్రెసిడెంట్ గుడిపాటి వేణమ్మ ,సెక్రటరీ పొట్టి సుదీప్నా, ట్రెజరర్ బలుస వాసంతి , హరి ప్రసాద్, హనుమంత్ రావు, గోపి కృష్ణ, వాసు గుప్త తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని బాట సింగారం పండ్ల మార్కెట్ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భాస్కరా చారి, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు మచ్చేందర్ రెడ్డి, అంజయ్య, బండి మధుసూదన్ రావు, గణేష్ నాయక్, రఘుపతి రెడ్డి, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం మార్కెట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. **- రంగారెడ్డి మనం న్యూస్**

## ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- చిలుక ఉపేందర్ రెడ్డి



**రంగారెడ్డి, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి కోరారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వస్థ నారి శక్తి కుటుంబ అభియాన్ ప్రత్యేక ఆరోగ్య శిబిరం రామకృష్ణాపురం యూపీహెచ్‌సి సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైద్య శాఖ పై ప్రత్యేక దృష్టి సారించి ఎక్కువ నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని అన్నారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని రంగారెడ్డి జిల్లా అదనపు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ డాక్టర్ పాపారావు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ గీతలు సందర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ కుసుమ వైద్య సిబ్బంది రంజిత్ కుమార్, విజయేందర్ రెడ్డి, ప్రదీప్, నీరజ, జ్యోతి, కరణ్ ,రాజశేఖర్,కాలనీ అధ్యక్షుడు ఏ. సాయికుమార్ , ప్రధాన కార్యదర్శి కె. శ్యామ్ సుందర్ రావు, కాలనీవాసులు కె. రామారావు, బి. వెంకటేశ్వర్లు, స్థానిక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమానికి కేంద్రం పెద్ద పీట



- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**చేవెళ్ల, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** మహిళల కోసం ప్రధాని మంత్రి నరేందర్ మోడీ అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ 75వ జన్మదిన సందర్భంగా చేవెళ్ల కేజీ ఆర్ గార్డెన్ లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, కోవిడ్ కష్టకాలంలో మన దేశంతో పాటు ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్ అందించిన ఘనత పీఎం మోదీదని తెలిపారు. అదే విధంగా దేశాన్ని వికసిత్ భారత్ నిలుపుతున్నారని వివరించారు. అనంతరం, రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ క్రమంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర రావు,మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, తహశీల్దార్ క్రిష్ణయ్య, భాజపా యువ నాయకులు డాక్టర్ వైభవ్ రెడ్డి, చేవెళ్ల సీహెచ్‌సీ సూపరిండెంట్‌లు డాక్టర్ రాజేంద్రప్రసాద్, భాజపా మున్సిపల్ అధ్యక్షులు అనంత రెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

## వెంకట రమణ మరణం అసోసియేషన్‌కు తీరని లోటు



- అసోసియేషన్ అధ్యక్షుడు మల్కాజిగిరి కుమార్

**రంగారెడ్డి సెప్టెంబర్ 17(మనం న్యూస్):** ఎల్బీనగర్ ప్లానర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్. వెంకటరమణ అకాల మరణం అసోసియేషన్ కు తీరని లోటు అని అసోసియేషన్ అధ్యక్షుడు మల్కాజిగిరి కుమార్ అన్నారు. మంగళవారం సరూర్ నగర్ లో జరిగిన సంతపసభలో వెంకట రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృదుస్వభావి అయిన రమణ అజాత శత్రువన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సలహాదారులు ఆకుల అరవింద్ కుమార్, బేర బాలకిషన్, సుభాష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాంబాబు, అభిలాష్ గౌడ్, సాతెలి సాయినాథ్, సిల్వేరి అనిల్ కుమార్, సుధాకర్, బండి నరేందర్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరకాలని సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధనంరెడ్డి, జైమాత ప్రవీణ్, కృష్ణాగౌడ్, అరుణ్ గౌడ్, సుంకరి ప్రశాంత్ గౌడ్, చిరంజీవి, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పంట నమోదు చేసుకోవాలి



- మండల వ్యవసాయాధికారి శంకర్ లాల్

**చేవెళ్ల, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** రైతులు పంట నమోదు తప్పని సరిగా చేసుకోవాలలని మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ అన్నారు. చేవెళ్ల మండల పరిధిలో కుమ్మెర, చేవెళ్ల గ్రామాలలో రైతుల పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశిలించారు. అనంతరం రైతులు సాగు చేసిన పంట పొలాలను బుధవారం సందర్శించి చీడపీడలకు సంబంధించిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆయన మాట్లాడుతూ, మండలంలో పంట వేసిన ప్రతి రైతు విధిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదు ఆధారంగానే ప్రభుత్వం పంటల కొనుగోలు, పంట నష్టపరిహారం, రైతు భరోసా వంటి పథకాల లబ్ధి ఉంటుందన్నారు. గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి సర్వేనెంబర్ వారీగా పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు బాలకోటేశ్వరరావు, మౌనిక, రైతులు స్థానిక ప్రజా ప్రతినిధులు, పలువురు వాణిజ్య పంటల రైతులు తదితరులు ఉన్నారు.

## మధు యాష్కి గౌడ్‌కు సీఎం పరామర్శ



**రంగారెడ్డి, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** అస్వస్థతకు గురై గచ్చిబౌలిలోని ఏఐజి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌కి సీఎం రేవంత్ రెడ్డి ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని, అస్వస్థతకు గురైన కారణాలను తెలుసుకున్నారు. మంగళవారం సెక్రటేరియట్‌లో మధు యాష్కీ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న సీఎం వెంటనే స్పందించి ఆస్పత్రిలో చేరేంత వరకు వారి సిబ్బంది, అధికారులకు సూచనలు చేసి మానిటరింగ్ చేశారు. ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డితోనూ సీఎం మాట్లాడి మధుయాష్కీకి అందిస్తున్న చికిత్సపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండేలచూడాలని సూచించారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి నేరుగా మధుయాష్కికి ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తన ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి కి మధుయాష్కి కృతజ్ఞతలు తెలిపారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాజకీయ ప్రముఖులు ఫోన్లో పరామర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు.



తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకలు చైతన్యపురి డివిజన్ బీజేపీ అధ్యక్షులు నవీన్ యాదవ్ ఆధ్వర్యము లో బాబు కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా హాజరై జాతీయ జెండాను ఎగరవేశారు. ప్రజలందరికీ తెలంగాణ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. **- రంగారెడ్డి, మనం న్యూస్**

## విగ్రహం ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**రంగారెడ్డి, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** ఎల్బీనగర్ నియోజకవర్గంలోని లింగోజిగూడ చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటనపై అక్కడ నిరసన కార్యక్రమ విషయం తెలిసిన వెంటనే సుధీర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే దళిత సంఘ సభ్యుల విజ్ఞప్తి మేరకు త్వరితగతిన నూతన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని శాసన సభ్యులు సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు.

## మధు యాష్కి గౌడ్‌కు మంత్రుల పరామర్శ



**రంగారెడ్డి, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** స్వల్ప అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ని మంత్రులు వివేక్ వెంకటస్వామి , పొన్నం ప్రభాకర్ గౌడ్ లు బంజారా హిల్స్ లోని వారి నివాసానికి వచ్చి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం, వారు తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

## మట్టి మనుషుల యుద్ధం!

రాజ్యంతో
చేసిన యుద్ధాలకు
అధికారుల లాంఛనాలు అక్కర్లేదు!
గతాన్ని ఏమార్చి
పండగ చేసుకోవడం
నిజమైన దేశభక్తి కాదు!
రాచిరంపాన పెట్టిన రాజుది
ఏ మతం అయితే ఏంది
రాలిపోయే వరకు రాయి విసరడమే!
చేతికి అందిందే ఆయుధం
కారం జల్లి రోకలి ఎత్తడమే
విముక్తి గీతానికి నాంది!
సకల జనులు
సంగతేందో తేల్చిన యుద్ధమే
తొలి తెలంగాణ విముక్తి సమరం!
రాజెంత బలవంతుడైన
అంతా ఏకమైతే
పదహారు బండ్లల్ల పారిపోవడమే చరిత్ర!
కల్పిత కథనాలతో
త్యాగాలను విడగొట్టలేము
పేదల పోరుకు కలంకమద్దలేము!
వైషమ్యాలు లేని యుద్ధం నిజం
చలి చీమల చేత
బలమైన సర్పపు చావు నిజం!
నా తెలంగాణ
ఎప్పటికీ పోరుగడ్డ
నిజాయితీకి అసలైన అడ్డ!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

# ప్రజాభిప్రాయం పట్టని వారికి పతనమే?



**ఏప్రిల్ 2022...**

శ్రీలంకలో కలకలం. ఏకంగా అధ్యక్షుడి ఇంటి మీద దాడి. ఆనాటి మంత్రులు, అధికారుల మీద విరుచుకుపడ్డ యువత. చివరకు రాజీనామా చేసి తన ప్యాలెస్‌ను, దేశాన్ని విడిచిపెట్టిపోయిన అధ్యక్షుడు.

**ఆగస్టు 2024**

బంగ్లాదేశ్‌లో అలజడి. మిన్నంటిన ఆందోళనలతో చేదాటిపోయిన పరిస్థితులు. పీఎం ఆఫీసు, ఇల్లు సహా ఏదీ వదిలిపెట్టలేదు. అధికారులు, మంత్రులను సైతం విడిచిపెట్టకుండా దాడులు జరిగాయి. చివరకు ప్రధానమంత్రి ఉన్న పళంగా దేశం విడిచిపోవాల్సి వచ్చింది.

**సెప్టెంబర్ 2025**

నేపాల్ యువత రోడ్డెక్కారు. జెన్ జెడ్ ఉవ్వెత్తున ఎగిశారు. ఆగ్రహావేశాల తాకిడికి నేపాల్ ప్రధాని ఇల్లు మాత్రమే కాకుండా పార్లమెంట్ భవనం కూడా మంటల్లో చిక్కుకుంది. మంత్రులను నడిరోడ్డు మీద ఈడ్చుకుంటూ కొట్టారు. పలువురు అధికారుల మీద దాడులు జరిగాయి. మూకుమ్మడి దాడులతో దేశ రాజధాని నగరంతో పాటుగా అనేక ప్రాంతాలు అదుపు తప్పాయి. ఆర్మీ అధికారులు అండగా ఉండి, పలువురు ఉన్నత స్థాయి నేతల ప్రాణాలు కాపాడాల్సి వచ్చింది. శ్రీలంకలో అదుపు తప్పిన ద్రవ్యోల్బణం అగ్గిపుట్టించింది. బంగ్లాదేశ్‌లో నిరుద్యోగం నిప్పు రాజేసింది. నేపాల్‌లో అవినీతి, అక్రమాలు సహించ లేని సెక్షన్ చెలరేగింది. ఇవన్నీ ట్రిగ్గర్ పాయింట్స్‌గా ఉన్నాయి. సోషల్ మీడియా నియంత్రించారని నేపాల్‌లో ఒక్కసారిగా జెన్ జెడ్ యువత వీరంగం చేసిందని చెబుతున్నప్పటికీ దానికి ముందు కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలు అందుకు ఊతమిచ్చాయి. రాజకీయ వ్యవస్థలోని లోపాలు అందుకు ప్రధాన కారణమవుతున్నాయి. పాలకులు, వారి విధానాలతో విసుగు చెందిన తర్వాత ఇక వీధి పోరాటాలకు సైతం వెనుకాడేది లేదన్నట్టుగా కనిపిస్తోంది. ఈ మూడు దేశాల్లో జరిగిన ఉద్యమాలు ఏదో లక్ష్యంతో సాగినవి కాదు. ఏదో ఓ సంస్థ నడిపినవి అంత కన్నా కాదు. రాజకీయ పార్టీల నేతృత్వం అసలు లేదు. ఎంతో కాలం పాటు ఓపిక పట్టలేని యువత ఒక్కసారిగా కదులుతున్న వైనం ఈ అనుభవాలు కళ్లెదురుగా చాటుతున్నాయి.

ప్రజలను పాలకులు తక్కువ అంచనా వేస్తే ఏమవుతుందో ఆయా దేశాలు చెబుతున్నాయి. మీడియా సహాయంతో, ఇతర వ్యవస్థల అండ చూసుకుని ఏం చేసినా ఫర్వాలేదనుకుంటే ఓ స్థాయి వరకే ఓపిక పడతారు తప్ప దీర్ఘకాలం సాధ్యం కాదని చాటుతున్న సంకేతమిది. వ్యవస్థలను ఆధారంగా చేసుకుని ప్రశ్నించే ప్రతీ గొంతు నొక్కేశామని అధికారంలో ఉన్న వాళ్లు ఆనందిస్తే అది తాత్కాలికమేనని చెబుతున్న సత్యం. ఆయా దేశాల్లో 90 శాతం మంది మనుగడ కోసం అను నిత్యం పోరాడక తప్పని పరిస్థితుల్లో మిగిలిన 10 శాతం పెత్తనం చేస్తూ సర్వం అనుభవించడాన్ని సామాన్యులు సహించలేకపోతున్నట్టు కనిపి స్తోంది. ఆర్థిక అసమానతలు హద్దుల్లేకుండా పెరిగి పోయిన సమాజంలో అన్ని రంగాలను గుప్పిట్లో పెట్టుకున్న వారిని చూస్తే జనం సహించబోరని చాటుతున్న వాస్తవం. అందుకే ప్రజలు తమంతట తాముగానే తిరగబడ్డారు. ప్రభుత్వ అధినేతలను పారద్రోలారు. తక్షణమే తమకు దొరికిన ప్రత్యామ్నాయాన్ని వెదుక్కుంటున్నారు. ఎంతో కొంత ఉపశమనం దక్కుతుందని ఎదురు చూస్తున్నారు. సమూల మార్పులు కాకపోయినా ఆయా దేశాల్లో ప్రజల తిరుగుబాటు చూసిన తర్వాత కొత్తగా గద్దెనెక్కిన ప్రభుత్వాలు కొంత జాగ్రత్తగా సాగాల్సి ఉంటుంది. ఎంతో కొంత మేర ప్రజానుకూల విధానాలకు పూనుకోవాల్సి ఉంటుంది. ఆర్థిక, రాజకీయ అధికారం కొంతమంది గుప్పిట్లో ఉండిపోతున్న తీరుని ఏదో మేర సడలించాల్సి ఉంటుంది. లేదంటే ఆయా దేశాలు తీవ్ర అస్థిరతను ఎదుర్కోక తప్పని స్థితి దాపురిస్తోంది. ఈ మూడు దేశాల్లో ప్రస్తుతం శ్రీలంక మాత్రమే తిరుగుబాటు తర్వాత ఎన్నికలు నిర్వహించుకుంది. బంగ్లాదేశ్, నేపాల్ మాత్రం తాత్కాలిక ప్రభుత్వాలతో నడుస్తున్నాయి. రాజకీయంగా స్థిరత్వం ఏదేశానికయినా అత్యంత కీలకం కాబట్టి అక్కడ కూడా రాజకీయ రంగంలోనూ మార్పులకు శ్రీకారం చుడుతూ ఎన్నికలు నిర్వహించడం అత్యవసరం. ఎన్నికలు కాకుండా అడ్డదారుల్లో అధికారం చేపట్టిన వారు ప్రజా భిప్రాయానికి ఏమేరకు ప్రాధాన్యత నిస్తారన్నది ప్రశ్నార్థకం. ఆరంభంలో కొంత అణిగిమణిగి సాగినా క్రమంగా అధికారం రుచిమరిగిన తర్వాత మళ్లీ పూర్వపు పోకడలు పునరావృతమయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ప్రజాభిప్రాయానికి తగ్గట్టుగా ప్రజాస్వామ్య ప్రభుత్వాలు మాత్రమే ఎక్కడైనా పురోగతికి తోడ్పడతాయి. అందుకు తగ్గట్టుగా ఆ దేశాలు కూడా వ్యవహరించాల్సి ఉంటుంది.

అదే సమయంలో సరిహద్దు దేశాల్లో రాజకీయ, సామాజిక అస్థిరత భారతదేశానికి కూడా అంత శ్రేయస్కరం కాదు. సరిహద్దుల్లో చెలరేగే మంటల సెగ ఇక్కడ కూడా తగలక మానదు. కాబట్టి చిన్న దేశాలు చితికిపోకుండా, తిరిగి కోలుకుని ప్రజాస్వామ్య పునరుద్దరణ వైపు సాగేందుకు అనుగుణంగా చేయందించాల్సి ఉంటుంది. అదే సమయంలో ఆ దేశాల్లో పరిస్థితులు సర్దుమణిగే వరకూ సరిహద్దుల్లో మరింత జాగ్రత్తలు అనుసరించక తప్పదు. ఇప్పటికే ఇండియాలోని అనేక ప్రాంతాలతో వివాహ సంబంధాలు, బంధుత్వాలు కలిగిన నేపాలీలు సరిహద్దులు దాటుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. వాటన్నింటినీ పరిగణలోకి తీసుకుని ఇండియా ప్రభుత్వం కూడా పగడ్బందీగా వ్యవహరించాల్సి ఉంటుంది.



- ఐనం ప్రసాద్
9848928787

# సైన్యాధిపతుల వ్యూహ రచన అద్భుతం

భారతదేశ చరిత్రలో సెప్టెంబర్ 17 1948 చిరస్మరణీయమైనదినం. భారత్ సేనాధి పతుల వ్యూహరచన చాతుర్యానికి, సేనల అసమాన పరాక్రమానికి ప్రతిష్ట చేకూర్చిన రోజు. హైదరాబాద్‌పై భారత ప్రభుత్వ పోలీసు చర్య విజయ వంతంగా ముగిసిన సంఘటనకు సాక్ష్యం అయిన రోజు. దక్షిణ ప్రాంత భారత సర్వ సేనాని లెఫ్టినెంట్ జనరల్ మహారాజా రాజేంద్ర సింహ్‌జీ సాటిలేని మేటి వ్యూహ రచనకు నిలువు టద్దంగా నిలిచిన రోజు. సెప్టెంబర్ 13 వ తేదీ తెల్లవారు జామున మూడు గంటలకు భారత సేనలు సంస్థానం నలువైపుల నుండి 'చలో సికింద్రాబాద్' అని ముందు అడుగు వేశాయి. సికింద్రాబాద్ చేరవలసిన ప్రధాన సేనావాహిని మేజర్ జనరల్ జయంత్ నాథ్ చౌదరి నాయకత్వంలో షోలాపూర్ నుండి నేరుగా సికింద్రాబాదుకు బయల్దేరింది. ఈ సేనలో ఒక దళం నల్‌దుర్గ్ నుండి ఉత్తరంగా జాల్నా మీదికి సాగింది. దక్షిణాన హోస్పేట వద్ద, మైసూర్ సేనకు సంబంధించిన బ్రిగేడియర్ బాల్, మధ్య ప్రాంతం డిఐజి పార్థసారథి అయ్యంగార్ నేతృత్వంలో మైసూర్ సేన, కొంత మద్రాస్ ప్రత్యేక పోలీసు దళం, మరికొంత మునీరాబాద్ వద్ద తుంగభద్రపై గల వంతెనను స్వాధీన పరచుకొని ముందుకు సాగాయి. కొంచెం తూర్పుగా కర్నూల్ వద్ద మైసూర్ అశ్వికదళం జాతీయ పోలీసు బలగం తుంగభద్ర రైలు వంతెన స్వాధీన పరచుకొని గద్వాల్ దిశగా సాగాయి. విజయవాడ వద్ద నుండి బ్రిగేడియర్ మదన్‌సింగ్ ఆధ్వర్యంలో ఒక సేనాదళం ఉత్తర ప్రాంత డిఐజి సుబ్బరాయన్ ఆధ్వర్యంలో కొంత పోలీసు బలగంతో బయలు దేరాయి. సేవాదళం రెండు భాగాలుగా విడివడి... ఒకటి రైలు మార్గం వెంట ఖమ్మం మీదుగా వరంగల్, రెండవది సూర్యాపేట మీదుగా సికింద్రాబాద్ లక్ష్యాలుగా పురోగమించాయి. ఉత్తరాన కొంత సేన, కొంత పోలీసు బలగం బాల్హార్షను ఆక్రమించాయి. ఆ సమీపంలో గోదావరిపై గల రైలు వంతెనకు ప్రమాదం లేకుండా చేశాయి.

పడమరగా కానేర్గాం వద్ద నుండి కొంత పోలీసు బృందం, హింగోలి దిశగా బయలు దేరగా, వాయవ్యంగా తాల్వాద్ నుండి ఒక సైనిక దళం ఔరంగాబాద్‌కు సాగింది. షోలాపూర్, విజయవాడ, తాల్వాద్ నుండి బయల్దేరిన ప్రధాన సేనదళాలు... ఎలాంటి ప్రతిఘటనలు కేంద్రీకృతం కాకుండా చేసేందుకు, స్వాధీ నమైన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు, సంఘ విద్రోహ శక్తులను మట్టుపెట్టే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. హోస్పేట, కర్నూలు, విజయవాడ నుండి బయలు దేరిన బలగాలు మద్రాస్



ప్రాంత సేనాని మేజర్ జనరల్ రుద్ర పర్యవేక్షణ కిందపని చేశాయి. ఈ దండయాత్రలో సిక్కులు గూర్ఖాలు మద్రాసు బొంబాయి తదితర పోలీసులు పాల్గొన్నారు. సేనాధిపతులలో ఇరువురు ఆంగ్లో-ఇండియన్లు కూడా ఉన్నారు. 13వ తేదీ సూర్యోదయం వేళ భారత వైమానిక దళాలు విజయవాడ ప్రాంతం నుండి ఎయిర్ వైస్ మార్షల్ ముఖర్జీ నాయకత్వంలో, నిజాం సంస్థానంలోని వరంగల్ బీదర్, ఔరంగబాద్ విమానాశ్రయాలను ఆనవాళ్లు లేకుండా చేశాయి. వాస్తవానికి భారత సేనలు సంస్థానం లోకి తరలి వస్తున్న విషయం 13వ తేదీ ఉదయం 11గంటలకు కానీ బయటకు తెలియనే లేదు. ఢిల్లీలో ఈ విషయాన్ని భారత ప్రభుత్వం బహిర్గతం చేసింది. భారత సైన్యం మెరుపు వేగంతో అన్నివైపుల నుండి సికింద్రాబాద్ వైపు, హైదరాబాద్ వైపు బలగాలు అవిశ్రాంతంగా ముందుకు సాగాయి. 14న మధిర అలంపూరు, 15న వనపర్తి, దౌలతాబాద్, సూర్యాపేట, ఖమ్మం మెట్టు, హోమ్నాబాదు, ఔరంగాబాదు భారత సేనల వశమైనాయి. హోమ్నాబాదు పతనంతో, భారత సేనలు సికింద్రాబాదుకు 10 మైళ్ళ పరిధిలోకి వచ్చాయి. అలా ముందుకు వెళ్లి ఆ రాత్రికి జహీరాబాద్ చేరాయి. నిజాం నవాబుకు దిక్కు తోచని స్థితి ఎదురయింది. ఇలాంటి స్థితిలో జార్జి రాజుకు, ట్రూమన్‌కు విజ్ఞప్తులు పంపుకున్నాడు. అయినా ఎవరూపట్టించుకున్న దాఖలాలు లేవు. 16వ తేదీన వరంగల్, బీదర్, జాల్నా, సిర్పూగు, నారేటుపల్లి, సదాశివపేట సేనల వశమయ్యాయి. ఆరోజున అటు సోలాపూర్ నుండి నేరుగా సికింద్రాబాద్ వెళ్తున్న దళము, ఇటు విజయవాడ నుండి సూర్యాపేట సికింద్రాబాద్ రహదారిపై వెళుతున్న దళము నువ్వా నేనా అంటూ పోటీపడి ముందుకు సాగాయి.

17వ తేదీన హింగోలి సేనల వశమైంది. ప్రధాన దళాలు రెండు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల శివార్లకు చేరుకున్నాయి. దక్షిణ ప్రాంత సర్వ సేనాధిపతి రాజేంద్ర సింహ్‌జీ నిజాంను ఉద్దేశించి 'ఇక లాభం లేదు. లొంగిపోయి అనవసర ప్రాణ నష్టం లేకుండా చూసుకోండి' అంటూ హితవు పలికారు. ఇక గత్యంతరం లేదని గ్రహించిన 17వ తేదీ సాయంత్రమే దాసోహం అన్నాడు. పోలీసు చర్యలో భాగంగా నలువైపులా నుంచి వస్తున్న భారత బలగాలను చూసి నిజాం కింగ్‌కోఠి నుంచి బయటకు వచ్చి భారత ప్రతినిధి కె.ఎం.మున్షీని కలిశాడు. లొంగుబాటుకు మించిన తరుణోపాయం లేదని మున్షీ చెప్పడంతో నిజాం ఒప్పుకోక తప్పలేదు.

1948 సెప్టెంబరు 17న హైదరాబాదు రాజ్యం భారత యూనియన్‌లో విలీనమైంది. శాసన సభ రద్దు చేయబడి సెప్టెంబర్ 18న సైనిక చర్యను సఫలం చేసిన జే.ఎన్.చౌదరి, సైనిక గవర్నర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎం.కె.వెల్లోడి ముఖ్యమంత్రిగా నియుక్తులైనారు. 1956 ఏప్రిల్ 1న నిజాంకు, భారత ప్రభుత్వానికి ఒప్పందం కుదిరి, నిజాంకు ఏడాదికి పన్నులు లేకుండా, 50 లక్షల రూపాయల భరణం చెల్లింపునకు, ప్రపంచంలో నిజాం ఎక్కడికి వెళ్ళినా హైదరాబాద్ పూర్వపు రాజుగా బిరుదులు కొనసాగేవిధంగా ప్రభుత్వం అంగీకరించింది.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# సురక్షిత నీటితోనే ప్రజారోగ్యం



జీవులకు ప్రాణాధారం నీరు మాత్రమే. నీరు ఒక సార్వత్రిక ద్రావణి. జలం లేకుండా జీవనం సాగదు. ప్రకృతి ప్రసాదించిన సహజ అమూల్య వనరులుగా నీటి నిల్వలు కలిపిస్తాయి. నదులు, సరస్సులు, చెరువులు, వాగులు, సముద్రాలు, భూగర్భజలాలు లాంటి పలు నీటి వనరులు సకల ప్రాణికోటికి అందుబాటులో ఉన్నాయి. రసాయనశాస్త్ర పరంగా నీటిని త్రిపరమాణుక విజాతీయ అణువుగా నామకరణం చేశారు. సురక్షిత మంచి నీరు అందించినపుడు మాత్రమే పలు వ్యాధులకు అడ్డుకట్టపడుతుంది. కలుషిత నీరు తాగితే కలరా, డయేరియా, టైఫాయిడ్, డిసెంట్రీ, హెపటైటిస్, మలేరియాసిస్ లాంటి తీవ్రమైన వ్యాధులు సోకుతాయి. మానవాళి ఎదుర్కొంటున్న 80 శాతం రోగాలకు కలుషిత తాగు నీరే కారణమని తెలుస్తున్నది. ప్రపంచ మరణాల్లో 5 శాతం వరకు కలుషిత నీటి వల్ల కలుగుతున్నట్లు నిర్ధారించారు. భారత్లో 70 మిలియన్ల మరణాలు డయేరియా కారణంగా నమోదు అవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, విశ్వవ్యాప్తంగా ప్రతి ముగ్గురు జనాభాలో ఒక్కరు సురక్షిత నీటికి దూరంగా ఉన్నట్లు తెలుస్తున్నది.



**ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం-2025**

భూమండల ఉపరితలంపై 71 శాతం నీరు ఆక్రమించి ఉంది. ప్రపంచంలోనే నీటిలో 3 శాతం మాత్రమే సురక్షిత మంచి నీరుగా అందుబాటులో ఉన్నది. మిగిలిన 97 శాతం నీరు సముద్రాలు, మంచు కొండల రూపంలోనే ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా 40 శాతం ప్రజలకు స్వచ్ఛమైన సురక్షిత నీరు అందడం లేదు. పరిసరాల పరిశుభ్రతకు కూడా నీటి అవసరం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా తాగు, సాదు నీటి కొరతలను తట్టుకోవడానికి, అందుబాటులో ఉన్న నీటిని కలుషితం కాకుండా చూసుకోవడానికి, తరుచుగా నీటి నాణ్యతలను తెలుసుకోవ డానికి సంబంధించిన అవగాహన కల్పించడానికి 2003 నుంచి అమెరికాకు చెందిన మంచి నీటి సంస్థ చొరవతో ప్రతి ఏట 18 సెప్టెంబర్ రోజున ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం (వరల్ వాటర్ మానిటరింగ్ డే) పాటించడం ఆనవాయితీగా మారింది. మనకు స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను తరుచుగా పరీక్షించుకోవడం, నీటి నాణ్యత పట్ల అవగాహన కలిగి ఉండడం, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం లాంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం తప్పనిసరి అవుతున్నది. నీటి నాణ్యతను విచ్ఛిన్నం చేయడానికి పురుగు మందులు, రసాయన ఎరువులు, మురుగు నీరు, రసాయన వ్యర్థాలు, పరిశ్రమల వ్యర్థాలు, మానవ ప్రమేయం వ్యర్థాలతో నీరు కలుషితం కావడం, చమురు లీక్ కావడం లాంటివి దోహదపడుతున్నాయి. వీటికి తోడుగా ఉష్ణోగ్రత, ఆమ్లత్వం, కరిగి ఉన్న ఆక్సిజన్, క్లారిటీ లాంటివి కూడా పనిచేస్తాయి. నీటిని శుద్ధి చేయడానికి వడపోత, స్వేదనం, మరిగించడం, క్లోరినేషన్ లాంటివి దోహదపడతాయి.

నేడు అభివృద్ధి చెందుతున్న అల్పాదాయ ప్రపంచదేశాల్లో ఇథియోపియా, ఉగాండా, సోమాలియా, నైజీరియా, పాకిస్థాన్, మొజాంబిక్ లాంటి దేశాల్లో అధిక జనాభాకు సురక్షిత తాగు నీరు అందడం లేదు. నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, తరుచుగా నీటి నాణ్యతను పరీక్షించుకోవడం, సురక్షిత తాగు నీటి అవసరాలను అవగాహన పరచడం, సభలు/ సమావేశాలు నిర్వహించి నీటి పర్యవేక్షణ ప్రాధాన్యాన్ని వివరించడంతో లాంటి కార్యక్రమాలను తేపట్టాలి. నీటి రవాణాలో లీకేజీలను అడ్డుకోవడం, నల్లా నీరు వృధా కాకుండా చూసుకోవడం, సూక్ష్మ సేద్యం చేయడం, స్ప్రింక్లర్లను వాడడం, నీటి పొదుపు పట్ల విద్యార్థులకు అవగాహన కలిపించడం లాంటివి వివరించాలి. గ్రామీణ భారతంలో 83 శాతం, పట్టణ జనాభాలో 91 శాతం జనాభాకు సురక్షిత నీరు లభిస్తున్నట్లు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పేదరికం, అధిక జనాభా, నిరక్షరాస్యత వంటి కారణాలు కూడా సురక్షిత నీటి లభ్యతకు ప్రతిబంధకాలుగా పని చేస్తున్నాయి. విద్య, వైద్యం, సురక్షిత తాగు నీరు లభించడం ఒక ప్రాథమిక హక్కు అని తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద అధికంగా ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా 3 బిలియన్ల ప్రజలు అంతర్జాతీయ నీటి వనరులపైన మాత్రమే ఆధారపడుతున్నట్లు, అందులో కేవలం 24 దేశాలు మాత్రమే ఒక అంతర్జాతీయ ఒప్పందాలను చేసుకున్నాయని తెలుస్తున్నది. తాగు, సాగు నీటి లభ్యతపై ప్రపంచ శాంతి ఆధారపడి ఉన్నది. నీటి కోసం వివిధ పౌర సమూహాలు, దేశాలు ఘర్షణ పడుతున్నాయి. సహజ నీటి వనరులను సక్రమంగా వాడుకోని యెడల కలుషిత జలాలు ఏరులైపారి రోగాలను వ్యాపింపజేస్తాయి. నేటి పౌర సమాజం నీటిని పొదుపుగా వాడుకుంటూ, కలుషితం కాకుండా చూసుకుంటూ ఆయురారోగ్యాలతో మనుగడ సాగిద్దాం, నీటి ఆధార అనారోగ్యాలకు అడ్డుకట్ట వేద్దాం.

(18 సెప్టెంబర్ ప్రపంచ నీటి పర్యవేక్షణ దినం సందర్భంగా)

- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వీక్షణం సాహితీ గవాక్షం(కాలిఫోర్నియా)

వీక్షణం సాహితీ గవాక్షం 13వ వార్షికోత్సవ సమావేశం సెప్టెంబర్ 13,2025న కాలిఫోర్నియాలోని ఫ్రీమౌంట్ లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ సమావేశానికి ప్రత్యేక అతిథులుగా శ్రీమతి ఎల్.విజయలక్ష్మి (అలనాటి మేటి నటీమణి), శ్రీ సురజిత్ కుమార్ దే దత్తా, డా. కాత్యాయనీ విద్మహే, శ్రీ జి. వల్లీశ్వర్, శ్రీమతి కె.వరలక్ష్మి గార్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీక్షణం ప్రత్యేక సంకలనం, వీక్షణం 13 సంవత్సరాల సమావేశాల ప్రత్యేక సంచికల ఆవిష్కరణ ప్రఖ్యాత టాక్ షో వ్యాఖ్యాత, కౌముది సంపాదకులు శ్రీ కిరణ్ ప్రభ, శ్రీమతి కాంతికిరణ్, వీక్షణం అధ్యక్షులు డా.కె.గీతామాధవి గార్ల చేతుల మీదుగా జరిగింది. కవిసమ్మేళనాన్ని శ్రీ రావు తల్లాప్రగడ గారు నిర్వహించారు.

ముందుగా వీక్షణం వ్యవస్థాపక అధ్యక్షులు డా.కె.గీతామాధవి గారు సభకు ఆహ్వానం పలుకుతూ వీక్షణం ప్రారంభమైన తొలిరోజు నించీ విశేషాంశాల్ని తలుచుకున్నారు. 2012 సెప్టెంబర్ లో కాలిఫోర్నియాలోని బేఏరియాలో వీక్షణం సాహితీ వేదిక అతి సాధారణంగా ప్రారంభమైనా, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా సమావేశాలు జరుపుకుంటూ ఉంది. శ్రీ గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్ గారు వీక్షణం భారతదేశ ప్రతినిధిగా సేవలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా గీత గారు వీక్షణానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేసారు.

సభకు ఆతిథ్యం వహించిన శ్రీ సుభాష్ పెద్దు గారు, డా. వందన ఈనాటి ముఖ్య అతిథులైన శ్రీమతి ఎల్.విజయలక్ష్మి (అలనాటి మేటి నటీమణి), శ్రీ సురజిత్ కుమార్ దే దత్తా, డా. కాత్యాయనీ విద్మహే, శ్రీ జి. వల్లీశ్వర్, శ్రీమతి కె.వరలక్ష్మి గార్లను వేదికకు ఆహ్వానించారు.

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, శ్రీమతి ఎల్.విజయలక్ష్మిగారి సహచరులు శ్రీ సురజిత్ కుమార్‌దే దత్తాగారు, శ్రీమతి ఎల్. విజయలక్ష్మి గార్లు మాట్లాడుతూ తమ జీవితానుభవాల్ని పంచుకున్నారు. సురజిత్ కుమార్‌దే దత్తా గారు హరిత విప్లవంలో ప్రముఖపాత్ర వహించారు. సురజిత్ కుమార్ దే దత్తా గారు అత్యంత సాధారణ జీవితాన్నించి అమెరికాలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన క్రమాన్ని, ఎల్. విజయ లక్ష్మి గారు అత్యంత ప్రముఖ జీవితాన్నించి కుటుంబ జీవితానికి పరిమితమైనా, అలవోకగా జీవితాన్ని ఎన్నో కళలకు, విద్యలను నేర్చుకోవడానికి అంకితం చేసిన విధానం అందరినీ అబ్బురపరించింది.

డా.కాత్యాయనీ విద్మహే గారు ప్రముఖ కథకురాలైన శ్రీమతి కె.వరలక్ష్మి గారి కథల్లోని విశిష్టాంశాల్ని, గ్రామీణ బహుజన జీవితాల్ని ఆవిష్కరించిన విధానాన్ని 'మంత్రసాని', 'స్వస్తి' మొదలైన కథలను విశ్లేషిస్తూ వివరించారు.

ప్రముఖ పాత్రికేయులు శ్రీ జి. వల్లీశ్వర్ గారు తమ పాత్రికేయానుభవాల్ని హాస్యస్ఫోరకంగా వివరిస్తూ ప్రసంగించారు. శ్రీ కిరణ్ ప్రభ గారు అలనాటి ప్రముఖ నటీమణి, గాయని టంగుటూరి సూర్య కుమారి గారి గురించి ప్రసంగించి సభను అలరించారు.

చివరగా శ్రీ రావు తల్లాప్రగడ గారు కవిసమ్మేళనాన్ని తన గజల్ తో శుభారంభం చేశారు. తరువాత డా.కె.గీతామాధవి గారు తమ కవిత ద్వారా వీక్షణం సుక్షణాల్ని పంచుకోగా, కృష్ణకుమార్ పిల్లలమఱ్ఱి గారు పద్య కవితని, వంశీ ప్రఖ్యా గారు కృత్రిమ మేధని గురించిన వచన కవితని, యువకవి శశి ఇంగువ అనువాద పాటని, గాయనీమణి శ్రీమతి గాయత్రి అవ్వారి గారు అద్భుత గానాన్ని వినిపించారు. అన్నిటికంటే ముఖ్యంగా ముఖ్య అతిథి శ్రీమతి ఎల్.విజయలక్ష్మి గారు కూడా తమ అద్భుత గానాన్ని వినిపించడం విశేషం.



అత్యంత ఆసక్తిదాయకంగా జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కవులు, రచయితలు, ప్రముఖులు, సాహిత్యాభిలాషులు శ్రీ చిమటా శ్రీనివాస్, శ్రీమతి పద్మజ చెంగల్వల, శ్రీమతి నీరజ కందాళ, శ్రీమతి అపర్ణ గునుపూడి, శ్రీ సుబ్బారావు గునుపూడి, శ్రీమతి ఝాన్సీ లక్ష్మి, శ్రీమతి ఉదయలక్ష్మి, శ్రీమతి సుచేత, శ్రీ ప్రసాద్ నల్లమోతు, వేమూరి వేంటేశ్వర్రావు, శ్రీమతి ఉమా వేమూరి, శ్రీ బండ్ల కోటేశ్వర రావు, శ్రీ సుబ్బారావు తల్లాప్రగడ, శ్రీ పెద్ది గోపీచంద్, శ్రీ మూర్తి అవ్వారి, శ్రీ ఇంగువ మల్లికార్జున శర్మ, శ్రీమతి ఇంగువ బాలామణి, శ్రీ రావు కాకర్లమూడి మొదలైన వారు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

- పద్మజ చెంగల్వల



## బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన జగిత్యాల టీఎన్జీవోలు

**జగిత్యాల, సెప్టెంబర్ 17(మనం ప్రతినిధి):** జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని ప్రభుత్వం తరపున ముఖ్య అతిథిగా జాతీయ పతాకావిష్కరణకు విచ్చేసిన తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ గారిని టీఎన్జీవో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ జీ.నిరంజన్ జిల్లాలోని ఉద్యోగులం దరికీ ప్రజా పాలన దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రెసా జిల్లా అధ్యక్షులు ఎండి వకీల్, టీఎన్జీవో నాయకులు రవిచంద్ర, రవీందర్, రాజేందర్, రాజేశం, సుగుణాకర్, మధుక ర్, అశోక్ కుమార్, మమత, శైలజ, శ్రావణి, రాజశ్రీ, విజయ లక్ష్మి, నాగరాజు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు అరుణ, నారాయణ, ముజాహిద్ ఖాన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## బుర్ర సాంబరాజుకు ఎమ్మెల్యే నివాళి



**పర్వతగిరి /ఐనవోలు, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** హన్మకొండ జిల్లా ఐనవోలు మండల పరిధిలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మరియు టెస్కాబ్ ఛైర్మన్ మార్నేనీ రవీందర్ రావు నందనం గ్రామానికి చెందిన బుర్ర సాంబరాజు మంగళవారం రాత్రి సమయంలో తాడి చెట్టు పై నుంచి జారి పడి మరణించగా బుధవారం మృతదేహాన్ని ఎంజీఎం మార్చరీలో సందర్శించి నివాళులర్పించి వారి కుటుం బ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చినారు. ఎమ్మెల్యే వెంట బుర్ర రాజ్ కుమార్, మండల సత్యం ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రజాపాలన

- అర్హులందరికీ అభయ హస్తం గ్యారెంటీ పథకాల అమలు
- పెద్దపల్లి జిల్లాలో నూతనంగా 12 వేల 168 కుటుంబాలకు రేషన్ కార్డుల జారీ
- ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణ కోసం పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి డీపీఆర్ తయారీకి కృషి
- పట్టణ ప్రాంతాల్లో రూ.173 కోట్లతో పలు అభివృద్ధి పనులు
- రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా కొత్వాల్ సాహెబ్



**పెద్దపల్లి, సెప్టెంబర్ 17(మనం ప్రతినిధి):** పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతుందని రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా కొత్వాల్ సాహెబ్ అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలలో రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా కొత్వాల్ సాహెబ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బుధవారం ముఖ్య అతిథి పోలీసు గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం, ముఖ్య అతిథి తన సందేశాన్ని తెలియజేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అభయహస్తం గ్యారెంటీ పథకాలను ఒక్కోకటిగా అమలు చేస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల, రూ.500ల గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. పేదల ఆత్మగౌరవానికి మరో ప్రతీక రేషన్ కార్డు లను అర్హులైన పేద కుటుంబాల అందరికీ పంపిణీ చేస్తున్నామని, మన జిల్లాలో నూతనంగా 12 వేల 168 కుటుంబాలకు రేషన్ కార్డ్ జారీ చేశామన్నారు. ప్రజా ప్రభుత్వం ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిందని అన్నారు. కాకతీయ కాలువ క్రింద ఉన్న 2 లక్షల 30 వేల ఆయకట్టు స్థిరీకరణ,10 వేల ఎకరాల కొత్త ఆయకట్టు సాగు నీరు అందించేందుకు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్‌ను 3 నుంచి 5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణానికి డీపీఆర్ తయారు కోసం రూ. కోటి 10 లక్షల మంజూరు చేసామని అన్నారు. 13 వేల 396 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేసే రామగుండం ఎత్తిపోతల పథకం పెండింగ్ పండ్లు యుద్ధ ప్రాతిపదికను పూర్తిచేసే నీటి పారుదల శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించామని తెలిపారు. గోదావరిఖని జనరల్ ఆసుపత్రి రూ. 160 కోట్లతో నిర్మాణం జరుగుతుందన్నారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 173 కోట్లు ఖర్చు చేస్తూ సీసీ రోడ్లు, సీసీ డ్రైయిన్లు, బీటీ రోడ్లు, స్మశాన వాటికలు ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పురపాలక భవనం, డంప్ యార్డ్ వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ కవరేజిని రూ.5 లక్షల నుం చి 10 లక్షలకు పెంచామని, రూ.23 కోట్ల 75 లక్షలతో గోదావరిఖని జనరల్ ఆసుపత్రి నందు 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్, రూ.26 కోట్ల 51 లక్షలతో పెద్దపల్లిలో 100 పడకల ఆసుపత్రి, రూ. 22 కోట్లతో మంథనిలో 50 పడకల ఆసుపత్రి నిర్మిస్తున్నామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో సామాజిక తెలంగాణ సాధనకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏ.అన్నయ్య గౌడ్, అదనపు కలెక్టర్లు జె.అరుణశ్రీ, డి.వేణు, డి.సి.పి. కరుణాకర్, ఆర్.డి.ఓ. బి.గంగయ్య, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్జీసీ అంబాసిడర్‌గా అంజన్



**పెద్దపల్లి, సెప్టెంబర్ 17(మనం ప్రతినిధి):** రాష్ట్ర పర్యావరణం, అడవులు, సాంకేతిక శాఖకు చెందిన నేషనల్ గ్రీన్ కార్ప్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా గూళ్ళ అంజన్ కుమార్ నియమితులయ్యారు. అంజన్ కుమార్ ఇది వరకు పెద్దపల్లి జిల్లా ఎన్‌జీసీ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన పెద్దపల్లి జిల్లాలోని జడ్పీహెచ్‌ఎస్ ఎన్టీపీసీ జ్యోతినగర్ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. అంజన్ మాట్లాడుతూ ఈ పదవీ పర్యావరణ పరిరక్షణ, విద్య పట్ల తనకున్న నిబద్ధతకు గుర్తింపుగా భావిస్తున్నానని తెలిపారు.

## ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు

- జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి



**పెద్దపల్లి, సెప్టెంబర్ 17(మనం ప్రతినిధి):** సెప్టెంబర్ 21 లోపు ప్రీ - ప్రైమరీ ఇన్ స్ట్రక్టర్, ఆయా పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన పని చేయుటకు ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పెద్దపల్లి జిల్లాలో 2025-26 విద్యా సంవత్సరానికి అదనంగా మరో 12 ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభించడానికి చర్యలు చేపట్టామన్నారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలో తాత్కాలికంగా 10 నెలల గౌరవ వేతనానికి పని చేయుటకు ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈఓ తెలిపారు. ప్రీ - ప్రైమరీ ఇన్ స్ట్రక్టర్ పోస్టుకు అభ్యర్థి ఇంటర్మీడియట్ , ఆయాకు 7వ తరగతి ఉత్తీర్ణత సాధించాలని, అభ్యర్థులకు 18 నుంచి 44 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు ఐదు సంవత్సరాల, దివ్యాంగులకు 10 సంవత్సరాల, మాజీ సైనికులకు 3 సంవత్సరాల వయసు సడలింపు ఉంటుందని అన్నారు.

అభ్యర్థుల ఒకే నివాసం, హేబిటేషన్ మండలం పెద్దపెల్లి జిల్లా ప్రాధాన్యత క్రమంలో ఎంపిక ఉంటుందని అన్నారు. విద్యార్హతలు గల అభ్యర్థులు తమ యొక్క దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్లను సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ లకు సెప్టెంబర్ 21 లోపు సమర్పించాలని విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా..

- స్వస్త్ నారీ, సాశక్త్ పరివార్ అభియాన్ అమలు
- సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు మహిళల ఆరోగ్యం పై ప్రత్యేక క్యాంపుల నిర్వహణ
- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**పెద్దపల్లి, సెప్టెంబర్ 17(మనం ప్రతినిధి):** మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేందుకు స్వస్త్ నారీ, సాశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం అమ లు చేస్తున్నామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ అన్నారు. పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం స్వస్త్ నారీ, సాశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రారంభించారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ మాట్లాడుతూ, ఇల్లు బాగుండాలంటే మన ఇంటిలోనే మహిళలు వారి ఆరోగ్యం బాగుండాలన్నారు. మహిళల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా కేంద్ర ప్రభుత్వ పథకాన్ని వినియోగించుకుంటూ వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య క్యాంపులో హెల్త్ చెక్ అప్ చేసుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగిన మహిళలకు సంబంధిత చికిత్సను కూడా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. మహిళల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో ప్రతినెల దాదాపు 200 పైగా ప్రసవాలు విజయవంతంగా జరుగుతున్నాయని, ఈ సేవలో కూడా వినియోగించుకోవాలని తెలిపారు. ఆసు పత్రి అభివృద్ధి, అంబులెన్స్ సేవలు అందించేందుకు అవసరమైన సోమ్ము ఎంపీ నిధుల నుంచి అందించేందుకు కృషి చేస్తానన్నారు.

**కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ..**

స్వస్త్ నారీ, సాశక్త్ పరివార్ అభియాన్ అనే కార్యక్రమాన్ని నేడు దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారని అన్నారు. మన కుటుంబంలో ఉన్న మహిళ ఆరోగ్యంగా ఉంటే, కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందనే ఉద్దేశంతో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు 15 రోజులు మహిళల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల పట్ల ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలలో స్పెషాలిటీ డాక్టర్లను ఏర్పాటు చేసి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించడం జరుగుతుందన్నారు. హైపర్ టెన్షన్, డయాబెటిస్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, అనేమియా, టీబీ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతాయన్నారు. గైనకాలజిస్ట్, ఐ స్పెషలిస్ట్, ఇయర్స్ స్పెషలిస్ట్, డెర్మటాలజిస్ట్, డెంటల్ సర్జన్ వంటి ప్రత్యేక వైద్యుల సేవలను వినియోగించుకొంటున్నామని అన్నారు. మహిళలు తమకు ఎటువంటి ఆరోగ్య సమస్యలున్నా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని కలెక్టర్ కోరారు. డీఎంహెచ్ఓ డా.వాణిశ్రీ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- సిరిసిల్ల అంబేద్కర్ నగర్ యూపీహెచ్‌సీలో స్వస్థ్ నారి, సాశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం
- హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- నిక్షయ్ మిత్ర కింద 10 మందికి పోషకాహారం పంపిణీ



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** మహిళలు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహించనున్న స్వస్థ్ నారి, సాశక్త్ పరివార్ అభియాన్ సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్, ఏరియా హాస్పిటల్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బస్తీ దవఖానాల్లో ప్రత్యేక వైద్య నిపుణులతో ఆరోగ్య పరీక్షలు చేస్తారని వివరించారు. మహిళల్లో ఎక్కువగా కనిపించే రక్తహీనత డయాబెటిస్, రక్తపోటు సమస్యలపై ప్రత్యేక పరీక్షలు సలహాలు అందించాలన్నారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రతి రోజూ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని, విద్యాశాఖ అధికారి, సంక్షేమ శాఖ అధికారి, ఇంటర్మీడియట్ అధికారుల సహకారంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలోని బాలికలందరికీ స్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేసి వైద్యుల ద్వారా అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల ఆరోగ్య పరీక్షలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అవసరమైన వారికి ఆరోగ్య శిబిరాలకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి, సంక్షేమ శాఖ అధికారి సమన్వయంతో పని చేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం అనే కార్యక్రమం కింద ప్రత్యేక వైద్య నిపుణుల చే కంటి పరీక్షలు, చెవి ముక్కు గొంతు, రక్తపోటు, డయాబెటిస్, దంత పరీక్షలు, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలు, గర్భిణీ స్త్రీలకు పరీక్షలు, టీబీ పరీక్ష, సికిల్ సెల్ ఎనీమియా, మాతా శిశు సంరక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలి కొరకు వంట నూనెలను తగ్గించడం ద్వారా ఊబకాయాన్ని తగ్గించడం, రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం గురించి మహిళలకు అవగాహన కల్పిస్తామని, ప్రజల భాగస్వామ్యంతో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, నిశ్చయిమిత్ర వాలంటరీలు రిజిస్ట్రేషన్లు చేస్తారని వివరించారు. టీబీ నియంత్రణకు నిక్షయ మిత్ర ఎన్ రోల్ మెంట్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అనంతరం పది మందికి టీబీ బాధితులకు పోషకాహార కిట్లు, కోడిగుడ్లు పంపిణీ చేశారు.సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రజిత తదితరులు పాల్గొన్నారు.

# స్వతంత్ర భారతావనిలో ఘనంగా ప్రజాపాలన

- జాతీయ జెండాను ఎగురవేసిన ప్రభుత్వ విప్
- హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గితే



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** ప్రజా పాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గితే హాజరయ్యారు. ముందుగా జాతీయ జెండాను ప్రభుత్వ విప్ ఎగుర వేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల పై వివరించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడారు. సెప్టెంబర్ 17, 1948లో తెలంగాణ నాటి హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో ఐక్యమై 77 సంవత్సరాలు పూర్తి చేసుకుని 78వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ రోజును తెలంగాణ ప్రజా పాలన వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నాం. 1948 సెప్టెంబర్ 17న సువిశాల భారత దేశంలో తెలంగాణ అంతర్భాగమైన రోజు స్వతంత్ర భారతావనిలో 60 ఏండ్ల స్వీయ అస్తిత్వం కోసం ఉద్యమించి స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ నేడు అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నదని చెప్పడానికి చాలా సంతోషంగా ఉంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం తేదీ 09/12/2023న కొలువుదీరింది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నది. ఈ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచి అమలు చేయడం ప్రారంభించింది.

**పోటీ పరీక్షల్లో రాణించేలా..**

జిల్లాలోని విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలకు సిద్ధం చేసేలా 39 రెసిడెన్షియల్ విద్యాలయాల్లో అన్ అకాడమీ సంస్థ ద్వారా రూ.25 లక్షలతో ఐఐటీ ఫౌండేషన్, ఐఐటీ-జేఈఈ, నీట్-యూజీ మెడికల్ ఆన్లైన్ కోచింగ్ తరగతులను నిర్వహిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడం జరుగుతున్నది. మొత్తం 13 వేల 564 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు.

**పనుల జాతర..**

12 మండలాల పరిధిలోని అన్ని గ్రామాలలో పనుల జాతర కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నది. ఉపాధి హామీ పథకం, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, స్వచ్ఛభారత్ వంటి విభాగాల్లో రూ.7 కోట్ల 80 లక్షల విలువ గల 258 పనులు చేపట్టడం జరుగుతున్నది.

**చివరి ఆయకట్టుకు నీరందించేలా..**

తెలంగాణ మాగాణాలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు ఇచ్చే ప్రణాళికలతో పెండింగ్ ప్రాజెక్టులను లక్ష్యాలు నిర్దేశించుకుని పూర్తి చేస్తున్నామని, కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటాల సాధనలో రాజీపడమని ప్రకటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాబాయి, ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా యజ్ఞ మహోత్సవ్ విరాట్ విశ్వకర్మ ఉత్సవం

**పెద్దపల్లి, సెప్టెంబర్ 17(మనం ప్రతినిధి):** సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన యజ్ఞ మహోత్సవ్ విరాట్ విశ్వకర్మ ఉత్సవ వేడుకలో రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా కొత్వాల్ సాహెబ్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్‌లు డి.వేణు, జె.అరుణశ్రీలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ యజ్ఞ మహోత్సవ్ విరాట్ విశ్వకర్మ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అధికారికంగా విశ్వకర్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, విరాట్ విశ్వకర్మ దైవ రూపంగా, ఆధ్యాత్మికతో, భక్తిశ్రద్ధలతో, అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో పూర్వకాలంలో అద్భుతమైన నైపుణ్యంతో విరాట్ విశ్వకర్మ వంటి మహనీయులు దైవసమానులు ఉన్నారని మన భవిష్యత్తు తరాలు తెలుసుకోవాలని, అందుకు ఇలాంటి ఉత్సవాలు దోహద పడతాయని అన్నారు. విశ్వకర్మ సంఘ నేతలు మాట్లాడుతూ అధికారికంగా విశ్వకర్మ ఉత్సవాలను నిర్వహిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా అధికారిక సెలవు ప్రకటించాలని సంఘ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, విశ్వకర్మ కుల సంఘ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

## విశ్వకర్మ భగవాన్ సృజనాత్మకతకు ప్రతీక
## మంత్రి దామోదర్ రాజనర్సింహా
## జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య
## శిల్పులు సమాజ నిర్మాణానికి మూల స్తంభాలు
## టి.జి.ఐ.ఐ.సి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి



సంగారెడ్డి సెప్టెంబర్ 17 మనం న్యూస్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వ శిల్పిగా, దేవ శిల్పిగా మహానగరాలను సృష్టించిన మహోన్నత కర్తగా ఆరాధించబడుతున్న శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ గారి యజ్ఞ మహోత్సవం ( జయంతి ) వేడుకలను బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ, సంక్షేమ సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా , జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య , జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, టి జి ఐ ఐ సి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి కలిసి శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి యజ్ఞ మహోత్సవం లో పాల్గొన్నారు . ఈ సందర్భముగా మంత్రి మాట్లాడారు - విశ్వకర్మ భగవాన్ మనకు సృజనాత్మకత, శిల్పకళ, కర్మనిష్ఠకు ప్రతీక. ఇంజనీర్లు, కళాకారులకు ఈ రోజు ప్రత్యేక మైన రోజు . భగవాన్ విశ్వకర్మను సృష్టికి మొదటి శిల్పి ,వాస్తుశిల్పిగా భావిస్తారు. నిర్మాణం, వాస్తుశిల్పం, శిల్పకళ, సాంకేతిక నైపుణ్యాల దేవుడిగా పరిగణిస్తారని తెలిపారు .విశ్వకర్మ పూజ రోజును శిల్పులు, ఇంజనీర్లు, కళాకారులు సాంకేతిక రంగంలో పనిచేసే వ్యక్తులకు ప్రత్యేకంగా భావిస్తారు. విశ్వకర్మ జయంతి రోజున ఫ్యాక్టరీలు, వర్క్ షాపులు , పరిశ్రమల్లో వడ్రంగి నుంచి స్వర్ణకారుడు, కమ్మరి, మేస్త్రి, శిల్పి, పూజలు చేస్తారు. ఆయన సృష్టించిన దివ్య నిర్మాణాలు, శిల్పాలు మనకు మార్గదర్శకాలు. కార్మికులు, శిల్పులు, వృత్తిదారులు విశ్వకర్మ సంప్రదాయ వారసత్వాన్ని కొనసాగిస్తూ, దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వం ప్రతి వృత్తిదారునికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందించడానికి కట్టుబడి ఉంది. సంక్షేమ పథకాల ద్వారా విశ్వకర్మ వర్గాల అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తుంది మంత్రి పేర్కొన్నారు . జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ - విశ్వకర్మ జయంతి అనేది వృత్తిదారుల, శిల్పకారుల పండుగ. సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర అత్యంత విలువైనది. ముఖ్యంగా నిర్మాణ రంగం, యంత్రాల తయారీ రంగాల్లో పనిచేసే కార్మికుల భద్రత, సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఇంటి, ప్రతి నిర్మాణం వెనుక శ్రమజీవి శక్తి ఉంటుంది. అలాంటి వృత్తిదారుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ముఖ్యంగా నిర్మాణ రంగం, యంత్రాల తయారీ రంగాల్లో పనిచేసే కార్మికుల భద్రత, సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధి నిపెంపొందించుకోవాలని , వృత్తులను గౌరవించుకోవాలి. విశ్వకర్మ ఆత్మవిశ్వాసం, అందరికీ ఆదర్శం అని పేర్కొన్నారు. టి.జి.ఐ.ఐ.సి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ - విశ్వకర్మ జయంతిని ప్రతి సంవత్సరం శిల్పులు, కార్మికులు, కూలీలు, సాంకేతిక రంగంలో పని చేసే వారు అత్యంత భక్తి, శ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. విశ్వకర్మ వృత్తిదారులు, శిల్పులు, కళాకారులు సమాజ నిర్మాణానికి మూలస్తంభాలు. వారికి అవసరమైన సౌకర్యాలు, మార్కెట్ అవకాశాలు కల్పించడమే మన లక్ష్యం. విశ్వకర్మ జయంతి స్ఫూర్తితో అందరూ కృషి, నైపుణ్యాలను పెంపొందించుకుని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్ ,మాధురి , జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జగదీష్ , జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య , ప్రజా ప్రతినిధులు, అధికారులు ,విశ్వకర్మ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు .

# ప్రజా పాలనలోనే తెలంగాణ అభివృద్ధి

## రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



ములుగు, సెప్టెంబర్ 17 మనం ప్రతినిధి: కాంగ్రెస్ ప్రజా పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సీతక్క జెండా ఆవిష్కరించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణ నిజాం పాలనలో ఉండడంతో భారతదేశమంతా ఏకకాలంలో విముక్తి కాలేకపోయిందని నాటి కమ్యూనిస్టులు కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులతో కలిసి పోరాటం చేసిన తర్వాత దాని నెహ్రూ సర్దార్ వల్లభాయ్ పటేల్ నిర్ణయాలు తీసుకుని తెలంగాణకు విముక్తి కలిగించాలని తెలిపారు. నాడు భారతదేశంలో విలీనమైన తెలంగాణలో నేడు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజా పాలన ఆధ్వర్యంలో తెలంగాణ అభివృద్ధి చెందుతుందని నాడు నెహ్రూ పాలనలో నేడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచంద్ర జిల్లా నాయకులు యూత్ నాయకులు అనుబంధ సంఘాల నాయకులు మహిళా నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు చైర్మన్లు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎంతోమంది త్యాగధనుల ఫలితమే నేటి ప్రజాపాలన దినోత్సవం

## జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుపుతాం
## దామోదర్ రాజనర్సింహ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి






సంగారెడ్డి, సెప్టెంబర్ 17 (మనం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లాను అన్ని రంగాలలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిల్పడానికి ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్లో జరిగిన ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ముందుగా కలెక్టరేట్ ప్రాంగణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి ,పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ముందుగా జిల్లా ప్రజలకు మంత్రి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎంతోమంది త్యాగధనుల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ రాష్ట్రం (హైదరాబాద్ స్టేట్) విలీనమైనదని తెలిపారు.తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలపడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజధానికి చేరువగా ఉన్న సంగారెడ్డి జిల్లాను రాష్ట్రంలోని అగ్రగామిగా అన్ని రంగాలలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని ఇందిరమ్మ ఇండ్లు, రుణమాఫీ, ఉచిత గృహ విద్యుత్తు, ఉచిత బస్సు ప్రయాణం, లాంటి అనేక రకాల సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రభుత్వం చేపట్టి సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య, ఎస్పి పరితోష్ పంకజ్ ,టి జి ఐ ఐ సీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి డిఆర్ఓ పద్మజ రాణి, సంగారెడ్డి జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ అంజయ్య ,వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పుట్టిన రోజు వేడుకలు వద్దు..

- అందుబాటులో ఉండను..తిరుపతి వెళ్తున్న
- నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ భగవంతుడిని ప్రార్థించండి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- కార్యకర్తలకు, అభిమానులకు విజ్ఞప్తి



రామచంద్రపురం, సెప్టెంబర్ 17(మనం న్యూస్): ఈ ఏడాది తన పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకోవడంలేదని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. తన పెద్ద కుమారుడు దివంగత గూడెం విష్ణువర్ధన్ రెడ్డి మరణం అనంతరం పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకోవద్దని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 19న ఎమ్మెల్యే జిఎంఆర్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, కార్యకర్తలు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గం వ్యాప్తంగా ఎటువంటి వేడుకలు నిర్వహించవద్దని.. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని కోరారు. కుల మతాలకు అతీతంగా.. నియోజకవర్గ అభివృద్ధి కోసం భగవంతుని ప్రార్థించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తన పుట్టినరోజున సన్నిహితులతో కలిసి తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్నట్లు ఆయన చెప్పారు. నియోజకవర్గ ప్రజల అభిమానం, ఆప్యాయత, ఆశీర్వాదాలు ఎల్లప్పుడు తనపై ఇలాగే ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# సీఎంఆర్ఎఫ్ పేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా

- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్
- రూ.3.25 లక్షల విలువైన చెక్కులు అందజేత



రామచంద్రపురం, సెప్టెంబర్ 17(మనం న్యూస్): ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసాగా నిలుస్తోందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం చిట్కుల్ ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో పటాన్ చెరు నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ-తిప్పగుడిసే సుజాత (60,000), కరణం మంజుల (60,000/-), తిప్పగుడిసే నవీన్(30,000), చిట్కుల్ పరిధిలోని మన్నే వెంకటేష్ (60,000), బొల్లారం మున్సిపాలిటీ - రెడ్డి లక్ష్మణ్ రావు (60,000), గుమ్మడిదల మున్సిపాలిటీ - తుడుం రాజమ్మ (55,000/-) మొత్తం 3,25,000/- విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎం సహాయ నిధ ఆర్థిక భరోసా కల్పిస్తుందని చెప్పారు. ఈ పథకం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, బొల్లారం మాజీ కౌన్సిలర్ సుజాతమహేందర్ రెడ్డి, దానయ్య, ముత్తంగి అశోక్, తుడుం శ్రీనివాస్, గారెల మల్లేష్, మన్నె రఘు, భిక్షపతి రెడ్డి, గోపాల్, గారెల శ్రీనివాస్, దశరథ్, అనిల్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం



ములుగు, సెప్టెంబర్ 17 మనం ప్రతినిధి : జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం జాతీయ సమైక్యత దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు జాతీయ పతాక జెండాను ఘనంగా నిర్వహించారు అనంతరం కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ దేశ ఐక్యత, సార్వభౌమత్వం కోసం పోరాడిన మహానుభావుల త్యాగాలను మనం స్మరించుకోవాలన్నారు. జాతీయ సమైక్యత దినోత్సవం మనందరికీ ఐక్యతా స్ఫూర్తిని మరింత బలపరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి , పోరిక గోవిందు నాయక్, మండల పార్టీ అధ్యక్షులు సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రాంబాబు గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా..

# ప్రధాని మోడీ జన్మదినం, తెలంగాణ విమోచన వేడుకలు

- రక్తదాన శిబిరం, జాతీయ జెండా ఆవిష్కరణ
- పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి



రామచంద్రపురం, సెప్టెంబర్ 17(మనం న్యూస్) : తెల్లాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు బి.రాంబాబు గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు, తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా సేవ పక్షం కార్యక్రమం సందర్భంగా మున్సిపల్ పరిధిలోని అలియన్స్ అపార్ట్మెంట్స్ వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 42 మంది యువకులు, బీజేపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. రక్తదాన శిబిరంలో మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సేవలందించి రక్తాన్ని సేకరించినట్టు రాంబాబు గౌడ్ తెలిపారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం, తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా రాంబాబు గౌడ్ నేతృత్వంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించిన నరేంద్ర మోడీ దేశ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన నాయకుల్లో ఒకరిగా ఎదిగారని కొనియాడారు. తెల్లాపూర్ మున్సిపల్ అధ్యక్షుడు రాంబాబు గౌడ్ మాట్లాడుతూ ప్రధాని మోడీ జన్మదినం, తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని, రక్తాన్ని దానం చేసిన వారందరినీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంషాబాద్ రాజు దేవేందర్ గౌడ్, బాబురాజు గౌడ్, శేఖర్ రెడ్డి, ప్రవీణ్ యాదవ్, నరసింహ, సుధీర్ కుమార్, కోటే రవి, లక్ష్మ రెడ్డి, కృష్ణ యాదవ్, హృషికేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి కళ ఉత్సవాల పోటీలు





చేవెళ్ల, సెప్టెంబర్ 17 ( మనం న్యూస్): శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ తుక్కుగూడ లో బుధవారం నాడు జరిగిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలలో చేవెళ్ల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. సెప్టెంబర్ 4న జరిగిన మండల స్థాయి కళా ఉత్సవ పోటీలలో థియేటర్ గ్రూప్ అనే విభాగంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్/జూనియర్ కళాశాల విద్యార్థినులు అయినా వైష్ణవి అండ్ గ్రూప్(అనూష, మధులక్ష్మి, నవ్యశ్రీ, అక్షయ బిందు) మొదటి స్థానంలో, 2డి విజువల్ ఆరట్స్ పెయింటింగ్ విభాగంలో ఎం. అశ్విని మొదటి స్థానంలో నిలిచి జిల్లా స్థాయిలో కూడా పై రెండు విభాగాలలో ప్రథమ స్థానంలో నిలిచారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్కాపూర్ కు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని వైష్ణవి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. మొత్తం మొదటి మూడు విభాగాలు చేవెళ్ల మండలానికి రావడంతో జిల్లా స్థాయి కళా ఉత్సవ నిర్వాహకులు అయినా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీ జయచంద్ర రెడ్డి, బృందం, న్యాయ నిర్ణేతలు విజేతలను అభినందించారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కళా ఉత్సవ పోటీలలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉండాలని, రెండవ స్థానంలో నిలిచిన వారు ఏమాత్రం అధైర్య పడకుండా వచ్చే సంవత్సరం,తిరిగి కళా ఉత్సవాలలో పాల్గొని కళలను ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో నిర్వాహకులు తాజ్ బాబు,భాస్కర్ రెడ్డి, ఆనంద్, పాఠశాల యాజమాన్యం, న్యాయనిర్ణేతలు రాజేష్,శ్రీదేవి, రూప, ఆల్బర్ట్, రాజశేఖర్,బాలకృష్ణ, పావని తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేయాలి

- సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- పటాన్ చెరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



రామచంద్రపురం, సెప్టెంబర్ 17(మనం న్యూస్): ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేయాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. ఆన్ లైన్ బెట్టింగ్స్, బెట్టింగ్ ఆప్స్, సైబర్ క్రైమ్స్ గురించి ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పోలీస్ అధికారులను సూచించారు. బుధవారం పటాన్ చెరు పోలీస్ స్టేషన్ ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డ్ లైన ఆర్డర్ బుక్, డ్యూటి రోస్టర్, పార్ట్ 2 మ్యాప్ లను తనిఖీ చేశారు. అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లాంగ్ పెండింగ్ కేసుల చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ప్రతి కేసులో నాణ్యమైన, ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఉద్యోగుల తాకిడి, స్కూల్స్, కళాశాల బస్సుల వలన అధిక ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని, దీనిని అధిగమించడానికి ఎన్ఫోర్స్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీఐకి సూచించారు. సులభ మార్గంలో డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్ లైన్ బెట్టింగ్స్, గేమ్స్ ఆడుతూ సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి, చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని అన్నారు. గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. అధికారులు సిబ్బంది 24/7 హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని, దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రజాపాలన

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- అర్హులందరికీ అభయహస్తం గ్యారెంటీ పథకాలు అమలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యాలయాల నిర్మాణం
- తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలలో పాల్గొన్న డిప్యూటీ సీఎం




**ఖమ్మం ,సెప్టెంబర్ 17(మనం బ్యూరో) :** పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో బుధవారం ఉదయం నిర్వహించిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకావిష్కరణ చేసి ప్రజలను ఉద్దేశించి తన సందేశాన్ని తెలియజేసారు. రైతాంగం, కూలీలు భూమి కొరకు, భుక్తి కొరకు భూ పోరాటాలు చేసి, నిజాంప్రభుత్వ సాయుధ రజాకార్లను ఎదురించారని, నిజాం సంస్థానాన్ని సమాఖ్య భారతదేశం ప్రజా పాలనలో భాగంగా చేయుటకు ఎన్నో పోరాటాలు జరిగాయనీ, ఖమ్మం జిల్లాకు కూడా ఇట్టి పోరాటాలలో ప్రముఖమైన పాత్ర ఉందని తెలిపారు. ఆనాడు స్వామి రామానంద తీర్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సర్దార్ జమలాపురం కేశవ రావు మహనీయులు, కొమరం భీమ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ లాంటి అనేక మంది పోరాటంలో భాగస్వామ్యం అయ్యారని, రజాకార్లకు వ్యతిరేకంగా వీరోచితంగా పెద్ద ఎత్తున పోరాటం చేసి ఈ ప్రాంతాన్ని ప్రజాస్వామ్య పాలనలో భాగస్వామ్యం చేశారని, ఈ సందర్భంగా వారిని స్మరించుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. మహాకవి దాశరథి ఖమ్మం జిల్లా నుంచి ప్రయాణం సాగించారని, ఆనాడు సంఘాల ఏర్పాటులో, గ్రంథాలయ ఉద్యమాలలో, రజాకార్లకు వ్యతిరేకంగా, వీరోచితంగా జరిగిన పోరాటంలో ఖమ్మంకు ప్రముఖ పాత్ర ఉందని, బొమ్మ కంటి సత్యనారాయణ రావు, రామ్ చందర్ రావు, శీలం సిద్ధారెడ్డి, నల్లమల్ల గిరిప్రసాద్, మహ్మద్ రజబ్ అలీ, వెంగళరావు లాంటి అనేక ప్రముఖులు మన జిల్లా నుంచి ప్రముఖ పాత్ర పోషించారని, ఖమ్మం ప్రాంతం నుండి ఇమ్రోజ్ ఉర్దూ పత్రికా ఎడిటర్ అయిన షోయబ్ ఉల్లా ఖాన్ నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా కలమెత్తి రజాకార్ల చేతిలో మరణించారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే అమలు చేయడం ప్రారంభించడం జరిగిందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అభయహస్తం గ్యారెంటీ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, 500 రూపాయలకె గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.

తెలంగాణ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 ను ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని అన్నారు. 2030 నాటికి లక్షా 98 వేల కోట్ల పెట్టుబడి తో 20 వేల మెగా వాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసి లక్షా 14 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ఇందిరా మహిళ శక్తి పథకం క్రింద మహిళా సంఘాల ద్వారా రెండు మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇందిరా సౌర గిరి జల వికాసం క్రింద మన జిల్లాలో మొదటి విడత క్రింద 550 లబ్ధిదారులను ఎంపిక చేసి సోలార్ పంపు సెట్ల ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

ఎస్సీ, ఎస్టి, బీసి, మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా 128 రెసిడెన్షియల్ పాఠశాలలో 20 వేల 502 మంది విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం వసతి కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో 5 అసెంబ్లీ నియోజకవర్గాలలో 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో, ఇంగ్లీష్ మీడియం బోధనతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం చేపట్టామని అన్నారు. రేషన్ కార్డులను అర్హులైన పేద కుటుంబాల అందరికీ పంపిణీ చేస్తున్నామని, మన జిల్లాలో నూతనంగా 24 వేల 818 కుటుంబాలకు రేషన్ కార్డ్ లను జారీ చేశామని అన్నారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరేజిని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని, మధిర, సత్తుపల్లి పట్టణాలలో 34 కోట్ల చొప్పున ఖర్చు చేస్తూ 100 పడకల ఆసుపత్రి, కల్లూరులో 10 కోట్ల 50 లక్షలతో 50 పడకల కమ్యూనిటి హెల్త్ సెంటర్, పెనుబల్లి నందు 7 కోట్ల 50 లక్షలతో 30 పడకల కమ్యూనిటి హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. పాలేరు, సత్తుపల్లి పట్టణాల్లో 25 కోట్ల చొప్పున ఖర్చు చేస్తూ చేపట్టిన నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, వైరా పట్టణంలో 37 కోట్ల 50 లక్షలు ఖర్చు చేస్తూ చేపట్టిన 100 పడకల ఆసుపత్రి భవనం, ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి నందు 23 కోట్ల 50 లక్షలతో చేపట్టిన 50 పడకల క్రిటికల్ కేర్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. బీసి లకు 42 శాతం రిజర్వేషన్ తో సామాజిక తెలంగాణ సాధనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఆర్ అండ్ బీ శాఖ ద్వారా 180 కోట్లతో మున్నేరు నదిపై తీగల వంతెన నిర్మాణ పనులు,130 కోట్లతో వైద్యకళాశాల భవన నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయనీ, 139 కోట్లతో 10 రెండు వరుసల రహదారిని 4 వరుసల రహదారులుగా విస్తరించడం జరిగిందనీ, సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాలో లక్షా 38 వేల 790 ఎకరాలలో కొత్త ఆయకట్టుకు సాగునీటి వసతి కల్పన చేస్తున్నామని, దీని ద్వారా నాగార్జున సాగర్ ఎడమ కాలువ, వైరా, లంక సాగర్ ప్రాజెక్టులు, చిన్న నీటి వనరుల సాగునీటి సప్లిమెంట్ చేసేందుకు పాలేరు లింక్ కాలువ నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. పర్యావరణ సమతుల్యత పాటించడానికి, భూతాపాన్ని తగ్గించడానికి ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి 2025-26 సంవత్సరంలో జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమం క్రింద 35 లక్షల 32 వేల మొక్కలు నాటడం లక్ష్యంగా చర్యలు చేపట్టి, ఇప్పటి వరకు 29 లక్షల 68 వేల ఒక వంద మొక్కలు నాటడం జరిగిందనీ తెలిపారు. అంతకుముందు దేశ భక్తి గేయాలపై న్యూ విజన్ కాన్సెప్ట్ స్కూల్, టేకులపల్లికి చెందిన టీజీఎస్.డబ్ల్యూఆర్ ఎస్ గురుకుల బాలికల విద్యార్థినిలు చేసిన ప్రదర్శనలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం గిరిజన సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమం, గురుకుల శాఖలు, మహాత్మా జ్యోతి బా పూలే తెలంగాణ బ్యాక్వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ, చేనేత జౌళి శాఖ, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, జిల్లా పౌర సరఫరాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య, వ్యవసాయ, విద్యుత్, తదితర శాఖలు అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమం ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాల్ లను డిప్యూటీ సి.ఎం. సందర్శించి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డి.ఎఫ్.ఓ. సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

# ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు

**మధిర, సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని భారతదేశంతో పార్టీ మధిర టౌన్ మరియు రూరల్ శాఖల ఆధ్వర్యంలో యువ మోర్చా రాష్ట్ర నాయకులు మర్సకట్ల స్వర్ణాకర్ సారథ్యంలో మధిర ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రక్తదాన వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ యొక్క రక్తదాన శిబిరంలో 40 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర క్రిషన్ మోర్చా అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి , ఖమ్మం జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు గల్లా సత్యనారాయణ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ తొలగింపు, భవ్యమైన రామ మందిర నిర్మాణం, అనాచార చట్టంతో మైనారిటీ మహిళలకు ఇబ్బందిగా మారిన త్రిపుల్ తలాక్ చట్టం తొలగింపు దాని గురించి మహిళలకు ప్రాధాన్యమిస్తూ చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ల బిల్లు ఆమోదం వంటి ప్రగతిశీల నిర్ణయాలు జరిగాయని అన్నారు.

ఆ తరువాత భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్ లో ఉన్న వినాయకుని గుడి వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ టౌన్ మరియు రూరల్ అధ్యక్షులు శివరాజ్ సుమంత్ గడ్డం శ్రీహరి చౌదరి తో పాటు



సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశాన్ని పరమ వైభవ స్థితికి తీసుకు వెళ్లేందుకు నిరంతరం పరిశ్రమిస్తూ దేశంలోని సామాజిక రుగ్మతల ను రూపుమాపేందుకు ప్రయత్నిస్తూ దేశాన్ని ప్రగతి పదంలోకి తీసుకు వెళుతున్నారని ఆర్టికల్ 370 నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు సోమేశ్వరరావు, రామ యోగేశ్వరరావు, చిలువేరు సాంబశివరావు, గుండా చంద్రశేఖర్ రెడ్డి, కుంచం కృష్ణారావు, పాపట్ల రమేష్, సాయి, వేణు, బొల్లారెడ్డి, జాన్ మియా, గౌసుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఓ వరం సీఎంఆర్ఎఫ్ పథకం

## 12 మందికి చెక్కుల పంపిణీ



**చుంచుపల్లి, అక్టోబర్ 17(మనం న్యూస్) :** చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కార్యాలయంలో ప్రైవేట్ ఆస్పత్రులలో పలు వ్యాధులతో చికిత్స పొందిన 12 మంది లబ్ధిదారులకు 3 లక్షల 58వేల రూపాయిల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, పెద్దబాబు, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, భద్రాద్రి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని, పలు ఆసుపత్రులలో చికిత్స పొందిన వారికి ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి వీలైనంత త్వరగా సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందేలా చేశారని, అంతేకాక అనునిత్యం కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సంక్షేమ పథకాలు అందించడంలో ఆయన చేస్తున్న కృషి చేస్తున్నారన్నారు.

ఎంతో మంది సకాలంలో చికిత్స పొందలేక ప్రైవేట్ ఆస్పత్రిలలో అప్పులు చేసి, ఖర్చు పెట్టుకున్న బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మగుడి చైర్మన్ బాలినేని నాగేశ్వరావు, రైల్వే బోర్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్, ఆర్టీఐ బోర్డు సభ్యులు జోషి, సుజాతనగర్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు బాల పాసి, కేకే శ్రీను, జానీ భాయ్, తలుగు అనిల్, కున్సోత్ కిషన్, సుందర్ లాల్ కోరి, పూనెం శ్రీను, ఐవైసి నియోజకవర్గ అధ్యక్షులు పాల సత్యనారాయణ రెడ్డి, జిల్లా కార్యదర్శి గులాం మతిన్, తదితరులు పాల్గొన్నారు.

# మైలారం పాఠశాలలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

- ప్రజల సహకారంతోనే ప్రజాపాలన సాధ్యం..
- టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు...

**ఆళ్లపల్లి, సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** మండల పరిధిలోని మైలారం గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోగ రాంబాబు తెలిపారు. ప్రజా పాలన దినోత్సవం పురస్కరించుకొని మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు, కార్యాలయాలలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు మాట్లాడుతూ ప్రజా పాలన అనేది ప్రజాస్వామ్యానికి పునాది అని ప్రజల అభిప్రాయాలు, ఆకాంక్షలు, సమస్యలను గుర్తించి వాటికి సరైన పరిష్కారం చూపడం, సమాజాన్ని సమానత్వం, న్యాయం, అభివృద్ధి దిశగా నడిపించడం ప్రజా పాలన యొక్క ముఖ్య లక్ష్యమని అన్నారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజల కోసం ప్రజల చేత, ప్రజల ద్వారా నడిచే అందులో ప్రతి పౌరుడి పాత్ర అత్యంత ముఖ్యమైనదనీ, ప్రభుత్వాలు రాష్ట్ర అభివృద్ధి కొరకు



ప్రణాళిక బద్ధమైన విధానాలను రూపొందించిన, అది పూర్తిగా విజయవంతం కావాలంటే ప్రజలు, యువత పాత్ర ముఖ్యమైనదని ప్రతి ఒక్కరు సహకరించడం వల్ల దేశ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందనీ పేర్కొన్నారు.మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ తో సహా మండల వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజాపాలన దినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు.

# ప్రజా పాలనలో ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యం

- రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రైతు సంక్షేమానికి తెలంగాణ కేరాఫ్‌గా నిలుస్తోంది




**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 17 (మనంప్రతినిధి) :** ప్రజా పాలన దినోత్సవం తెలంగాణ చరిత్రలో గర్వకారణమైన రోజు అని, 1948 సెప్టెంబర్ 17న హైదరాబాదు సంస్థానం భారతదేశంలో కలిసిన చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేస్తుందని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులు, ప్రజా పోరాట యోధుల త్యాగం వల్లే నేడు ప్రజాస్వామ్య విలువలు స్థిరపడ్డాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజలే పాలకులు, ప్రజలే అధిపతులు అనే స్ఫూర్తిని ఈ రోజు అందరికీ గుర్తు చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లాకు విచ్చేసిన మంత్రి కి ఇల్లందు క్రాస్ రోడ్ లో గల సింగరేణి గెస్ట్ హౌస్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐడిఓసి కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జాతీయ పతాక ఆవిష్కరణ చేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా ప్రజలకు తన సందేశాన్ని అందించారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దార్శనిక నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. విద్యుత్తు, నీటిపారుదల, వ్యవసాయం, పరిశ్రమలు, ఐటీ, ఉపాధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. ఇందిరమ్మ ప్రజా పాలనలో ప్రజల హక్కులు కాపాడబడుతున్నాయని, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా వంటి పథకాల ద్వారా రైతు సంక్షేమానికి తెలంగాణ కేరాఫ్గా నిలిచిందని పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ.. సీతారామ ప్రాజెక్ట్తో నీటి కల నెరవేరిందని, ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ స్థాపనతో జిల్లాకు ఖ్యాతి తెచ్చిందని, భద్రాచలానికి రాకపోకల సౌకర్యం కల్పించేలా రైల్వే లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. కొత్తగూడెం గ్రీన్ ఫీల్ ఎయిర్పోర్ట్, రింగ్ రోడ్, బైపాస్ రోడ్, నేషనల్ హైవే పనులు కూడా ప్రగతిలో ఉన్నాయని వివరించారు. సింగరేణి సంస్థను బలోపేతం చేయడం, భవిష్యత్లో థర్మల్ సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం పట్ల ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. తరువాత ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి , విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భగవాన్ విరాట్ విశ్వకర్మ గారు విశ్వశిల్పి, దేవశిల్పి, ఆకాశానికి, భూమికి, దేవాలయాలకు, రథాలకు, ఆయుధాలకు రూపకర్తగా నిలిచారని వివరించారు. దేవతలకు కావలసిన నిర్మాణాలు, నగరాలు, ఆభరణాలు, శిల్పకళా నిర్మాణాలు అన్నీ విశ్వకర్మ సృష్టి ఫలితమని ఆయన అన్నారు. విశ్వకర్మ ఆవిష్కరణలు, శిల్పకళ, శ్రమ విలువను గుర్తిస్తూ ఆయనను అద్యబ్రహ్మగా పూజిస్తున్నామని తెలిపారు. బడుగు బలహీన వర్గాలు, కూలీలు, శ్రమజీవులు, చేతివృత్తిదారుల ప్రతిభ, కృషి వల్లే సమాజం ముందుకు సాగుతుందని, వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. బీసీల కుల గణన కూడా ఈ వర్గాలకు గౌరవప్రదమైన స్థానం కల్పించడానికి చేపట్టిన ఒక చారిత్రక అడుగు అని తెలిపారు. ఈ కుల గణనను అందరూ సమర్పించి అక్కడకు బలహీన వర్గాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు, కేంద్ర ప్రభుత్వం దీనికి సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.సంక్షేమ పథకాలు ప్రతి వర్గానికి చేరేలా చూడటం మనందరి బాధ్యత అని మంత్రి గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యా చందన, బీసీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, జిల్లా అధికారులు, ఉద్యోగులు, బీసీ సంఘం నాయకులు వెంకటాచారి , వారాధి సత్యనారాయణ , బసవపాత్రుని తిరుపతి , వారాధి రామాచారి , బి. సాంబయ్య , ఎస్. కృష్ణమాచారి , కూరపాటి లింగాచారి , పొడిచేటి వెంకటాచారి మరియు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖా మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- 1వ డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

**ఖమ్మం, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ పరిధిలోని 1వ డివిజన్ కైకొండాయగూడెం లో సిసి రోడ్ల నిర్మాణ పనులకు, మంత్రి, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి శంఖుస్థాపన చేశారు. మునిసిపల్ సాధారణ నిధులు రూ. 133.4 లక్షల వ్యయంతో 6 సిసి రోడ్లు, రూ. 176.1 లక్షల వ్యయంతో 9 సిసి రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 1వ డివిజన్ లోని మారుతినగర్, బాలాజినగర్ లలోని 8 కాలనీలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కాలనీల అభివృద్ధి కి పనులు చేపట్టినట్లు తెలిపారు. మళ్లీ వర్షాకాలం వచ్చేలోగా డివిజన్ లో అన్ని సిసి రోడ్లు పూర్తి చేస్తామన్నారు. సిసి రోడ్ల పూర్తి పిదప డ్రెయిన్ల నిర్మాణాలు చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేకున్నా, ఇచ్చిన ఒక్కొక్క మాటను ప్రజా ప్రభుత్వం అమలుచేస్తుందని, భవిష్యత్తులో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, నగరపాలక సంస్థ డిఇ ధరణి కుమార్, ఏఇ నరేంద్ర తేజ, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి నాణ్యమైన గోదావరి ఇసుక

- ఇందిరమ్మ ఇళ్లకు ఒక ట్రాక్టర్ కి రూ.1100, ఇతరులకు 1300 రూపాయలకు పంపిణీ..
- విలేకరుల చిట్ చాట్ లో తహశీల్దార్ రాంబాబు...

**మధిర, సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** మధిర నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో భద్రాచలం గోదావరి నుండి నాణ్యమైన ఇసుకను మధిర ప్రజలకు సరసమైన ధరలకు పంపిణీ చేయటం జరుగుతుందని మధిర తాహసిల్దార్ రాంబాబు విలేకరుల చిట్ చాట్ లో పేర్కొన్నారు.. బుధవారం మధిర రెవెన్యూ పరిధిలో జరుగుతున్న పలు అంశాలపై విలేకరుల చిట్ చాట్ సందర్భంగా తహశీల్దార్ రాంబాబు మాట్లాడుతూ మధిర ప్రాంత ప్రజలకు నాణ్యమైన గోదావరి ఇసుకను ఇందిరమ్మ లబ్ధిదారులకు రూ 1100 ట్రాక్టర్ ఇసుక ఇతరులకు 1300 రూపాయలు చొప్పున తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో మధిర మార్కెట్ యార్డ్ లో ఇసుక బజార్ ద్వారా అమ్మకాలు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



**స్మశాన వాటిక ఆక్రమణలను గుర్తించి మున్సిపాలిటీ కి అప్పగించాం..**

మధిర మున్సిపాలిటీ పరిధిలోని 424 సర్వే నెంబర్లు 4275 గజాల స్థలం ఆక్రమణకు గురికాగా ఆ స్థలాన్ని గుర్తించి మున్సిపాలిటీకి అప్పజెప్పామని తహశీల్దార్ పేర్కొన్నారు. అదేవిధంగా 429 430 424 425 సర్వే నెంబర్లు గుంట వెళుతున్న డొంక ఆక్రమణలను గుర్తించి 6,801 గజాల స్థలాన్ని మధిర మున్సిపాలిటీకి అప్పగించడం జరిగింది అని తెలిపారు. స్మశాన వాటికలో బిపిఎల్ కింద 14 మంది ఇల్లు నిర్మించుకున్నారని వారికి కూడా నోటీసులు ఇచ్చామన్నారు. ఏపీఎల్ కింద ఒక వ్యక్తి ఇల్లు నిర్మించారని వారికి కూడా నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. డొంక ఆక్రమణంలో బిపిఎల్ కింద ముగ్గురు ఏ పీ ఎల్ కింద ముగ్గురు 5, 403 గజాల స్థలాన్ని ఆ ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా బొట్టు మామ్మ 23 గుంటల భూమికి సంబంధించిన స్థలంపై నోటీసులు ఇవ్వటం జరిగిందని వారు ఆర్డిఓ కి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా అక్కడ ఆక్రమణకు సంబంధించిన వారందరికీ నోటీసులు జారీ చేయడం జరిగింది అని తెలిపారు.

**సాదా బైనామ లో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి పట్టాల పంపిణీ చేస్తాం**

2014 జూన్ 2 లోపు భూమిని సాదా బైనామా పద్ధతిలో కొనుగోలు చేసిన వారిలోని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అర్హులైన వారికి పట్టాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. సాదా బైనామాల ద్వారా రెవెన్యూ సదస్సులో 485 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అదేవిధంగా 2020లో 1766 మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. కాగా ప్రస్తుతానికి 121 మంది రైతులు సాదా బైనామ ద్వారా భూములు కొనుగోలు చేసినట్లు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని హైకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ అనుమతితో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి విచారించి పట్టాలు పంపిణీ చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

**అక్రమ ఇసుక రవాణా కు పటిష్ట చర్యలు చేపడుతున్నాం..**

మధిర మండల పరిధిలోని కొన్ని రేవుల నుండి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందని కూపన్లు తీసుకోకుండానే కొంతమంది ఇసుక మాఫియా దారులు అక్రమ రవాణా చేస్తున్నారని తాసిల్దార్ దృష్టికి మనం తీసుకోగా వారిని నియంత్రించేందుకు అక్రమ ఇసుక రవాణా జరగకుండా చూసేందుకు నూతనంగా నియమితులైన గ్రామ పరిపాలన అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించడం జరిగిందని అక్రమ ఇసుక రవాణా చేపట్టే వారిపై చర్యలు తీసుకోవటమే కాకుండా ట్రాక్టర్ లను సీజ్ చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులుకు పది కోపంలో ఇవ్వటం జరుగుతుందని వారు వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని ఎవరికైనా వారికి ఇందిరమ్మ కూపన్ ఇస్తే వారి పైన కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులు సక్రమంగా కూపన్లు ఉపయోగించుకోవాలని తెలిపారు.

# నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం సాయుధ పోరాటం

## వాణిజ్యం శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు





**సూర్యాపేట, సెప్టెంబర్ 17 (మనం ప్రతినిధి):** అమరుల త్యాగాల ఫలితమే స్వరాష్ట్ర ఆకాంక్ష నెరవేరిందని రాష్ట్ర ఐ టి, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్, పరిశ్రమలు వాణిజ్యం శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిదుదిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలలో రాష్ట్ర ఐ టి, ఎలక్ట్రానిక్స్ . కమ్యూనికేషన్, పరిశ్రమలు వాణిజ్యం మరియు శాసన సభ వ్యవహారాల శాఖ మాత్యులు దుదిళ్ళ శ్రీధర్ బాబు పాల్గొన్నారు. మంత్రి జాతీయ పతాకావిష్కరణగావించి, పోలీస్ లచే గౌరవ వందనం స్వీకరించి జాతీయ గీతాలాపన, రాష్ట్రీయ గీతాలాపన చేశారు.తెలంగాణ ప్రజాపాలన దినోత్సవము జరుపుకుంటున్న శుభ సందర్భంగా రాచరిక వ్యవస్థ నుండి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భావం కోసం.. అమరులైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు, స్వాతంత్ర్య సమరయోధులకు మరియు తెలంగాణ అమరవీరులకు జోహార్లు ఘటిస్తూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజు, తెలంగాణ ప్రాంతం భారత్ యూనియన్లో విలీనమై నేటికి 77 సంవత్సరాలు పూర్తి చేసుకొని 78వ సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా ఈ రోజు ఇక్కడ హాజరైన ప్రజా ప్రతినిధులు, జిల్లా న్యాయమూర్తులు, అధికారులు, అనధికారులు, పాత్రికేయులు, ఉద్యమకారులకు, కళాకారులకు, కార్మిక, కర్షక, విద్యార్థినీ, విద్యార్థులకు, జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ....ఈ దేశం మన అందరిది అనే భావన ప్రతీ ఒక్కరిలో ఉండాలని కలలు కన్న మహాత్మాగాంధీ ఆశయం, సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభాయ్ పటేల్, జవహర్ లాల్ నెహ్రూల నాయకత్వం, ప్రజల సుదీర్ఘ పోరాటంతో స్వతంత్ర భారతదేశం ఏర్పాటయిందని గుర్తు చేశారు. దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబరాల్లో మునిగిపోతే బ్రిటన్ పార్లమెంటు ఆమోదించిన ఇండిపెండెన్స్ యాక్టు కారణంగా హైదరాబాద్ సంస్థాన ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యానికై ఇంకా పోరాడాల్సి వచ్చిందని ఇండియా ఇండిపెండెన్స్ యాక్టు ప్రకారం హైదరాబాద్ సంస్థానం స్వతంత్రంగా ఉంటుందని నిజాం రాజు ప్రకటించారని అన్నారు. నిజాం నిరంకుశ పాలనలో భూస్వామ్య, జాగీర్దారీ విధానం, వెట్టిచాకిరి, బలవంతపు పన్నుల వసూళ్లు, రజాకార్ల దాష్టికం, ఆగడాలతో తెలంగాణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని దీంతో నిప్పు రవ్వ అడవిని అంటుకున్నట్టు చిన్న చిన్నగా మొదలైన నిజాం వ్యతిరేక పోరాటం తెలంగాణ మొత్తం వ్యాపించిందని రైతులు, మహిళలు, సకల జనులంతా ఏకమై ఆయుధాలు ధరించి, హైదరాబాదు సంస్థానాన్ని భారత యూనియన్లో విలీనం చేయాలని సాయుధ పోరాటం ఉధృతం చేశారని చెప్పుకొచ్చారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించి విద్యార్థులచే మంత్రి ఫోటోలు దిగుతూ వారిని ప్రోత్సాహించారు.జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పి కే నరసింహ, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్,అదనపు కలెక్టర్ సీతారామారావు, అదనపు ఎస్పి జనార్ధన్, నరసింహ చారి,ఆర్డీఓ వేణుమాధవ్,జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు ఈ వేడుకలకు హాజరయ్యారు.

# వేములవాడలో రక్తదాన శిబిరం

- స్వచ్ఛందంగా రక్తదానంలో పాల్గొన్న యువకులు
- ప్రత్యేకంగా అభినందించిన వేములవాడ నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జ్ చెన్నమనేని వికాస్



**వేములవాడ,సెప్టెంబర్17(మనం న్యూస్):** భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడ నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జి చెన్నమనేని వికాస్ రావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 200 మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి హాజరయ్యారు. అనంతరం వికాస్ రావు మాట్లాడుతూ మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బిజెపి పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా సేవాపక్షం అనే కార్యక్రమాన్ని తీసుకొని దేశవ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా 15 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశ ప్రధాని జన్మదిన ఉత్సవాన్ని ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా రక్తదానంలో పాల్గొన్న 200 మంది యువకులను వికాస్ రావు ప్రత్యేకంగా అభినందించి మేమేంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, అల్లాడి రమేష్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, వేములవాడ పట్టణ బిజెపి అధ్యక్షులు రాపల్లి శ్రీధర్, అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్, రూరల్ అధ్యక్షుడు బూర పరమేష్, చందుర్తి మండలాధ్యక్షుడు మొకిలే విజేందర్ నాయకులు చింతపల్లి వెంకటేశ్వరరావు, బండ మల్లేశం యాదవ్, రేగుల రాజ్ కుమార్, రేగుల సంతోష్ బాబు, పిన్నింటి హనుమాన్లు, పల్లం అన్నపూర్ణ, కాట్కామ్ శ్రీనివాస్, అన్నం నర్సయ్య వివిధ మండలాల బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నవాబుపేట బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



- ముఖ్యఅతిథిగా ఎంపీ డీకే.అరుణ

**నవాబుపేట, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నవాబుపేట మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, జిల్లా బీజేపీ అధ్యక్షులు పి. శ్రీనివాసరెడ్డి, జనార్ధన్ రెడ్డి, మండల ఇన్చార్జి డీకే అర్జున్ రెడ్డి, పాల్గొన్నారు ఈ కార్యక్రమం మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పి. సంతోష్ గౌడ్ సమన్వయంతో నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో మొత్తం 110 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గణేష్ చారి, యు. మల్లేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రేవ్ శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి, సోషల్ మీడియా కన్వీనర్ నరేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధుసూదన్ రెడ్డి, పసుపుల యాదయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, సేవే మన ధర్మం అన్న మాటను సార్థకం చేస్తూ, ప్రతి సంవత్సరం మోదీ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకుంటున్నామని తెలిపారు. యువత రక్తదానంలో పాల్గొనడం అభినందనీయమని, ఇది సమాజానికి మంచిని కలిగించే కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రముఖ బీజేపీ కార్యకర్తలు, నాయకులు, యువకులు, స్త్రీమండలి సభ్యులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

# పక్షం రోజుల పాటు స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్

- సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు కార్యక్రమాలు నిర్వహణ
- మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ బి. సత్యప్రసాద్



**జగిత్యాల సెప్టెంబర్ 17 ( మనం ప్రతినిధి ):** మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి అని కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ పై జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ శిశు సంక్షేమ పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళల ఆరోగ్యం కోసం సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2తేదీ వరకు స్వస్థ్ నారి స్వశక్తి పరివార అభియాన్ కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు నిర్వహించు పోషణ మహోత్సవం కార్యక్రమంలో పౌష్టికాహార లోపాన్ని పిల్లలలో గర్భిణీలలో బాలింతలలో నివారించడం మరియు రక్తహీనతను తగ్గించడం మరియు ధైర్య మంచినీరు పరిశుభ్రత పారిశుధ్యం పౌష్టికాహారం గురించి ప్రజల్లో చైతన్యం కలిగించేలా పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 'వోకల్ ఫర్ లోకల్' నినాదంతో గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహించి చిన్నపిల్లలకు మెరుగైన ఆహారపు అలవాట్లుఅలవర్చే విధంగా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో గ్రామస్థాయి నుంచి మున్సిపాలిటీల వరకు నిర్వహించే ఈ కార్యక్రమం స్పెషలిస్ట్ వైద్యులు చికిత్స అందజేయాలని సూచించారు. మాతా, శిశు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధతోపాటు మహిళలకు వచ్చే వివిధ రకాలహైపర్ టెన్షన్, డయాబెటీస్, సర్వికల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, అనేమియా, టిబి వంటి వ్యాధులను ప్రాథమిక స్థాయిలో గుర్తించి పరీక్షలను నిర్వహించి సూచనలు ఇవ్వాలని తెలిపారు. పక్షం రోజులపాటు నిర్వహించే స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నేడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారని తెలిపారు. మహిళలు స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆడపిల్లలు మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి వ్యాధులు చూపకుండా జాగ్రత్త వహించాలన్నారు. మహిళలు ఎటువంటి ఆరోగ్య సమస్యలున్నా కూడా సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షించుకోవాలని తెలిపారు.15 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని విజవంతం చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎం సి హెచ్ సూపరింటెండెంట్ కృష్ణ మూర్తి, జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్, డిడబ్ల్యూవో నరేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎస్పీ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవం



**ములుగు, సెప్టెంబర్ 17 మనం ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజల శాంతిభద్రత పరిరక్షణలో ప్రతి పోలీస్ సిబ్బంది మరింతగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఎస్పీ శివ ఉపాధ్యాయ, డి సి ఆర్ బి డి ఎస్ పి కిషోర్ కుమార్, ములుగు డిఎస్పి రవీందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్



**జగిత్యాల సెప్టెంబర్ 17( మనం ప్రతినిధి ):** జిల్లా కలెక్టర్ లో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, అధ్యక్షతన ప్రజా పాలన దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, అధికార అనధికారులకు ప్రజా పాలనా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ బి. ఎస్. లత లు కలిసి రాష్ట్ర బీ. సీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ కి పూల మొక్క అందించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా సాధించిన ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ వేడుకల్లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎం ఎల్ సి జీవన్ రెడ్డి, ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్లు బి. ఎస్. లత, రాజా గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

# న్నారుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక దృష్టి

## కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ జర్పుల శివరాం

### కల్వకుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో 'స్వస్త నారి - సశక్త్ పరివార్'



**కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 17 (మనం న్యూస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు 'స్వస్త్ నారి-సశక్త్ పరివార్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి సుపరిండెంట్ డాక్టర్ జర్పుల శివరాం తెలిపారు.బుధవారం కల్వకుర్తి పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో 'స్వస్త్ నారి - సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ జర్పుల శివరాం,డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ భీమానాయక్,లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి చేపడుతామని అన్నారు. డాక్టర్ వసంతదేవి మహిళల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇండోర్లో జూమ్ మీటింగ్ ద్వారా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు.మహిళలు,చిన్నపిల్లల ఆరోగ్యం బలోపేతమైతే కుటుంబం కూడా ఆరోగ్యవంతంగా బలంగా ఉంటుందని ఈ సందర్భంగా వారు సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు యశోదబాయి,శివ,విష్ణు, నర్సింగ్ సూపరింటెండెంట్ శిరోమణి,సునీత,ప్రోగ్రాం ఆఫీసర్ బావండ్ల వెంకటేష్, నర్సింగ్ ఆఫీసర్లు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు నష్టపరిహారం అందించడం నేరమా

## కలెక్టర్ పై చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటు

### రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



**ములుగు, సెప్టెంబర్ 17 మనం ప్రతినిధి:** నకిలీ విత్తనాలతో పంట నష్టపోయిన రైతులకు జిల్లా కలెక్టర్ అండగా నిలిచి నష్టపరిహారం అందించగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలెక్టర్ ను కార్యకర్త అనడం సిగ్గుచేటు అని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ నకిలీ విత్తనాల వల్ల రైతుల పంట నష్టపోగా వారికి నష్టపరిహారం అందించినందుకు జిల్లా కలెక్టర్ ను కేటీఆర్ కార్యకర్త అనడం సిగ్గుచేటని అన్నారు. కేటీఆర్ రైతు పక్షపాత దళారుల పక్షపాతి తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు రైతులకు కట్టబెట్టి రైతుల చావుకు కారణమైన దళారుల నుండి రైతులకు నష్టపరిహారం అందించడం జిల్లా కలెక్టర్ చేసిన తప్పుని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలోని పనిచేసే కలెక్టర్ ను అవమానించినట్లు మాట్లాడుతుంటే కేటీఆర్ స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఇప్పటికైనా కేటీఆర్ తాను చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ కళ్యాణి కిసాన్ అధ్యక్షుడు రాజేందర్ గౌడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భగవాన్ రెడ్డి హిట్స్ అవర్ల వెంకన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాంద్ పాషా, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జీవనశైలి సవాళ్లు ఎదుర్కొనేందుకు పోషకాహారం ప్రధానం: మంత్రి సీతక్క



**ములుగు, సెప్టెంబర్ 17,మనం ప్రతినిధి:** మారుతున్న జీవనశైలి మార్పుల కారణంగా ఎదురయ్యే ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొనేందుకు పోషకాహరం తీసుకోవాలని, ఈనెల 17 నుండి వచ్చే నెల 16 వరకు జిల్లాలో నిర్వహించనున్న పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క సూచించారు. బుదవారం గిరిజన భవన్లో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్కు, పోషణ మాసోత్సవాల ప్రారంభోత్సవం కు ముఖ్య అతిథిగా విచ్చేసి మంత్రి సీతక్క ప్రారంభించిన అనంతరం. మంత్రి సీతక్క మాట్లాడుతూ.... నెలరోజుల పాటు జిల్లాలో విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తూ పోషకాహారం ప్రాధాన్యతను వివరించాలని అన్నారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలు తీసుకోవలసిన ఆహారం, పోషణ పర్యవేక్షణపై గ్రామస్థాయిలో సభలు సమావేశాలు ఏర్పాటు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు, ఎత్తు తూచడం, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పోషకాహారం ప్రాధాన్యత వివరించడం, కిశోర బాలికలకు వైద్య పరీక్షలు వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తల్లిపాల ప్రాధాన్యత, కిచెన్ గార్డెన్ ఏర్పాటు, పరిశుభ్రత పాటించడం, పోషకాహారాల ప్రదర్శన ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని తెలిపారు. విద్య, వైద్య, పంచాయతీరాజ్, డిఆర్డీఓ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శిశు, మహిళా సంక్షేమానికి పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఆంగ్ల మాద్యమంలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, పిల్లలకు అందించే పోషకాహారంలో కాలమాణ పరిస్థితులకు తగినట్లు మార్పులు చేస్తున్నామని తెలిపారు. ఉత్తమమైన ఆహారం ఆవశ్యకత గురించి తెలియజేసేలా ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన ఫీల్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బాణోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పీడీ డీఆర్డీఏ శ్రీనివాస్ రావు, జిల్లా సంక్షేమాధికారి తుల రవి, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, డీపీఆర్ఓ రఫీక్, సీడీపీఓ శిరీష, వివిధ విభాగాల జిల్లా అధికారులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రం దేశవ్యాప్తంగా కీర్తి గాంచింది

## తెలంగాణ వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి

**కామారెడ్డి, సెప్టెంబర్ 17(మనం జిల్లా ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మార్పుల వలన రాష్ట్రం దేశవ్యాప్తంగా కీర్తి గాంచిందని తెలంగాణ వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి హాజరయ్యారు. కామారెడ్డి పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. కలెక్టరేట్లో పోలీసు వందనం స్వీకరించి జాతీయ పతాకావిష్కరణ గావించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నిజాం నిరంకుశ రాజరిక పాలనలో తెలంగాణ ప్రాంత ప్రజలు అనుభవించిన బాధలనుండి తెలంగాణ సాయుధ పోరాటం మరియు ఇతర ప్రజా ఉద్యమాల ద్వారా విముక్తి పొంది, 17 సెప్టెంబర్ 1948లో పోలీస్ చర్య ద్వారా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమై, తెలంగాణ ప్రజలు పొందిన స్వేచ్ఛ స్వాతంత్ర్యం పొందినట్లు గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా అప్పటివరకు పల్లెల్లో నెలకొన్న వెట్టి చాకిరి, భావవ్యక్తీకరణ ఆంక్షలు, మాతృభాష అణచివేత, మతపరమైన నిరంకుశ ధోరణులు తొలగి హైదరాబాద్ సంస్థానం రాచరిక వ్యవస్థనుండి ప్రజాస్వామ్యంలోకి మారిందని తెలిపారు. సుస్థిర ప్రజా పాలనలో సంక్షేమాన్ని పంచుతూ, సర్వమతాలను సమానంగా ఆదరిస్తూ, శాంతి సామరస్యాలకు ప్రత్యేకగా నిలిచిందని తెలిపారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా ఆదర్శవంతమైన పల్లెలు, పట్టణాలతో ఫరిడవిల్లుతున్నదని పేర్కొన్నారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమలకు స్వర్గధామంగా పేరొందిందని తెలిపారు. రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుందన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయాసం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుండి అమలు చేయడం ప్రారంభించిందని



తెలిపారు. వేడుకలకు హాజరైన ప్రజా ప్రతినిధులకు, ఇతర ప్రముఖులకు, జిల్లా అధికారులకు, అతిథులకు ప్రింట్ అండ్ మీడియా సిబ్బందికి, జిల్లా ప్రజలకు, తెలంగాణ సాయుధ పోరాట వీరుల కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులచే నృత్యప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్ నాయక్, కామారెడ్డి ఆర్డిఓ వీణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ మరియు వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో మెగా రక్తదాన శిబిరం విజయవంతం

- ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం
- 96 యూనిట్ల రక్త సేకరణ
- గొప్ప రాజకీయ చతురత కలిగిన మేధావి ప్రధాని నరేంద్ర మోదీ
- రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్
- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు



**కామారెడ్డి టౌన్, సెప్టెంబర్ 17 (మనం న్యూస్) :** కామారెడ్డి జిల్లా కేంద్రంలో జీవనజ్యోతి సేవా సంఘం, కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైనట్లు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్ తెలిపారు. ఈ శిబిరం ద్వారా 96 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్ మాట్లాడుతూ., భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప రాజకీయ చతురత కలిగిన మేధావి భారత ప్రధాని నరేంద్ర మోదీ అని ప్రశంశించారు. ప్రపంచంలో వైద్యరంగం ఎంతగానో అభివృద్ధి చెందినప్పటికీ రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని తెలిపారు. 96 మంది రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. రక్తదానం చేసిన వారి ప్రాణాలను కాపాడాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలనే ఉద్దేశ్యంతో రక్తదాతలకు హెల్మెట్ లను అందించామన్నారు. అదేవిదంగా రక్తదాతలకు కామారెడ్డి రైల్వే ఎస్ఐ సాధు లింబాద్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించినట్లు వారు పేర్కొన్నారు.

రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన కామారెడ్డి ఎమ్మెల్యే₹

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని కామారెడ్డి పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ప్రధానమంత్రి జన్మదినోత్సవం రోజున రక్తదానం చేయడం చాలా సంతోషకరమని, ప్రధాని ఆయురారోగ్యాలతో జీవించాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోరుకున్నారు. ఈ సందర్భంగా ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్ ఎమ్మెల్యే రమణారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు హెల్మెట్ భహూకరించి ప్రశంసా పత్రాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్కె కళాశాల ప్రిన్సిపాల్ అమృత దత్తాద్రి, సాందీపని డిగ్రీ కళాశాల అధ్యాపకులు సురేష్, ప్రభాకర్, బద్దం నిశాంత్ రెడ్డి, జీవన్, వెంకటేష్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సంచార చేపల విక్రయ వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

- అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక ఆదాయాన్ని పొందాలి
- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** సంచార చేపల విక్రయ వాహనాన్ని బుధవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ప్రారంభించారు. కామారెడ్డి జిల్లాలో రెండు వాహనాలు మంజూరు కాగా దోమకొండ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన రంగోల్ స్వప్న, నిజాంసాగర్ మండలానికి చెందిన ఇర్పానా బేగంలకు పది లక్షల విలువగల రెండు వాహనాలు మంజూరు అయ్యాయి. అందులో ఆరు లక్షలు సబ్సిడీ వర్తించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్



ఆశిష్ సాంగ్వాన్ సమాట్లాడుతూ., ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక ఆదాయాన్ని పొందాలని, మంచి రుచికరమైన చేపల వంటకాలను ప్రజలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ఎం.సురేందర్, అడిషనల్ డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఎమ్స్ రాజయ్య, సురేష్, జిల్లా సమైక్య అధ్యక్షులు పుష్పరాణి, మండల సమైక్య అధ్యక్షులు భూలక్ష్మి, అంబర్పేట్ వివో అధ్యక్షులు, కార్యదర్శి, సంఘం సభ్యులు, సిసిలు శ్రీనివాస్, సత్యం, ఫిషరీస్ శాఖ అధికారిణి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడొద్దు... అండగా ఉంటా..!

## కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

**భిక్కనూరు, సెప్టెంబర్ 17(మనం న్యూస్) :** అధైర్య పడొద్దు అండగా ఉంటానని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తెలిపారు. మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ



నాయకులు, భిక్కనూరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బుర్రి గోపాల్ గారి మాతృమూర్తి బుర్రి రాజవ్వ ఇటీవలే మరణించారు. రాజవ్వ దశదినకర్మను బుధవారం బస్వాపూర్ గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ హాజరయ్యారు. రాజవ్వ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆమెతో ఉన్నటువంటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని బాధపడ్డారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు. జరిగిన నష్టాన్ని తీర్చలేము కానీ, ఏ కష్టమొచ్చిన ముందుండి ఆదుకుంటానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ బస్వాపూర్ గ్రామ అధ్యక్షులు అమరవాది సిద్ధరాంరెడ్డి, విండో చైర్మన్ మద్ది స్వామి, నాయకులు బోడపుంటి ప్రకాష్, కర్నాల మల్లేశం, దొరవారి రాజిరెడ్డి, గౌరిగారి రాజిరెడ్డి, చింతనూరి స్వామి, తదితరులు ఉన్నారు.

# రోడ్డు మరమ్మతు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్





**కామారెడ్డి, సెప్టెంబర్ 17( మనం ప్రతినిధి) :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిపోయిన రోడ్లను రోడ్ల పునరుద్ధరణ పనులను కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ బుధవారం పరిశీలించారు. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పిఆర్ రోడ్డు నుండి కామారెడ్డి జిల్లా చుక్కాపూర్ మాచారెడ్డి పిడబ్ల్యుడి రోడ్డు వరకు గల బండ రామేశ్వరంపల్లి రోడ్డు మరమ్మత్తు పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల వలన తేగిపోయిన రోడ్లు మరమ్మత్తు త్వరగా పూర్తి చేయించడానికి, ప్రజల రవాణా కోసం ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందన్నారు.

ఆ నిదులతో చేపట్టిన రోడ్డు మరమ్మత్తు పనులను పూర్తి నాణ్యతతో త్వరగా పూర్తి చేయించవలసిందిగా పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమములో పంచాయతీరాజ్ ఈఈ దుర్గాప్రసాద్, పాల్వంచ తహసిల్దార్ హిమబిందు, మండల అభివృద్ధి అధికారి కే.శ్రీనివాస్, డిప్యూటీ ఈఈ దోమకొండ స్వామి, ఏఈఈ లు సంజయ్, తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

# ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై అన్నీ చెత్త వాదనలు

## కేంద్ర మంతి హర్దీప్ సింగ్ పురి

**ఢిల్లీ,సెప్టెంబర్ 17 :** 20శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ సురక్షితం కాదంటూ గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. బయో ఇంధనాల వల్ల ఆటోమొబైల్ ఇంజిన్లు దెబ్బతింటాయని పలువురు చేస్తున్న ప్రచారాలను కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి కొట్టిపారేశారు. పెట్రోల్లో 20 శాతం ఇథనాల్ కలపడం వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందనేది చెత్త వాదన అన్నారు. ఈ20



ఇంధనం పర్యావరణపరంగా ఉపయోగించడానికి సురక్షితమని పేర్కొన్నారు. అయితే దీర్ఘకాలంలో పాత వాహనాల్లో గ్యాస్కెట్లు, ఇంధన రబ్బరు గొట్టాలు, పైపులను మార్చాల్సి రావచ్చని.. అది సాధారణమైన విషయమేనని పేర్కొన్నారు. పలువురు ఉద్దేశపూర్వకంగానే ఇథనాల్‌తో సమస్యలు వచ్చే అవకాశం ఉందని ప్రజల్లో తప్పుడు భయాలను సృష్టిస్తున్నారని హర్దీప్ సింగ్ పురి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచనాల ప్రకారం.. భారత్‌లో ఇంధన డిమాండ్ రాబోయే రెండు దశాబ్దాలలో ప్రపంచ దేశాల్లో ఉన్న దానికంటే మూడు రెట్లు పెరుగుతుందన్నారు. అటువంటి సమయంలో ఇథనాల్ ప్రధాన ఇంధన వనరుగా మారే అవకాశం ఉందన్నారు. పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్ ఎనర్జీ డెన్సిటీ కొంతమేర తక్కువ ఉండడంతో మైలేజీలో తగ్గుదల ఉన్నప్పటికీ.. అది అతి స్వల్పమేనని ఆ శాఖ వెల్లడించింది. ఇ 20 ఇంధనం పాత వాహనాల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందా..? డ్రైవింగ్‌ను దెబ్బతీస్తుందా..? అని వాహనదారులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఇథనాల్‌ను కలిపిన పెట్రోల్‌ను వినియోగించడం వల్ల మైలేజీ సమస్యలు వస్తాయనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ ఇప్పటికే వివరణాత్మక స్పష్టత ఇచ్చింది. ఇథనాల్ కలిసిన పెట్రోల్‌తో ఎలాంటి ఇంజిన్ సమస్యలు తలెత్తవని వెల్లడించింది. ఇథనాల్ వల్ల కర్బన ఉద్గారాలు తగ్గుతాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని వ్యాఖ్యానించింది. కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సైతం పలుమార్లు ఈ విషయంపై స్పష్టత నిచ్చారు.

# నిజాం పాలనలో ఎన్నో దారుణాలు

- ‘స్వస్థ్ నారీ సశక్త్ పరివార్’ ప్రారంభం: ప్రధాని మోడీ

**ఇండోర్, సెప్టెంబర్ 17 :** నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానంలో అనేక దారుణాలు జరిగాయని ప్రధాని నరేంద్ర మోడీ గుర్తుచేశారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ‘ఈ రోజు సెప్టెంబర్ 17. ఇది మరో చరిత్రాత్మకమైన రోజు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో ధైర్య సాహసాలు చూపించి హైదరాబాద్‌ను దేశంలో విలీనం చేశారు. దీంతో నిజాం అకృత్యాల నుంచి సంస్థానానికి విముక్తి లభించింది. దానికి గుర్తుగా హైదరాబాద్ విమోచన దినం నిర్వహిస్తున్నాం’ అని మోడీ అన్నారు. దేశ ఐక్యత కోసం మన సైనికులు అనేక త్యాగాలు చేశారని కొనియాడారు. అణు ముప్పులకు నవ భారతం భయపడదని మోదీ అన్నారు. ‘‘ఇది నవభారతం. ఎవరికీ భయపడదు. శత్రువుల భూభాగంలోకి వెళ్లి వారిని మన బలగాలు మట్టుపెట్టాయి. అణుబెదిరింపులకు తలొగ్గదు’’ అని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ అణు బెదిరింపులపై మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్‌తో భారత్ గట్టిగా బదులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబంలోని పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు నాడు కథనాలు వచ్చాయి. తాజాగా ఈ విషయాన్ని జైషే కమాండర్ మసూద్ ఇలియాస్ కశ్మీరీ అంగీకరించిన సంగతి తెలిసిందే. భారత్ ఆర్మీ తమ రహస్య స్థావరాల్లోకి ప్రవేశించి ఎలా దాడులు చేసిందనే విషయాలను వెల్లడించాడు. పాకిస్థాన్ బుద్ధిని వారు



బయటపెట్టారంటూ దీనిని ఉద్దేశించి మోడీ వ్యాఖ్యలు చేశారు.

**‘స్వస్థ్ నారీ సశక్త్ పరివార్’ కార్యక్రమం ప్రారంభం..**

పుట్టిన రోజున మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తోన్న ప్రధాని మోడీ.. స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్, రాష్ట్రీయ పోషణ్ మాహ్ కార్యక్రమాలను ప్రారంభించారు. మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మెరుగైన వైద్య సేవల ద్వారా కుటుంబాలను, దేశాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఈ పథకాలను తీసుకొచ్చారు.

# కొంతమందిని జైలుకు పంపండి

- పంట వ్యర్థాల దహనంపై సుప్రీం సీరియస్

**ఢిల్లీ, సెప్టెంబర్ 17 :** దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో ఏటా శీతాకాలంలో వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరుతోన్న విషయం తెలిసిందే. అదే సమయంలో పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగులబెట్టడం దీనికి ఓ కారణమనే వాదనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంట వ్యర్థాల దహనంపై దాఖలైన పిటిషన్లపై తాజాగా మరోసారి విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దీనికి పాల్పడుతున్న కొంతమందిని జైలుకు పంపితేనే మిగతా వారికి గట్టి సందేశం ఇచ్చినట్లవుతుందని వ్యాఖ్యానించింది.

ఈ అంశంపై అమికస్ క్యూరీ అపరాజిత సింగ్ మాట్లాడుతూ.. పంట వ్యర్థాలను తగలబెట్టకుండా ఉండేందుకు రైతులకు సబ్సిడీలు, వివిధ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ఉపగ్రహాలు ఆయా ప్రాంతాల మీదుగా వెళ్లే సమయంలో కాకుండా మిగిలిన సమయాల్లో పంట వ్యర్థాలను కాల్చుకోవచ్చని అధికారులు తమకు చెప్పారనే కథనే రైతులు మళ్లీ మళ్లీ చెప్తున్నారని న్యాయస్థానానికి వెల్లడించారు. దీనిపై ఎన్నిసార్లు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఫలితం లేదని పేర్కొన్నారు.

ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారులు రైతులకు శిక్ష, జరిమానా విధించాలనే కోణంలో ఎందుకు ఆలోచించట్లేదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రైతులు మనకు అన్నం పెడుతున్నారు కాబట్టి వారు ప్రత్యేకమైనవారని.. అలా అని పర్యావరణాన్ని పాడు చేస్తుంటే చూస్తూ ఊరుకోలేం కదా?అని ప్రశ్నించింది. కొంతమందిని జైలుకు పంపితేనే మిగతా వారికి గట్టి సందేశం ఇచ్చినట్లవుతుందని తెలిపింది. పర్యావరణాన్ని కాపాడాలనే నిజమైన ఉద్దేశం మీకు ఉంటే ఇటువంటి చర్యలకు ఎందుకు దూరంగా ఉంటారని అధికారులను ప్రశ్నించింది. కొన్ని రాష్ట్రాల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డుల్లో ఖాళీలు ఉండటంపై న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది.

దేశ రాజధాని ఢిల్లీలో శీతాకాలంలో గాలి నాణ్యత దారుణంగా పడిపోతుంది. దీనికి పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హరియాణాల్లో పంట వ్యర్థాల దహనమే ప్రధాన కారణంగా మారుతోంది. దీనిపై కొంతకాలంగా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది.

# చొరబాటుదారులను కాపాడేందుకే కాంగ్రెస్ ర్యాలీలు : అమిత్ షా

**ఢిల్లీ, సెప్టెంబర్ 17 :** ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ‘ప్రత్యేక సమగ్ర సవరణ’ ప్రక్రియకు బీజేపీ మద్దతిస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా వెల్లడించారు. చొరబాటుదారుల ఓట్లతో గెలవాలని కాంగ్రెస్ చూస్తోందని ఆరోపించారు. ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా ఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంలో స్థానిక ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.



‘‘చొరబాటుదారులను కాపాడేందుకే రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఇటీవల ‘ఓటర్ అధికార్ యాత్ర’ నిర్వహించింది. వారి ఓట్లతో ఎన్నికల్లో గెలవాలని చూస్తోంది. దేశ ఓటర్లను విశ్వసించడం లేదు. హస్తం పార్టీ అసలు స్వరూపాన్ని గుర్తించే సమయం ఆసన్నమైంది. ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ప్రత్యేక సమగ్ర సవరణకు బీజేపీ మద్దతిస్తోంది’’ అని అమిత్ షా పేర్కొన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని అమిత్ షా తెలిపారు. గత 11 ఏళ్లలో 60 కోట్లమంది పేదలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడుల ద్వారా ప్రధాని మోడీ దేశ సరిహద్దుల్లో భద్రతను కాపాడుతున్నారని ప్రశంసించారు. ‘ఆపరేషన్ సిందూర్’తో పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పారన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో 12 మంది మావోయిస్టుల లొంగుబాటు

**నారాయణపూర్, సెప్టెంబర్ 17 :** ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ జిల్లాలో 12 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. వీరిలో తొమ్మిది మంది తలలపై మొత్తంగా రూ.18 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు



వెల్లడించారు. లొంగిపోయిన వారిలో ఐదుగురు మహిళలు ఉన్నారు. ఈ సందర్భంగా వారంతా మావోయిస్టు అగ్రనేతలపై తీవ్ర ఆరోపణలు చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 177 మంది మావోయిస్టులు లొంగిపోయారని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. మరోవైపు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. గట్టా పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారం ఆధారంగా భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న కాల్పుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలంలో భారీ ఎత్తున ఆయుధాలను గుర్తించారు. ఇదిలా ఉంటే ..2026 మార్చి నాటికి మావోయిస్టు రహిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా మరింత ముందుకెళ్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో మావోయిస్టుల ఏరివేత ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో మావోయిస్టు పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. ఆయుధాలను వదిలి సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ పాటించాలని నిర్ణయించినట్లు ప్రకటించింది. భారతదేశంలోని పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాల్లో పాల్గొంటామని పేర్కొంది. ఈ మేరకు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో ఒక ప్రకటన విడుదల చేసింది.



## ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

**చిలుకూరు, సెప్టెంబర్17(మనం న్యూస్):** తెలంగాణ ప్రాంతానికి నిజాం పాలనను నుంచి విముక్తి కలిగిన సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా చిలుకూరు మండలం శీత్లాతండ గ్రామ పంచాయతీ అవరణలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కవిత జెండా ఆవిష్కరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో బాణోతు కృష్ణ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు,నూనవత్ శరత్, ధీరావత శ్రీనుకుమార్, బాధావత వినోద్ బిక్షపతి, గ్రామ పంచాయతి సిబ్బంది దానీయ్య, బాలాజీ,దూప్సింగ్ నాగేశ్వరరావు,ఆశ వర్కర్లు విజయకుమారి, శారద, అంగన్వాడి టీచర్, సుజాత,ప్రమీల ఫీల్ అసిస్టెంట్ తేజవుత్ వాలు గ్రామ నాయకులు,గ్రామపెద్దలు,వివిధ హోదాలో ఉన్న నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

**కోదాడ, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** మండల పరధిలోని అడ్లూరు గ్రామంలో సేవ పక్వాడ మండల కన్వీనర్ భూమా శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోదాడ మండల అధ్యక్షుడు గాదరి పుల్లారావు అధ్యక్షతన తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.. మండల అధ్యక్షుడు పుల్లారావు జాతీయ జెండా ఎగరేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా రాష్ట్ర నాయకులు కనగాల నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, వెలివోలు చిట్టిబాబు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం నియంతృత్వ పాలన నుంచి తెలంగాణకు స్వాతంత్రం వచ్చిన రోజు సెప్టెంబర్ 17 అని సర్దార్ వల్లభాయ్ పటేల్ యొక్క ఘనతను, తెలంగాణ సాయుధ పోరాట వీరులను వారు స్మరించుకొని నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమములో దేవరాశెట్టి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి శెట్టి కిరణ్, కుమార్, లింగారెడ్డి, మండల కార్యదర్శి అనంత దాస్, బూత్ అధ్యక్షులు వెంకటేష్ రెడ్డి, గోవిందరాజు, ఎరగని రాంబాబు, బిజెపి నాయకులు కార్యకర్తలు హాజరైనారు.

# యూరియా అందించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం

- మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్



**నేరేడుచర్ల, సెప్టెంబర్ 17 మనం న్యూస్:** రైతులకు యూరియా అందించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. బుధవారం నేరేడుచర్ల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు దాటిన ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు.ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో యూరియా కొరత స్పష్టంగా కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో 70 శాతం రైతులు వ్యవసాయం చేస్తున్నారని, ఎన్నడూ లేని విధంగా తీవ్రమైన యూరియా కొరతతో,తెల్లవారు జాము నుండి క్యూ లైన్ లో నిలబడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. యూరియా అందక రైతులు పంట నష్టపోతే కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఇబ్బందులు లేకుండా ముందుగానే యూరియా నిల్వలు చేశాడని గుర్తు చేశారు.రైతులకు సకాలంలో యూరియా అందించకపోతే బిఆర్ఎస్ పార్టీ తరపున ఉద్యమాలు పోరాటాలు చేస్తామన్నారు. ఇప్పటికైనా మంత్రులు అధికారులు స్పందించి రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. దేశంలో మావోయిస్టులు ఆయుధాలు వదిలి చర్చలకు వస్తామని పిలుపునిచ్చారన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నక్సలైట్లతో చర్చలు జరిపి,కక్షపూరిత ధోరణి లేకుండా వారి ప్రాణాలు కాపాడాలన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అరిబండి సురేష్ బాబు, పిఎసిఎస్ చైర్మన్ దొండపాటి అప్పిరెడ్డి, చెన్నబోయిన సైదులు, చందమల్ల జయ బాబు, నాగండ్ల శ్రీధర్, ఎల్లబోయిన లింగయ్య,రాపోల్ నవీన్, పోలగాని భరత్ గౌడ్ ,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాని పుట్టినరోజు వేడుకలు

**చిలుకూరు, సెప్టెంబర్ 17 (మనం న్యూస్):** చిలుకూరు మండల కేంద్రంలోభారతీయ జనతా పార్టీ సేవ పఖ్వడ మరియు ప్రధాని జన్మదిన వేడుకలు నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా చిలుకూరు మండల పార్టీ అధ్యక్షులు పారెల్లి మహేష్ అధ్యక్షతన తెలంగాణ విమోచన దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నైజాం కు వ్యతిరేకంగా పోరాడిన విమోచన అమరవీరులను స్మరించుకున్నారు. కార్యక్రమా అతిథిగా జిల్లా పార్టీ నాయకులు చిలుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. విశ్వకర్మ జయంతి మరియు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కూడా నిర్వహించారు ప్రధానమంత్రి జయంతి సందర్భంగా మండల అధ్యక్షులు మహేష్ ప్రధాన కార్యదర్శిలు కొండా శీను, రామినేని నరసింహా వర్మ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తిని శ్రీనివాస్ కేక్ కట్ చేశారు, ఈ కార్యక్రమంలో మండల జడ్పిటిసి ఎన్నికల కన్వీనర్ తిప్పిరిశెట్టి బసవయ్య, ఉపాధ్యక్షులు వన్నాపురం సతీష్, సీనియర్ నాయకులు కట్టెకోల వెంకన్న, కోడారు రాము, మునుగంటి నాగచారి, సోషల్ మీడియా కన్వీనర్ బుడిగ వీరబాబు, మండల పార్టీ నాయకులు బుడిగ సురేష్, కందరబోయిన సైదులు, మేకపోతుల నవీన్, ఆతుకూరి కోటేష్ తదితరులు పాల్గొన్నారు



## భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి వేడుకలు

**నేరేడుచర్ల సెప్టెంబర్ 17 మనం న్యూస్:** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో కొలువై ఉన్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విశ్వకర్మ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు.అనంతరం విశ్వకర్మజెండానునేరేడుచర్ల మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దేవులపల్లి జనార్ధన చారి ఆవిష్కరించారు . వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి అందరూ బాగుండాలని స్వామిని కోరుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మంగారి యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెమోజుశ్రీరామ దంపతులు విశ్వబ్రాహ్మణ సంఘం పండితుడు పుల్లాచారి నిర్వహించారు.విశ్వబ్రాహ్మణ సంఘం మండల ప్రధాన కార్యదర్శి వజ్రాల లింగాచారి కోశాధికారి మాడూరికృష్ణయ్య కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షులు దేవులపల్లి శంకరాచారి మాజీ సర్పంచ్ ఆకార వెంకటేశ్వర్లు, ఉద్దోజు పోతులురాచారి,తునికి పాటి జగన్నాథ చారి,తంగేళ్లపల్లి మట్టాచారి ఉద్దోజ శ్రీనివాస్ చారి, సురోజు వెంకటేశ్వర్లు,లంకలపల్లి శంకరాచారి ,శిలో జు సురేంద్ర చారి,పాలోజు పవన్, రామాచారి,సురోజు రామాచారి, కటిక వెంకన్న, మడూరి సతీష్, ఉరిమిల్ల రామ్మూర్తి, శిలోజు నాగాచారి, శిరసనగండ్ల సతీష్ సతీష్, శ్రీ పాదపు శ్రీనివాస్ చారి, నాగచారి, వెంకటాచారి,నాగరాజు, సతీష్ ,శ్రీనివాస్ చారి కన్నె కంటి మహేష్, కార్పెంటర్ యూనియన్ నాయకులు, స్వర్ణకార సంఘం నాయకులు, విశ్వబ్రాహ్మణ సంఘం మహిళలు, విశ్వకర్మ జయంతి ఉత్సవాలలో పాల్గొన్నారు.



## బస్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి

**జాజిరెడ్డిగూడెం సెప్టెంబర్ 17 (మనం న్యూస్):** బస్ సర్వీసులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ శివప్రసాద్ అన్నారు. మహబూబాబాద్ టు ఎంజీబీఎస్ (హైదరాబాద్) డీలక్స్ బస్సు సర్వీస్ లను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ డిపో నుంచి ఆర్టీసీ డీలక్స్ బస్సు ప్రతిరోజు ఉదయం 4. 15 నిమిషాలకు బయలుదేరి మరిపెడ బంగ్లా తానంచెర్ల నూతనకల్ తుంగతుర్తి మీదుగా అర్వపల్లికి ఉదయం 7గంటలకు చేరుకుంటుందన్నారు. ఇక్కడ నుండి జాజిరెడ్డిగూడెం, వంగమర్తి, నకిరేకల్ మీదుగా ఉదయం 10గంటలకు ఎంజీబీఎస్ కు చేరుకుంటుందని తిరిగి అక్కడ నుంచి ఉదయం 11 గంటలకు బయలుదేరి మళ్ళీ అదే రూట్లో అర్వపల్లికి మధ్యాహ్నం 1:30 వరకు, మహబూబాబాద్ కు సాయంత్రం 4:30 వరకు చేరుకుంటుందని తెలిపారు.



## 23న లేబర్ కార్యాలయం ముందు జరిగే ధర్నా

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం రాంబాబు

**తిరుమలగిరి సెప్టెంబర్ 17 మనం న్యూస్:** తిరుమలగిరి మండల భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం పాక మహేష్ అధ్యక్షతన తిరుమలగిరి లో బుధవారం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం. రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమ నిధుల నుండి రూ.346.36 కోట్లను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు దారి మళ్లించడం అన్యాయమని ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తోందని విమర్శించారు. వెల్ఫేర్ బోర్డు నిధులను తిరిగి బోర్డులో జమ చేసి, కార్మికులకు నేరుగా సంక్షేమ పథకాలను వెల్ఫేర్ బోర్డు ద్వారానే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించాలని ఇందులో భాగంగా ఈ నెల 23న జిల్లా లేబర్ కార్యాలయాల ముందు ధర్నా విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమావేశంలో మండల కన్వీనర్ గా కొండబోయిన లింగయ్య, సభ్యులుగా ఏనుగుల గణేష్, పాక మహేష్, ఇట్టిపోయిన నాగరాజు కొమరమల్లు లింగయ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చిన్న నాగరాజు, కడారి రవి, కొమరయ్య వీరమల్లు మంజుల, పద్మ, యామ గాని సురేష్, రేగుల మహేందర్, ఇట్ట బోయిన నాగరాజు, పాక మహేష్ పైయంల సురేష్, చిన బోయిన లింగయ్య,వెంకన్న మల్లయ్య, సులోచన, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



## మండలంలో యూరియా కొరత లేదు

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి

**పెన్ పహాడ్, సెప్టెంబర్ 17 (మనం న్యూస్):**మండలంలో యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి జి. శ్రీధర్ రెడ్డి అన్నారు బుధవారం మండల కేంద్రంలోని చీదెళ్ళ పిఎసిఎస్ కేంద్రాన్నిమండల వ్యవసాయ అధికారి బి. అనిల్ కుమార్ తో కలిసి సందర్శించి యూరియా పంపిణీని పరిశీలించి ఆయన మాట్లాడుతూ సెంటర్ లో యూరియా 444 బస్తాలు అందుబాటులో ఉన్నదని, సాయంత్రం లోగా అనంతారం సొసైటీకి 444 బస్తాల లోడు వస్తుందని,నేడు మరో 444 బస్తాల యూరియా పిఎసిఎస్ చీదెళ్ళ కేంద్రంలో అందుబాటులో ఉంటుందని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు రెండవ విడత యూరియాకు బదులు నానో(ద్రవరూప) యూరియా ఎకరానికి అర లీటరు చొప్పున పిచికారి చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఎస్త్ర కాస్తాల గోపికృష్ణ,ఏఈఓ లు మురళి, ప్రణయ్, వికాస్, రాకేష్, సీఈవో సోమ్లానాయక్ పిఏసిఎస్ సిబ్బంది లక్ష్మణ్, సైదులు, పోలీస్ సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.



## శ్రీరామ జన్మ నక్షత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు

**నేరేడుచర్ల, సెప్టెంబర్ 17 (మనంన్యూస్):** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాల యంలో శ్రీరామ జన్మ నక్షత్రం పునర్వసు నక్షత్రం సందర్భంగా బుధవారము అత్యంత భక్తి శ్రద్ధలతో పంచామృతాభిషేకాల తో, ఆలయ పూజారి బృందావనం శ్రీరామ నరసింహ తేజ ఆధ్వర్యంలో ఆలయం మండపంలో ఉత్సాహ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి విశ్వక్సెన పూజ, పుణ్యాహవాచనము, అర్చన, పంచామృతా భిషేకాలు అత్యంత వైభవంగా వేదమంత్రాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి భజనలు చేస్తూ భక్తులు వేడుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు, ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణ రెడ్డి, తాటికొండ వెంకటరెడ్డి, మాశెట్టి సైదయ్య, చిత్తనూరి సత్యనారాయణ, కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్, రవీందర్ రెడ్డి, మన్నెంగురువయ్య, కొణతం చిన్న సీతారామరెడ్డి, తాటికొండ శ్రీరామ్ రెడ్డి,తాటికొండ నర్సిరెడ్డి, తాటికొండ సత్యనారాయణ రెడ్డి మాశెట్టి మోహన్ విశాలక్ష్మీ దంపతులు, కుంకు చిన్నయ్య, గోల్ల సుధాకర్, జెట్టి వెంకన్న, కొణతంచిన్న లచ్చిరెడ్డి, పొల గాని భరత్ గౌడ్, నూకల వెంకట్ రెడ్డి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు



**పాలకీడు సెప్టెంబర్ 17 (మనం న్యూస్)** మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయం నందు పాలకీడు మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు రమావత్ నరినాయక్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశంలోనే విశ్వ గురువుగా పేరు ప్రఖ్యాతి గాంచిన నాయకుడని, అగ్రరాజ్యాలే మోడీకి రెడ్ కార్పెట్ పరిచి పిలిపించుకొని మన భారతదేశ యొక్క ప్రాముఖ్యతను మొట్టమొదటి స్థానంలో నిలవాలని, అనేక సంక్షేమ పథకాలు పేదల బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేస్తున్న కృషి వల్ల ఈరోజు భారతదేశం ప్రపంచ దేశాలలో మూడో స్థానంలో అడిగిపెట్టబోతుంది ఇంకా మన జిడిపి వృద్ధి విషయంలో దేశభద్రత విషయంలో మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆపరేషన్ సింధూర లాంటి కార్యక్రమం చేపడితే అగ్రరాజ్యాలకి వణుకు పుట్టించే విధంగా ఆపరేషన్ సింధూరిని విజయవంత చేయడం , ఉగ్రవాదుల్ని అణిచివేసే విషయంలో ప్రధానమంత్రి అన్ని దేశాల మద్దతు ఇవ్వడం జరిగింది. ఇలాంటి అనేక కార్యక్రమాలు చేస్తున్నటువంటి మన మోడీకి మనందరం అండగా ఉండాలని కోరుకుంటూ ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా నాయకులు బాల వెంకటేశ్వర్లు ,మండల ఎంపీటీసీ ఇన్చార్జి పార్థమైన విజయకుమార్ ,గుండ్రెడ్డి విజయభాస్కర్ రెడ్డి ,కొత్తూరు వెంకటేశ్వర్లు, పొదిలి వెంకన్న, సైదులు, లక్ష్మణ్ నాయక్ ,నాగేశ్వరరావు నాయక్ ,నాగరాజు ,శ్రీను, విద్యాసాగర్ ,గోపాల్, వెంకటేష్ నాయక్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలనలో జాతీయ జెండా ఆవిష్కరణ

త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన తాసిల్దార్ సురిగి సైదులు గౌడ్

**నేరేడుచర్ల సెప్టెంబర్ 17 మనం న్యూస్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలన దినోత్సవం ను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా జరుపుకుంటుంది. రాష్ట్ర ప్రజలకు మరింత సమర్థవంతమైన పారదర్శకమైన పాలను అందించాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నేరేడుచర్ల తాసిల్దార్ సురిగి సైదులు గౌడ్ బుధవారం తెలిపారు. అనంతరం నేరేడుచర్ల తహసిల్దార్ కార్యాలయం నందు మహాత్మా గాంధీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి భారత జాతీయ పథకాన్ని తహసిల్దార్ సురిగి సైదులు గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ బెల్లంకొండ విజయలక్ష్మి నరసింహారావు మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల సందీప్ రెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, నూకల సుగుణమ్మ, బాల వెంకటేశ్వర్లు, సంకలమద్ది సత్యనారాయణ రెడ్డి, ధూళిపాల ధనుంజయ నాయుడు,కొనతం నాగిరెడ్డి, జంగిలి వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది చంద్రకళ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులు త్యాగఫలమే నిజాం రజాకార్ల నుంచి విముక్తి



**తిరుమలగిరి, సెప్టెంబర్ 17 (మనం న్యూస్ ):** కమ్యూనిస్టుల త్యాగపలమే నిజాం రజాకార్ల నుండి ప్రజలకు విముక్తి జరిగిందని తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేత్కర్ పూలే చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో తమ ప్రాణాలను అర్పించి దున్నేవాడికి భూమి గీసేవాడికి సెట్టు సాధించారని సాయుధపోరాటంలో బిమిరెడ్డి నరసింహారెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి ల నాయకత్వంలో అనేక పోరాటాలు జరిగాయని వాటి నాయకత్వంలో చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, షేక్ బందగీ, మల్లు స్వరాజ్యం, పోరెల్లదాసు, బొడ్డు గంగులు, ఎల్లప్పు లు పని చేశారని పోరాటంలో దొడ్డికొమరయ్య, షేక్ నందగి, బండి యాదగిరి, లాంటి యోధులు ప్రాణాలు కోల్పోయారని వారి స్ఫూర్తిని తీసుకొని నేటి యువత బహుజన తెలంగాణ సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడెం లింగయ్య, చేను శ్రీను, రజక సంఘం నాయకులు సోమయ్య, బిక్షం, పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం



**కోదాడ, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోదాడ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం (బాబు) పాల్గొని తెలంగాణ ఆవిర్భావం గురించి మాట్లాడుతూ ప్రజా పాలన తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన ఒక కార్యక్రమం. ప్రజా పాలన అంటే ప్రజల ఇంటి వద్దకే వెళ్లి ప్రభుత్వ సేవలను అందించడం. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమం, దీని ద్వారా ప్రజలు ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకోవచ్చు అని అన్నారు. ప్రజా పాలన అనేది తెలంగాణలో భారత జాతీయ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన ఒక పథకం. ప్రజల వద్దకే ప్రభుత్వం: ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజల వద్దకే వెళ్లి వారి అవసరాలను తెలుసుకుని, ప్రభుత్వ సేవలు అందించేలా రూపొందించబడిందని అన్నారు. ప్రజలు ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు ఫారాలను సమర్పించవచ్చు. ఈ ఫారాల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి, అర్హులైన వారికి సేవలను అందిస్తారు. 2023 డిసెంబర్ 28న ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు అన్నారు. ఇట్టి కార్యక్రమంలో కమిషనర్ రమాదేవి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు పెండం వెంకటేశ్వర్లు, గంధం యాదగిరి, ఖాజా గౌడ్, షాబుద్దీన్, తిప్పిరిశెట్టి రాజు, కట్టబోయిన శ్రీనివాస్ యాదవ్, కర్రి సుబ్బారావు, పాశం శ్రీను, యేసయ్య, బాగ్దాద్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఐడీఓసీ నిర్మాణ పనులల్లో వేగం పెంచాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

**ములుగు,సెప్టెంబర్ 17,మనం ప్రతినిధి:** ఐడిఓసి నిర్మాణ పనులల్లో వేగం పెంచి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల ప్రక్కన నూతనంగా నిర్మిస్తున్న సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం (కలెక్టరేట్ కాంప్లెక్స్) నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతన కలెక్టరేట్ భవనం ను కలియ తిరుగుతూ స్టేట్ బోర్డు ఛాంబర్, కలెక్టర్ ఛాంబర్, సమావేశ మందిరం, వీడియో కాన్ఫరెన్స్ హాలు, ఇతర శాఖల అధికారులకు కేటాయించే గదులను పరిశీలించారు. ఈ ఈ ఆర్ అండ్ బి కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యత లోపించకుండా గ్రానైట్, ఎలక్ట్రిషన్, ప్లంబింగ్ మ్యాన్ పవర్ ను పెంచి త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు. ఎంట్రన్స్ వద్ద రెడ్ సెల్ తో రోలింగ్ చేయించి సుందరీకరణ పనులు చేయాలని చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఈ ఈ ఆర్ అండ్ బి శ్యామ్ సింగ్ సంబంధిత శాఖ అధికారులు, గుత్తేదారులు పాల్గొన్నారు.

### మహిళల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి

## స్వస్తినారి స్వసక్తి పరివార్ అభియాన్‌లో మంత్రి ధనసరి సీతక్క

**ములుగు, సెప్టెంబర్ 17, మనం ప్రతినిధి:** మహిళల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించేందుకు స్వస్తినారి స్వసక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం అమలు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ప్రధాన ఆసుపత్రి ఆవరణంలో స్వస్తినారి స్వసక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., గ్రంథాలయ సంస్థ చైర్మన్ బాణోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి ల తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబము, గ్రామము రాష్ట్రము, దేశం సౌభాగ్యంగా ఉంటుందని, నిపుణుల వైద్య బృందాలతో గ్రామాలలోకి వస్తున్న ఉచిత వైద్య శిబిరాలలో మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని , వైద్య పరీక్షలతో పాటు అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ



సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్లోబలైజేషన్లో అలవాట్లలో మార్పుల వల్ల మనుషుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుందని దీనిని నివారించడానికి పోషకాహార ప్రాముఖ్యతను ప్రజలలోకి తీసుకుపోవాలని వైద్య సిబ్బందిని కోరారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు మాట్లాడుతూ నిపుణులైన డాక్టర్లతో ప్రతి మండలంలో ఐదు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని దానితోపాటు అన్ని ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్లలో వైద్య శిబిరాలను ఈ నెల 17వ తారీఖు నుండి అక్టోబర్ రెండవ తారీకు వరకు జిల్లా మొత్తం 65 క్యాంపు లతో స్వస్తినారి స్వశక్తి పరివార అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ముందస్తుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను సిబ్బందికి అవగాహన కల్పించామని తెలిపారు. ఈ వైద్య శిబిరాలలో గుండెపోటు, మధుమేహము, థైరాయిడ్, దీర్ఘకాలిక కిడ్నీ సంబంధిత వ్యాధులు కంటి చర్మ సమస్యలు, గర్భిణీ స్త్రీల సమస్యలు వ్యాధి నిరోధక టీకాలు, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వస్తినారి స్వశక్తి పరివార అభియాన్ ఉచిత వైద్య శిబిరాలకు గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి నుండి నిపుణులైన గైనకాలజిస్ట్ సైక్రియాసిస్ట్ ఈ ఎన్ టి జనరల్ మెడిసిన్ డెర్మటాలజిస్ట్ డెంటల్ వైద్య నిపుణులను పంపిస్తున్నామని వైద్య ఆరోగ్య శిబిరాలలో వైద్య పరీక్షలతో పాటు ఎవరైతే మహిళలకు శస్త్ర చికిత్సలు పడతాయో, వారిని రెఫర్ చేసి ప్రధాని ఆసుపత్రి ములుగు లో శస్త్ర చికిత్సలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణ కుమారి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ జగదీశ్వర్, ప్రధాన ఆసుపత్రి వైద్య నిపుణులు, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రణధీర్ డెమో సంపత్, డాక్టర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాయినిగూడెం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ కాలేజ్ విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**రాయపర్తి, సెప్టెంబర్ 17(మనం న్యూస్):** భారతీయ జనతాపార్టీ ( బీజేపీ) ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు నూనె అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని స్థానిక బస్టాండ్ సెంటర్లో వద్ద ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు రాష్ట్ర నాయకులు కర్ర శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు వారు మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినం అని, నిజాం రజాకార్ల నిరంకుశ పాలన అంతమై తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన రోజు అని, పాలకుర్తి నియోజకవర్గంలో దయాకర్ రావు దొర పాలన అంతమై దాదాపు రెండేళ్లు దగ్గరికొచ్చిందని కానీ పాలకుర్తి నియోజకవర్గంలో దొరల పాలన పోయి దొరసాని పాలన వచ్చిందని, నియోజకవర్గ ప్రజలకు ఇంకా స్వేచ్ఛ లభించలేదని,ఇంకా భానిస బ్రతుకు పోలేదని, పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఈదొర దొరసాని పాలన నుండి విముక్తి కల్పించేందుకు బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదానం చేసిన



వారిని అభినందించారు. ప్రధాని నరేంద్ర మోడీ జీవితం అందరికీ ఆదర్శప్రాయం అని కొనియాడారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ పురోగతి సాధిస్తోంది అని, నరేంద్ర మోడీ నాయకత్వమే ఈ దేశానికి శ్రీరామరక్ష అని తెలిపారు.కరోనా విపత్తు వేళా ప్రపంచం మొత్తం అతలాకుతలం అయితే ప్రపంచం మొత్తం కరోనా నివారణ మందులు అందించి భారత్ ను విశ్వ గురువు స్థానం లో నిలిపారు అని కొనియాడారు.మోడీ జన్మదినం సెప్టెంబర్ 17నుండి గాంధీ జయంతి అక్టోబర్ 2 వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు . ఈకార్యక్రమంలో బీజేపి పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ జిల్లా కౌన్సిల్ నెంబర్ వడ్లకొండ రవి బిజెపి జిల్లా నాయకులు గడ్డం నరేందర్ కనిగంటి కృష్ణారెడ్డి శ్రీరాముల మురళి మనోహర్ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎనగందుల శ్రావణ్ యువ మోర్చా ప్రధాన కార్యదర్శి రాపాక ప్రశాంత్ మండల ప్రధాన కార్యదర్శులు నిమ్మల అనిల్ మందపురి రాజు మండల మాజీ ప్రధాన కార్యదర్శి బూరుగు నవీన్ జిల్లా అధికార ప్రతినిధి యువమోర్చా పెండ్యాల గణేష్ మండల ఉపాధ్యక్షులు గోరంట్ల ప్రభాకర్ మునవతభద్రు చిర నాగరాజు మండల కార్యదర్శి చిర్ర శరత్ కొంగ అశోక్ బిజెపి మండల నాయకులు వాసం ప్రశాంత్ సోడియ సురేష్ నేతావత్ నరేష్ యువ మోర్చా మండల అధ్యక్షులు మంచాల సుమన్ యాదవ్ యువ మోర్చా కార్యకర్తలు జక్కుల సందీప్ యాదవ్ రసాల రాకేష్ ముత్యాల అనిల్ భాషా బోయిన దామోదర్ రాకేష్ సిద్దు అజయ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు



## అన్నదాతకు అండగా నిలుస్తున్న ముల్కనూర్ సొసైటీ

- రేపు 69వ వార్షిక మహాసభ

**భీమదేవరపల్లి,సెప్టెంబర్ 17 మనం న్యూస్:** మెట్టప్రాంతం కరువు నేలలో సాగునీరు, తాగునీరు లేక రైతన్నలు కష్టాల్లో అల్లాడిన రోజులు ఉన్నాయి. వర్షాభావం వల్ల పంటలు పండక రైతులు వలసలు వెళ్లిన పరిస్థితులు ఏర్పడ్డాయి. బావులు, భూములు ఎండిపోవడంతో బీళ్లు పెరిగిన ఆ కఠిన కాలంలో మండలం లోని ముల్కనూర్ లో రైతుల కోసం సహకారోద్యమం పుట్టుకొచ్చింది.1956లో దివంగత కాశీ విశ్వనాథరెడ్డి రైతులతో కలిసి 'ముల్కనూరు సహకార గ్రామీణ బ్యాంకు'ను స్థాపించారు. 373 మందితో, ఒక్క ఉద్యోగితో, రూ.100 వాటా ధనంతో ప్రారంభమైన ఈ సంస్థ నేడు 7,641 మంది సభ్యులతో, 132 మంది ఉద్యోగులతో, రూ.40 కోట్ల స్థిరాస్తులతో లాభాల బాటన పయనిస్తోంది. గతంలో ఈ బ్యాంకుకు దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఉపాధ్యక్షుడిగా పనిచేసిన విషయం విశేషం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఈ సంస్థ ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘంగా మారింది. ప్రతి ఏడాది రైతుల కోసం కొత్త సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంలో సంఘం అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ముందుంటున్నారు. సీనియర్ సభ్యులకు పెన్షన్ సౌకర్యం కల్పించడం, గృహ, విద్య, వైద్య రుణాలు అందించడం వంటి పథకాల ద్వారా రైతన్నలకు అండగా నిలుస్తోంది.రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతూ, సహకారోద్యమానికి ఆదర్శంగా నిలుస్తున్న ముల్కనూరు సొసైటీ 69వ వార్షిక మహాసభ శుక్రవారం సంఘం పారబైల్ రైస్ మిల్లు ఆవరణంలో ఘనంగా జరగనుంది.



## పోలీస్ కమిషనరేట్‌లో ప్రజా పాలన దినోత్సవం

**హనుమకొండ, సెప్టెంబర్ 17 (మనంప్రతినిధి):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం -2025 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కమిషనరేట్ పరిపాలన భవనం ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీలు రవి,ప్రభాకర్ రావు, సురేష్ కుమార్ తో పాటు, ఏసీపీలు ఆర్. ఐలు, ఇన్స్పెక్టర్లు, ఎస్. ఐలు ఇతర పోలీస్ విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.



### పర్వతగిరి మండలంలో

## ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

**పర్వతగిరి, సెప్టెంబర్ 17, ( మనం న్యూస్ ):** ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ , తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ టి. వెంకటస్వామి, జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఎప్పుడు గుర్తుండిపోయే రోజు ఏళ్ల తరబడి నిజాం పాలనలో ఉన్న తెలంగాణ నిరంకుశత్వాన్ని తెంచుకొని ప్రజాస్వామ్యంలో కలిసిన రోజు అని అన్నారు. తహసీల్దార్ టి. వెంకటస్వామి మాట్లాడుతూ నేడు ఈ స్వేచ్ఛ, స్వాతంత్యం, ప్రజాస్వామ్యం మన సొంతం కావడానికి ఎంతో మంది ఈ గడ్డ మీద అసమాన త్యాగాలు చేశారు. ఆనాటి త్యాగాల ఫలితమే నేటి తెలంగాణా అభివృద్ధికి నాంది పలికింది. దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబరాల్లో కేరింతలు వేస్తుంటే హైదరాబాద్ సంస్థాన ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యానికై పోరాడుతూనే ఉన్నారన్నారు. నాటి హైదరాబాదు సంస్థానం 16 జిల్లాలతో తెలుగు, మరాఠీ, కన్నడ భాషల మిశ్రమ సంస్కృతులతో కూడిన సంస్థానంగా ఉండేది. హైదరాబాద్ సంస్థానం స్వతంత్రంగా ఉంటుంది అని నైజాం రాజు ప్రకటించి రాచరిక పాలనను కొనసాగించారని వెల్లడించారు .



## వాటర్ షెడ్డును సందర్శించిన నాబార్డ్ అధికారులు

**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 17 మనం న్యూస్:** నాబార్డ్ తెలంగాణ రీజినల్ ఆఫీస్ డిప్యూటి జనరల్ మేనేజర్ శ్రీకాంత్ జాంబ్రే హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముస్తఫాపూర్ గ్రామం లోని వాటర్ షెడ్డును బుధవారం సందర్శించారు. ఎ.కె. విశ్వనాథ రెడ్డి గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాబార్డ్ సహకారంతో అమలు చేస్తున్న ఈ పథకంలో నీటి సంరక్షణ, భూసార యాజమాన్యం, పందిరి కూరగాయలు, సోలార్ కంచె, బయోగ్యాస్, మొక్కల పెంపకం వంటి పలు కార్యక్రమాలు కొనసాగుతు న్నాయన్నారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సహకార సంఘానికి చేప పిల్లల కోసం చెక్కును అందజేశారు.కార్యక్రమంలో నాబార్డ్ వరంగల్ క్లస్టర్ డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ యల్. చంద్రశేఖర్, ఏ.జి.ఎం. హనుమకొండ చైతన్య, రవి తంగ, వాటర్ షెడ్డుకమిటీ సభ్యులు, ముస్తఫాపూర్ మత్స్యకారుల సంఘ సభ్యులు, ఏ.కె.వి.ఆర్.ఆర్.డి.యస్ ప్రతినిధి దేవేందర్ పాల్గొన్నారు.

## మీరు విలీనం చేసుకున్న ఎమ్మెల్యేలపై ఎందుకు మాట్లాడరు

- కాళేశ్వరం అవినీతిపై మాట్లాడనివారు కడియం గురించి మాట్లాడుతున్నారు
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హనుమకొండ, సెప్టెంబర్ 17(మనంప్రతినిధి):** బీఆర్ఎస్ నేతల తీరు సిగ్గుచేటు,కాళేశ్వరం అవినీతి పై మాట్లాడని బీఆర్ఎస్ నాయకులు కడియం శ్రీహరి పార్టీ మార్పు గురించి మాట్లాడుతున్నారని, కాళేశ్వరం అవినీతిపై ఇప్పటికీ వారు ప్రజలకు సమాధానం చెప్పలేదని కాంగ్రెస్ పార్టీ హన్మకొండ జిల్లా అధ్యక్షులు,శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ,వరంగల్ ఎంపీ కడియం కావ్య, పరకాల,వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి,కే ఆర్ నాగరాజు తో కలిసి మీడియాతో మాట్లాడారు. నాడు బీఆర్ఎస్ లో విలీనం చేసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరుపై బీఆర్ఎస్ నేతలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనే ఆకాంక్షతో కొందరు కాంగ్రెస్ తో కలిసి నడుస్తున్నారన్నారు. తమ హయాంలో కట్టిన ఏళ్లనాటి ప్రాజెక్టులు చెక్కుచెదరలేదన్నారుఆరు గ్యారెంటీల అమలు కోసం తాము కృషి చేస్తుంటే మీరు ఉనికి కోసం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రజల అటెన్షన్ డైవర్ట్ చేయడంలో బీఆర్ఎస్ నేతలు ఘనులన్నారు. నాడు డిప్యూటీ సీఎంగా ఉన్న డాక్టర్ రాజయ్యని పక్కనపెట్టి కడియం కి టికెట్ ఎందుకు ఇచ్చారో చెప్పాలన్నారు. రాజయ్య కి టికెట్ ఇవ్వకపోతే మాట్లాడని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కడం సిగ్గుచేటన్నారు. కడియం శ్రీహరి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజవర్గ అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేనంతగా నిధులు మంజూరు చేయించుకుని అభివృద్ధి చేపట్టారన్నారు. ఎన్నికలు వచ్చినా,రాకపోయినా ప్రజల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు నిత్యం శ్రమిస్తున్నారన్నారు. అధికారం కోల్పోయిన తరువాత బీఆర్ఎస్ నేతలు సత్య హరిచంద్రుల్లా మాట్లాడటం సిగ్గుచేటని పరకాల ఎమ్మెల్యే రేవురి ప్రకాష్ రెడ్డి అన్నారు. ప్రజా క్షేత్రంలో ప్రతిపక్షం కూడా ఉండాలని ప్రజలు ఎన్నుకుంటే నాటి కేసీఆర్ కనీసం ప్రతిపక్ష హోదా లేకుండా చేశారన్నారు.
దళిత నాయకుడు ప్రతిపక్ష నేతగా ఉంటే ఓర్వలేని కుసంస్కారి కేసీఆర్ అని అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పై విశ్వాసం లేదు అంటున్న మీరు దమ్ముంటే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు రాజీనామా చేయించి ఎన్నికల్లో గెలవాలన్నారు. తమ ప్రభుత్వంపై ప్రత్యక్షంగా పోరాడటం చేత గాక బీజేపీ పార్టీతో లోపాయికారి ఒప్పందం చేసుకున్న మీరు విమర్శించి దిగజారవద్దన్నారు. బీఆర్ఎస్ నేతలకు దమ్ము ఉంటే మీ పార్టీ నాయకురాలు కవిత అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పాలని ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు అన్నారు. తెలంగాణ విద్యార్థుల బలిదానాల మీద పదవులు పొందిన నేతలు ఇప్పుడు మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. ప్రజలు పక్కన పెట్టినా కూడా సిగ్గులేకుండా ఇంకా అధికార మోహం కోసం తిప్పలు పడుతున్నారన్నారు. మూతి మీద మీసం లేని మీరు సీఎం రేవంత్ రెడ్డి మొగతనం గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ప్రజలంతా గమనించాలని, సొంత పార్టీలో సమవుజ్జి లేని వీళ్ళు మన ప్రభుత్వ పాలనపై విమర్శలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టేనని అన్నారు. నాడు పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడిన మాటలు ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ,గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి. అజీజ్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెరుమాండ్ల రామక్రిష్ణ, పి. వెంకట్రామ్ రెడ్డి,లక్ష్మారెడ్డి,టి.విద్యాసాగర్,వెంకట్, రహీమున్నీసా, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

- ఊరురా వాడ వాడల్లో ఎగిరినా జాతీయ జెండా

**రాయపర్తి సెప్టెంబర్ 17(మనం న్యూస్):** రాయపర్తి మండల కేంద్రం తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ఘనంగా జాతీయ జండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయపర్తి మండల కేంద్రంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ శ్రీనివాస్ జండా వందనం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలంగాణలో జరిగిన అభివృద్ధి పై పలువురు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధిలో దూసుకుపోతున్నదని అన్నారు. గతంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోని తెలంగాణ ప్రజలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందుకుంటున్నారని అన్నారు. రాబోయే కాలంలో తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. అన్ని రంగాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్ , ఎంపీడీవో కిషన్ ఎంపీఓ కుచన ప్రకాష్ డిటి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ ఐ చంద్రమోహన్, కార్యాలయ సిబ్బంది వివిధ శాఖల అధికారులు మాజీ ప్రజాప్రతినిధులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

**ములుగు,సెప్టెంబర్ 17,మనం ప్రతినిధి:** బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణం లో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించి, జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం మంత్రి అసెట్స్ డిస్ట్రిబ్యూషన్ చేశారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. శబరిష్, ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఆర్డీఓ వెంకటేష్, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొన్నారు.



మనం
12 SPORTS
స్పోర్ట్స్
హైదరాబాద్ - గురువారం 18 సెప్టెంబర్ 2025



## ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్..
# ఫైనల్‌లో నీరజ్ చోప్రా




భారత జావెలిన్ సూపర్ స్టార్ నీరజ్ చోప్రా ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ )లో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్లో తొలి ప్రయత్నంలోనే 84.85 మీటర్ల త్రోతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఆటోమేటిక్ క్వాలిఫయింగ్ మార్కు 84.50 మీటర్లు. దీంతో నీరజ్‌కు మళ్లీ త్రో విసిరే అవసరం రాలేదు. పోలండ్ అథ్లెట్ డేవిడ్ వెంగెర్ తొలి రెండు ప్రయత్నాల్లో (79.72 మీ, 73.97 మీ)తో వెనకబడ్డాడు. కానీ, ఇతను మూడో ప్రయత్నంలో 85.67 మీటర్లు విసిరి ఫైనల్కు అర్హత సాధించాడు. జర్మన్ అథ్లెట్ జులియన్ వెబర్ తొలి ప్రయత్నంలో (82.29 మీ) విసరగా.. రెండో ప్రయత్నంలో (87.21 మీ) త్రోతో ఫైనల్‌కు క్వాలిఫై అయ్యాడు. గురువారం ఫైనల్ జరగనుంది.




# వరల్డ్ నెంబర్ వన్ బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి

టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కెరియర్లో తొలిసారిగా కెరియర్లో ఉత్తమ ర్యాంక్ సాధించాడు. ఐసీసీ బెస్ట్ నెంబర్ వన్‌గా బౌలర్‌గా నిలిచాడు. ఐసీసీ బుధవారం టీ20 ర్యాంకింగ్సును విడుదల చేసింది. ఈ ఘనత సాధించిన మూడో భారతీయుడిగా నిలిచాడు. ర్యాంకింగ్స్లో ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా, లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ మూడు స్థానాలను ఎగబాకారు. వరుణ్ గతేడాది ఫిబ్రవరిలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. మార్చి నుంచి అగ్రస్థానంలో ఉన్న న్యూజిలాండ్‌కు బౌలర్ జాకబ్ డఫీని అధిగమించి నెంబర్ వన్‌గా నిలిచాడు.తాజాగా యూఏసీ వేదికగా జరుగుతున్న ఆసియా కప్‌లో అద్భుత ప్రదర్శన చేసి బౌలర్ల ర్యాంకింగ్‌లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. వరుణ్ చక్రవర్తి స్థిరమైన ఫామ్ను కొనసాగిస్తూ టీ20ల్లో నెంబర్ వన్ బౌలర్గా నిలిచాడని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. అదే సమయంలో ఎడమచేతి వాటం స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 16 స్థానాలు ఎగబాకి 23వ స్థానానికి చేరుకున్నారు. స్పిన్ ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ ఒక స్థానం మెరుగుపరుచుకొని 12వ స్థానానికి చేరుకున్నాడు. బుమ్రా 40వ స్థానానికి చేరుకున్నాడు. ఆల్రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. టీమిండియా బ్యాటర్ అభిషేక్ శర్మ తన ర్యాంకులు పదిలం చేసుకున్నాడు. యూఏఈపై 16 బంతుల్లో 30 పరుగులు, ప్వా 13 బంతుల్లోనే 31 పరుగులు చేసి కెరియర్లోనే అత్యధికంగా 884 రేటింగ్ పాయింట్లతో నెంబర్ వన్ బ్యాట్‌మెన్‌గా కొనసాగుతున్నాడు. టీమిండియా టీ20 వైస్ కెప్టెన్ శుభమన్ గిల్ నాలుగు స్థానాలు మెరుగుపరుచుకొని 39వ స్థానానికి చేరాడు. అయితే, తిలక్ వర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ర్యాంకులు దిగజారాయి. తిలక్ రెండుస్థానాలు దిగజారి నాలుగో స్థానానికి, సూర్యకుమార్ ఒక స్థానం దిగజారి ఏడో ర్యాంకుకు చేరాడు. ఆసియా కప్ జట్టులో చోటు దక్కని యశస్వి జైస్వాల్ సైతం రెండు స్థానాలు దిగజారి 13వ స్థానికి చేరుకున్నాడరు. మాంచెస్టర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ20లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన తర్వాత ఇంగ్లాండ్ ఓపెనింగ్ జోడీ ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్ వరుసగా ఒక స్థానం ఎగబాకి రెండు, మూడు స్థానాలకు చేరారు.

# ఆసీస్‌పై భారత మహిళల జట్టు ఘన విజయం




ముల్లాన్పూర్ వేదికగా ఆసీస్ జట్టుతో జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు 102 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ఆస్ట్రేలియా జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్కు దిగిన టీమ్ఇండియా 49.5 ఓవర్లలో 292 పరుగులు చేసి ఆలౌటైంది. స్మ ృతి మంధాన 117 పరుగులతో (91 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్స్ల సాయంతో) రాణించింది. దీప్తి శర్మ 40 పరుగులు (53 బంతుల్లో) చేసింది. ఆసీస్ బౌలర్లలో డార్సీ బ్రౌన్ 3, యాష్లీ గార్డనర్ 2, మేగాన్ షట్, అన్నాబెల్ సదర్లాండ్, తహ్లియా మెక్గ్రాత్ తలో వికెట్ తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ 40.5 ఓవర్లలో 190 పరుగులకే ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో ఎల్లీస్ పెర్రీ 44, అన్నాబెల్ సదర్లాండ్ 45 మాత్రమే రాణించారు. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్ మూడు, దీప్తి శర్మ చెరో రెండు వికెట్లు, రేణుకా సింగ్ ఠాకూర్, స్నేహ్ రాణా, అరుంధతి రెడ్డి, రాధా యాదవ్ తలో వికెట్ తీసుకున్నారు.

# మోడీ జీవితంపై బయోపిక్
## : ఉన్ని ముకుందన్ పోస్ట్



మలయాళం సినీ నటుడు ఉన్ని ముకుందన్.. ప్రధాని మోదీ పాత్రను పోషించనున్నారు. మోదీపై తీస్తున్న బయోపిక్‌లో అతను మోడీ రోల్ ప్లే చేయనున్నారు. అన్ని భారతీయ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. ఈ ఫిల్మ్‌కు మా వందే అని టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ పేజీల్లో పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ప్రఖ్యాత ఫిల్మ్‌మేకర్ క్రాంతి కుమార్ సీహెచ్ ఈ సినిమాను డైరెక్ట్ చేయనున్నారు.ప్రధాని మోదీ పాత్రలో నటించనున్నానని, ఈ విషయాన్ని పంచుకునేందుకు సంతోషిస్తున్నానని, మా వందే -టైటిల్‌తో ఆ ఫిల్మ్ రిలీజ్ కానున్నదని నటుడు ఉన్ని ముకుందన్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. బుధవారం ప్రధాని మోదీ 75వ జన్మదినోత్సవం సంద్భంగా ఈ ప్రాజెక్టును ప్రకటించారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదని ఆ ఫిల్మ్‌కు ట్యాగ్‌లైన్ ఇచ్చారు. అహ్మాద్‌బాద్‌లోనే పెరిగానని, తన చిన్నతనంలో మోదీని సీఎంగా చూశానని, ఆ తర్వాత 2023 ఏప్రిల్‌లో ఆయన్ను వ్యక్తిగతంగా కలుసుకున్నానని, ఆ సమయంలో మోదీపై తనకు ప్రత్యేక అభిమానం కలిగినట్లు- ముకుందన్ తెలిపారు. ఓ నటుడిగా ప్రధాని మోదీ పాత్రను పోషించడం పట్ల సంతోషంగా ఫీలవుతున్నానని, ఇది చాలా ఇన్‌స్పైరింగ్‌గా ఉందన్నారు. ప్రధాని మోదీ రాజకీయ జీవితం అసాధారణంగా సాగిందని, అయితే తాము తీయబోయే సినిమాలో మోదీని మరో కోణంలో చూపిస్తామని, తన మాతృమూర్తితో ఉన్న అనుబంధాన్ని ఆ ఫిల్మ్‌లో ఎక్కువగా ఫోకస్ చేయనున్నట్లు- నటుడు ఉన్ని ముకుందన్ తెలిపారు. ఎవరి ముందు తలవంచవద్దు అని గుజరాతీలో మోదీ చెప్పేవారని ఆయన గుర్తు చేశారు. ప్రధాన భాషల్లో మా వందే సినిమాను తీస్తామని, ఆ తర్వాత దాన్ని ప్రపంచవ్యాప్తంగా రిలీజ్‌చేయనున్నట్లు- ఆయన చెప్పారు. మోదీ బర్త్‌డే సందర్భంగా ఆయనకు విషెస్ తెలిపారు.



# వందకోట్ల క్లబ్‌లో చేరిన మిరాయ్ మూవీ

యంగ్ హీరో తేజ సజ్జా నటి శ్రియా శరణ్‌పై ప్రశంసలు కురిపించారు. తనది ఈ సినిమాలో అమ్మ పాత్ర కాదు.. ఈ కథకు అమ్మ పాత్ర అని అన్నారు. ఆమె వల్లే ఈ సినిమాకు లక్ కలిసొచ్చిందన్నారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో ఆయన హీరోగా నటించిన చిత్రం 'మిరాయ్'. రితికా నాయక్ కథానాయిక. మంచు మనోజ్ కీలక పాత్ర పోషించారు. ఇటీ-వల విడులైన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఈ సందర్భంగా విజయవాడ పున్నమి ఘాట్‌లో నిర్వహించిన విజయోత్సవాల్లో తేజ సజ్జా మాట్లాడారు.తేజ సజ్జా, మనోజ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'మిరాయ్' విజయాన్ని అందుకుంది. ఈ సినిమా సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాగా.. తొలిరోజు రూ.20 కోట్ల వసూళ్లు రాబట్టింది. ఐదు రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. తమ సినిమా రూ.100 కోట్లు- సాధించడంపై తేజ సజ్జా, మంచు మనోజ్ ఆనందం వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టారు. ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. తాజాగా ఈ సినిమా సక్సెస్ మీట్‌ను విజయవాడలో ఘనంగా నిర్వహించారు. ప్రేక్షకులంతా కుటుంబంతో కలిసి సినిమా చూడాలన్న ఉద్దేశంతోనే దీని టికెట్ ధరలు కూడా పెంచలేదని నిర్మాత తెలిపారు. ఈ విజయం తర్వాత తనలో మరింత బాధ్యత పెరిగినట్లు- తేజ చెప్పారు. ఈ సినిమా దర్శకుడు కార్తిక్ ఘట్టమనేని ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని సీక్వెల్‌లో నిధి అగర్వాల్ స్పెషల్ సాంగ్ ఉంటు-ందని తెలిపారు. నిధితో ఓ ప్రత్యేక పాట చిత్రీకరించామని.. మొదటి పార్ట్‌లో వాడలేకపోయామన్నారు.. సెకండ్ పార్ట్ కోసం కొన్ని ఐడియాలు సిద్ధంగా ఉన్నట్లు- చెప్పారు.



# ఆ సినిమా నాకు మరో జీవితాన్నిచ్చింది

''లవ్ సోనియా' విజయం నా జీవితానికి ఊహించని బహుమతిని ఇచ్చింద''ని అంటోంది కథానాయిక మృణాల్ ఠాకూర్. ఎంచుకున్న పాత్రలతోనే ప్రేక్షకుల్లో గుర్తుండిపోయే తారల్లో ముందు వరుసలో ఉంటుందీమె. తన నటనతో కట్టిపడేసే ఈ భామ. 'లవ్ సోనియా' చిత్రంతో బాలీవుడ్లోకి అడుగుపెట్టింది. ఇది విడుదలై ఇటీవలే ఏడేళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రం గురించి పంచుకుంటూ ఇన్స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది మృణాల్. ''ఒక చిన్న పట్టణానికి చెందిన అమ్మాయిని నేను.వేలాది మందిలో ఈ సినిమాకు నన్ను ఎంపిక చేసుకోవడం సంతోషంగా అనిపించింది. ఇది నా మొదటి చిత్రం మాత్రమే కాదు.. జీవితాలను మార్చే సినిమా ప్రపంచంలోకి నేను వేసిన తొలి అడుగు. 'లవ్ సోనియా' సినిమా సెట్లో ఉన్నప్పుడు నాకు కలిగిన భయం ఇంకా గుర్తుంది. ఇందులో నటించిన డెమి మూర్, రిచా చద్దా, మనోజ్ బాజ్పేయీ లాంటి నటులు ప్రతి రోజు కొత్తగా ఏదో ఒకటి నేర్పించారు. సెట్లో వీరందరి మధ్య విశాలమైన సముద్రంలో అతి చిన్న చేపలా భావించాను. కానీ ఈ చిత్రానికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఎందుకంటే నాకు మాట్లాడే ధైర్యాన్ని, చిత్రపరిశ్రమలో మరో కుటుంబాన్ని, జీవితాన్ని ఇచ్చింది. ఈ ప్రయాణంలో మద్దతుగా నిలిచి ప్రేమను పంచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు'' అని ఆ పోస్ట్లో పేర్కొంది.

## ఇళయారాజ కేసు.. నెట్‌ఫ్లిక్స్ నుంచి తొలగింపు



అగ్రకథానాయకుడు అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ'ని నెట్‌ఫ్లిక్స్ నుంచి తొలగించారు. ఈ సినిమా విషయంలో వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు దీన్ని తొలగించినట్లు నెట్‌ఫ్లిక్స్ పేర్కొంది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్ కుమార్ నటించిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. థియేటర్‌లో ఆదరణ సొంతం చేసుకున్న అనంతరం మే8న నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైంది. అయితే ఈ చిత్రంలో అనుమతి లేకుండా తన పాటలను ఉపయోగించారని ఆరోపిస్తూ ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా కోర్టులో పిటిషన్ వేశారు. ఇది కాపీరైట్ చట్టానికి విరుద్ధమని, వాటిని తొలగించాలని, పాటలు ఉపయోగించినందుకు తగిన పరిహారం ఇవ్వాలని ఇళయరాజా కోరారు. దీనిపై విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు ఆయన పాటలను సినిమాలో ప్రదర్శించొద్దంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీ-వల ఈ వివాదంపై చిత్ర నిర్మాత రవి మీడియాతో మాట్లాడుతూ.. తాము విడుదలకు ముందే అన్ని పర్మిషన్లు తీసుకున్నట్లు చెప్పారు. నిబంధనలకు అనుగుణంగా పాటలను ఉపయోగించామన్నారు.

## ఆ సినిమా చూసి తను భయపడ్డాడు

ఒకప్పుడు అగ్ర కథానాయకిగా అలరించిన శ్రియా శరణ్ ప్రస్తుతం పలు సినిమాల్లో కీలక పాత్రలతో మెప్పిస్తున్నారు. తాజాగా 'మిరాయ్'తో ప్రేక్షకుల ముందుకువచ్చారు. తేజ సజ్జా ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. దీని ప్రచారంలో భాగంగా ఈ చిత్రబృందం 'ది గ్రేట్ ఇండియన్ కపిల్ శర్మ షో'లో సందడి చేసింది. ఈ షోలో పాల్గొన్న శ్రియా శరన్ తన భర్త ఆండ్రీను తొలిసారి కలిసిన మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ''నేను పొరపాటున విమాన టికెట్ ఒక ప్రాంతానికి బదులు మరో ప్రాంతానికి బుక్ చేసుకున్నా. దీంతో ఒంటరిగా మాల్దీవులకు వెళ్లాల్సివచ్చింది. అక్కడే ఆండ్రీని తొలిసారి కలిశాను. ఒకరికిఒకరం తెలియకుండానే ఆ ట్రిప్పు ఎంజాయ్ చేశాం. మేమిద్దరం కలిసి చూసిన మొదటి సినిమా 'దృశ్యం'. ఆ మూవీ చూసి ఆండ్రీ భయపడ్డాడు'' అని శ్రియ గుర్తుచేసుకున్నారు.



# టాలెంట్ ఉంటే అవకాశం అదే వస్తుంది: మంచు మనోజ్



ఇండస్ట్రీలో రాణించాలనే తపన ఉంటే ఎవరైనా హీరోలు కావొచ్చని నటుడు మంచు మనోజ్ అభిప్రాయపడ్డారు. ఇటీవల ఆయన కీలక పాత్రలో నటించిన మిరాయ్ చిత్రం భారీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమా చూసిన తర్వాత మా అమ్మ నన్ను హత్తుకొని భావోద్వేగానికి గురైంది. నేను పోషించిన మహావీర్ లామా పాత్రపై ఆమెకు ఎంతో గర్వంగా అనిపించింది. అలాగే మా అక్క కూడా నాకు ప్రశంసలు అందించింది. కుటుంబసభ్యులతో కలిసి ఈ సినిమా చూడటం నాకు ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం అని మనోజ్ తెలిపారు. అభిమానుల మద్దతు గురించి మాట్లాడుతూ, నేను విజయం సాధించాలని నా అభిమానులు కోరుతున్నారు. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేను. ఇప్పుడు నాకు ఇంత పెద్ద కుటుంబం ఉందని గర్వంగా చెప్పగలను అన్నారు. నిర్మాత విశ్వప్రసాద్ గురించి ప్రస్తావిస్తూ, ఇండస్ట్రీలో ఇలాంటి నిర్మాతలు చాలా అరుదు. రాజీపడకుండా సినిమాలు చేస్తున్నారు అని ప్రశంసించారు. మోహన్ బాబు కొడుకు, చిరంజీవి కొడుకు మాత్రమే కాదు, ఎవరైనా హీరో కావచ్చు. మౌళీ, నీ సినిమాలో ఎప్పుడైనా విలన్ పాత్ర ఉంటే నేను చేస్తాను. ఆ తర్వాత మా మిరాయ్ సంచలనం సృష్టిస్తోంది. అలాగే కిష్కింధ పూరి కూడా విజయాన్ని అందుకుంది. ఒకేసారి రెండు సినిమాలు హిట్ అవ్వగలవని నిరూపించాం అన్నారు. అలాగే రానున్న ఓజీ గురించి మాట్లాడుతూ, ఈ నెల తెలుగు సినిమా ఇండస్ట్రీకి మర్చిపోలేనిది. పవన్ కళ్యాణ్ గారి ఓజీ కొత్త రికార్డులు సృష్టిస్తుంది అని మనోజ్ ధైర్యంగా చెప్పుకొచ్చారు.

WANTED REPORTERS

మనం
జనం కోసం అక్షర యజ్ఞం..

రెండు తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకుని ప్రజల గొంతుకై కొనసాగుతున్న మనం తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు విలేకరులు కావలెను. స్థానిక సమస్యలపై అవగాహన కలిగి తెలుగు భాషపై పట్టున్నవారు సంప్రదించగలరు..

కావలసిన ప్రాంతాలు

నల్గొండ జిల్లాలో: నల్గొండ ఆర్సీ - నార్కెట్ పల్లి, చిట్యాల, కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి, శాలి గౌరారం, తిప్పర్తి, కనగల్.
మిర్యాలగూడ ఆర్సీ - వేములపల్లి, దామరచర్ల, అడవి దేవులపల్లి, మాడ్గులపల్లి, నిడమనూరు, త్రిపురారం, అనుముల, తిరుమలగిరి, పెద్ద సూరారం.
దేవరకొండ ఆర్సీ - కొండమల్లేపల్లి, పీఏ పల్లి, గుండ్లపల్లి, చందంపేట, నీరుడు గొమ్ము, చింతపల్లి, గుర్రంపోడు, గుడిపల్లి.
మునుగోడు ఆర్సీ - చండూర్, గట్టుప్పల్, నాంపల్లి, మర్రిగూడ.

యాదాద్రి భువనగిరి జిల్లా : ఆత్మకూరు ఆర్సీ, భువనగిరి ఆర్సీ, బీబీనగర్ ఆర్సీ.
అడ్డగూడెం, చౌటుప్పల్, రామన్నపేట,
సంస్థాన్ నారాయణ్ పూర్, మోత్కూర్, ఆత్మకూర్, గుండ్లపల్లి, రాజాపేట.

మంచిర్యాల జిల్లాలో : చెన్నూరు ఆర్సీ - చెన్నూరు, జైపూర్, భీమారం, కోటపల్లి, మందమర్రి, అస్నాద్, పారుపల్లి.
మంచిర్యాల ఆర్సీ- లక్సెట్టిపేట, మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, దండేపల్లి, జన్నారం.
బెల్లంపల్లి ఆర్సీ - కాసిపేట, బెల్లంపల్లి, వేమనపల్లి, నన్నేల, తాండూర్, భీమిని, కన్నేపల్లి.

విలేకరులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్లు
93466 31006, 93912 85007

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.